ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 02.02.2026 | సంపుటి :12 సంచిక : 194 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# వికసిత్ భారత్ లక్ష్యమట!

## సామాన్యులకు లేదు ఊరట

అరుదైన ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం

ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడులో ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు

బడ్జెట్‌లో 7 హైస్పీడ్ రైల్ కారిడార్లు.. జాబితాలో హైదరాబాద్



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. లోక్ సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. లోక్ సభలో 2026-27 బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్.. మూలధన వ్యయం రూ. 12.20 లక్షల కోట్లు.. కాగా.. 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా మిగతా 2లో..

- మూడు కర్తవ్యాలు లక్ష్యంగా సాధనే లక్ష్యం
- ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నాం
- ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
- బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు
- కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు
- 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూత
- మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
- మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు
- 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా
- మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు
- రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా
- దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి సృజనాత్మకత జోడింపు
- కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటు
- విదేశీ విద్యకు వెళ్లే వారికి ఊరట
- టాక్స్ కలెక్టెడె ఎట్ సోర్స్‌ను 2శాతానికి తగ్గింపు
- కేంద్రబడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు

### ధరలు తగ్గేవి ఇవే..

విదేశీ పర్యాటక ప్యాకేజీలు
విదేశీ విద్య
ఆల్కహాలిక్ లిక్కర్ తుక్కు, కొన్ని రకాల ఖనిజాలు, షూ అప్పర్ ఎగుమతులు
సోలార్ ప్యానల్స్
ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలు
క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్‌పై
వ్యక్తిగత వినియోగానికి వాడే పరికరాలు
క్యాన్సర్, అరుదైన వ్యాధులు, డయాబెటిక్ చికిత్సకు ఔషధాలు
మన దేశ తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి పరిధి సముద్ర జలాల్లో మన జాలర్లు పట్టుకొన్న చేపలు
అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు
విద్యుత్తు వాహనాల్లో వాడే బ్యాటరీలు
భారత్‌లో తయారయ్యే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు
విమానాల విడిభాగాలు.

### పెరిగేవి..

ఆదాయపు వివరాలు సరిగ్గా చూపని వారిపై 100% జరిమానా
బహిర్గతం చేయని చరాస్థులపైనా జరిమానా
ఫ్యూచర్స్-ఆప్షన్స్ ట్రేడింగ్
విలాసవంతమైన వాచ్‌లు,
ఆల్కహాల్, సిగరెట్లు,
బీడీలు, పాన్ మసాలా, గుట్కా
కాఫీ రోస్టింగ్, వెండింగ్ యంత్రాలు
అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్ వంటి వాటి ధరలు పెరగొచ్చు.
చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు

## మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

- 140కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం
- బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రధాని మోడీ వ్యాఖ్య

2లో..

## దేశ సంక్షోభంపై మోదీ సర్కార్ గుడ్డిగా వ్యవహరిస్తోంది

- యువతకు ఉద్యోగాలు లేవు, పొదుపు ఆవిరైపోతోంది
- కేంద్ర బడ్జెట్‌పై రాహుల్ గాంధీ విమర్శలు

2లో..

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- సీఎంతో సహా మంత్రులంతా ప్రధానిని, కేంద్రమంత్రులను పలుమార్లు కలిసినా ప్రయోజనం లేదు
- జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచారు
- ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమం గురించి పట్టించుకోలేదు
- ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి):కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రులు, పార్లమెంటు సభ్యులు బృందాలుగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఆదివారం ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ హైదరాబాద్ నగర అభివృద్ధి మెట్రో రైల్ విస్తరణ ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామన్నారు. బయో ఫార్మా అంటే ముందుగా కేంద్రానికి గుర్తు రావాల్సింది తెలంగాణ ప్రభుత్వం. కేంద్రం ప్రకటించిన బయో ఫార్మా లో తెలంగాణకు నిధులను పొందుపరచకపోవడం తీవ్ర నిరాశపరిచింది కేంద్ర బడ్జెట్లో ఎలక్ట్రానిక్స్ కు రూ. 40 వేల కోట్ల కేటాయింపులు చేశారు ఇందులో కూడా తెలంగాణకు ఒక పైసా ఇవ్వకపోవడం అన్యాయం. హైదరాబాదులో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం విస్తారంగా మిగతా 2లో..



## సీఎం రేవంత్‌రెడ్డికి అరుదైన గౌరవం

### హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో జరిగే ఏఐ పాలసీ సదస్సుకు ఆహ్వానం

### వర్చువల్‌గా హాజరవుతానన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి):ప్రఖ్యాత హార్వర్డ్ కెన్నెడీ స్కూల్(హెచ్‌కేఎస్) మార్చిలో నిర్వహించే తొలి ఏఐ సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. ఈ సదస్సుకు దేశం నుంచి ఆయనకొక్కరికే ఆహ్వానం అందింది. హెచ్‌కేఎస్ డీన్ జెరెమీ వీన్‌స్టయిన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్వాహకురాలు రుక్సాండా రెనిటా, ఇతర సభ్యులు సీఎంను కలిసి కోరారు. హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు. మిగతా 2లో..

## ఎస్‌ఎల్‌బీసీ జాప్యం వద్దు

- త్వరితగతిన పూర్తి చేయండి
- నిర్మాణంలో ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించం
- నిరంతరం పనుల సమీక్షపై రూట్ మ్యాప్
- భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వం చేతికి హెలి-బోర్న్ సర్వే నివేదిక: ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఎల్.బి.సి నిర్మాణంపనులలో జాప్యాన్ని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.సొరంగం మార్గం పనులను నిరంతరం కొనసాగించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వివరించారు. అర్ధాంతరంగా నిలిచి పోయిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ కై చేపట్టిన హెలి-బోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన చెప్పారు.శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మెడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణ పనులపై ఆయన ఆదివారం సాయంత్రం నీటిపారుదల శాఖాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేయడానికి అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలాక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన తెలిపారు.సొరంగమార్గం పూర్తికి సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం మిగతా 2లో..

## ఫోన్ ట్యాపింగ్ మీ ఆదేశాలతోనే జరిగిందా?

### ఐదు గంటలపాటు కేసీఆర్‌ను విచారించిన సిట్

### నందినగర్‌లోని నివాసంలోనే మాజీ సీఎంను ప్రశ్నించిన అధికారులు

### విచారణ సందర్భంగా ఆడియో, వీడియో రికార్డులు సేకరణ

హైదరాబాద్(జనంసాక్షి):ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు సుమారు 5 గంటలపాటు విచారణ చేశారు. విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రూపంలో ఐదుగురు ఉన్నతాధికారుల సిట్ బృందం రికార్డింగ్ చేసింది. అలాగే దీనితో పాటు ఆయన ఇచ్చిన కీలక వాంగ్మూలాలను నమోదు చేశారు. అనంతరం సిట్ అధికారులు నందినగర్ నుంచి వెళ్లిపోయారు. కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ అంశంలో సిట్ అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఈ విచారణ నందినగర్‌లోని నివాసం రెండో అంతస్థు గదిలో జరుగింది. ఈరోజు మధ్యాహ్నం పలు డాక్యుమెంట్లు, పరికరాలతో సిట్ అధికారులు కేసీఆర్ నివాసంలోకి వెళ్లారు. సిట్ విచారణ నేపథ్యంలో నందినగర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాగా అంతకుముందు రెండు రోజుల క్రితం సిట్ ఇచ్చిన నోటీసు ప్రకారం కేసీఆర్ ఆదివారం మధ్యాహ్నం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి హైదరాబాద్ నందినగర్ మిగతా 2లో..



## బీఆర్ఎస్ కార్యకర్తల హల్‌చల్

కార్యకర్తలకు అభివాదం చేసిన కేసీఆర్

2లో..



## సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం

### కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం



హైదరాబాద్(జనంసాక్షి): ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రూ. కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలు సమకూర్చుతామని చెప్పారు.నిజామాబాద్‌లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. ఈ క్రమంలో తీవ్రగాయాలు కావడంతో మిగతా 2లో..


## వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ ముందుకొచ్చింది

### దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం

### చైనా కూడా మాతో చర్చలు జరిపే అవకాశం : ట్రంప్



వాషింగ్టన్(జనంసాక్షి): భారత చమురు దిగుమతుల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక డీల్ కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై వెనెజువెలా చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం" అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.ఇక, వెనెజువెలా చమురు కోసం చైనా కూడా తమతో చర్చలు జరిపే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. దాన్ని మేము స్వాగతిస్తామ న్నారు. మరోవైపు వెనెజువెలాలో పాలనపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం ఇప్పుడు తన అధీనంలోనే ఉందన్నారు. తాను కోరుకున్నట్లుగానే ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అక్కడి చమురు నిల్వలు పూర్తిగా అమెరికా చేతికి వచ్చే వరకు ఆమెనే మిగతా 9లో..



## తప్పుచేస్తే విచారించొద్దా?

- కేసీఆర్ చట్టానికి అతీతుడా?
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన సిట్ విచారణ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల డిసిసి అధ్యక్షులు తప్పకుండా ఈ అంశంపై స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. కేసిఆర్ పాలనలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, ప్రజాధన దుర్వినియోగంపై సిట్ విచారణ జరుగుతుండటం ప్రజాస్వామ్యానికి, చట్టపాలనకు అనుకూలమని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చట్టం ముందు అందరూ సమానమే అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉందని, నిజాలు బయటపడాలన్నదే తమ లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ గారు స్పష్టం చేశారు. సిట్ విచారణను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు, రాజకీయ ఒత్తిళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని డిసిసి అధ్యక్షులు ఖండించాలని, కాంగ్రెస్ పార్టీ వైఖరిని బలంగా ప్రజల మిగతా 2లో..

## కేసీఆర్ బిడ్డే చెప్పింది కదా.. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని..

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు. సాక్షాత్తు హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అఫిడవిట్ వేశారు. నేతలు, వ్యాపారులు, సినీ నటుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అందులో పేర్కొన్నారని కిషన్ రెడ్డి తెలిపారు. కాగా దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరం గా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి మిగతా 2లో..

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

అభివృద్ధి చెందింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈసీఐ లాంటి సంస్థలను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్ అన్నట్టుగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఈ విభాగంలో కూడా నిధులు ఇవ్వకపోవడం అన్యాయం. ఫార్మ హబ్ గా ప్రపంచానికి హైదరాబాదు గుర్తింపు కోవిడ్ సమయంలో ఈ దేశానికే కాకుండా ప్రపంచాన్ని కూడా భారత్ బయోటెక్ ఔషధాలను అందించింది సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోవిడ్ సమయంలో సందర్శించారు. కానీ ఫార్మ హబ్ లో కూడా తెలంగాణను పేర్కొనలేదు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగం పైన ఫోకస్ పెట్టింది గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ సందర్భంగా కూడా ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడితో క్రీడలు నిర్వహించాం. క్రీడారంగం పైన ప్రత్యేక దృష్టి సారించి ముందుకెళ్తున్న క్రమంలో తెలంగాణ కేంద్రానికి ఎందుకు గుర్తుకు రాలేదు. ఆరెంజ్ ఎకానమిలో హైదరాబాద్ సెంట్రిక్ ముంబైకి తరలించారు. తెలంగాణ ఏమి తప్పు చేసింది. ఆడియో వీడియో గేమింగ్ కామెక్స్ లాంటి వాటికి హైదరాబాద్ నగరం బిగ్గెస్ట్ సెంటర్. ఆరెంజ్ ఎకానమిలో హైదరాబాద్ పై దృష్టి పెట్టకుండా ముంబైలో పెట్టడం ఏంటిహైదరాబాద్ మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్నది దేశంతో పాటు ఇతర దేశాల నుంచి కూడా హైదరాబాదులో అందుబాటులో ఉన్న మెడికల్ ఫెసిలిటీని ఉపయోగించుకోవడానికి వస్తున్నారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్ లో ఇతర రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. టూరిజం విభాగంలో కూడా తెలంగాణ రాష్ట్రాన్ని పొందుపరచకపోవడం అన్యాయం యునెస్కో గుర్తించిన రామప్ప లాంటి హెరిటేజ్ దేవాలయం మన్ననూరు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ వాటర్ ఫాల్స్ కృష్ణ గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాలు అటవీ ఇటీవల జరిగిన మేడారం సమ్మక్క సారక్క జాతరకు న్యూజిలాండ్ దేశస్తులు వచ్చి దర్శించుకున్నారు ఇంత గొప్పగా ఉన్న తెలంగాణ టూరిజంను ప్యాకేజీలో పేర్కొనలేదు. రేర్ ఎర్త్ మినరల్స్ లో కూడా తెలంగాణ పై కేంద్రం దృష్టి సారించలేదు. ఇప్పటికే సింగరేణి సంస్థ సత్తుపల్లి రామగుండం లో స్కాండియం, లిథియంను వెలికితీయడానికి రేర్ ఎర్త్ మినరల్స్ ప్రాసెస్ ను నడుపుతున్నది. తెలంగాణ రాష్ట్రానికి సెమీ కండక్టర్ మంజూరు చేయాలని ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా వెళ్లి ప్రధానమంత్రిని కలిసినప్పటికీ బడ్జెట్లో మిగతా రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు మొండి చేయి చూపించారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమంపై ఈ బడ్జెట్ లో దృష్టి సారించలేదు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే పని చేస్తున్నారు దీనివల్ల గ్రామీణ ప్రాంత పేదలకు తీవ్ర నష్టం జరగనుంది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వికసిత్ భారత్ గోలుకు కాంట్రిబ్యూట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి త్రీ మిలియన్ డాలర్ ఎకానమీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లక్ష్యం చేరుకోవడానికి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బలమైన పునాదులకు ప్రోత్సాహం అందించి ముందుకెళ్లాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందితెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకొని రాజకీయాల కతీతంగా తెలంగాణ పార్లమెంటు సభ్యులు ఈ బడ్జెట్ సెషన్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లను కలిసి నిధులు కేటాయించాలని వినతి పత్రాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఫిజికల్ డెఫిషిట్ లో రాష్ట్రానికి నాలుగు శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది కానీ కేంద్రం మాత్రం 4.3 శాతం ఫిజికల్ డెఫిషిట్ పెట్టుకుంది తెలంగాణకు మాత్రం అనుమతి ఇవ్వలేదు తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా? ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక గతులు పెంచడానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించే వీలుగా బడ్జెట్ ఉండాలని ఆశిస్తున్నాను కక్ష్య సాధింపు చర్యలకు ఈ ప్రభుత్వం పాల్పడదు అత్యంత ప్రజాస్వామ్యతమైన పరిపాలన అందించడమే మా ప్రజా ప్రభుత్వం ధ్యేయం.

## దేశ సంక్షోభంపై మోదీ సర్కార్ గుడ్డిగా వ్యవహారిస్తోంది'

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. "ఇదొక గుడ్డి బడ్జెట్. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ సంక్షోభాలు దీనికి కనిపించడం లేదు" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి ఆలోచనలు అడుగంటాయని, దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సవాళ్లకు ఇందులో ఒక్కటంటే ఒక్క పరిష్కారం కూడా లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు.రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా బడ్జెట్?పై స్పందించారు. దేశంలోని దయనీయ పరిస్థితులను వివరిస్తూ ఆరు కీలక అంశాలను ప్రస్తావించారు. "దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవు, తయారీ రంగం కుప్పకూలుతోంది. పెట్టుబడిదారులు భయపడి తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. సామాన్యుడి ఇంట్లో పొదుపు ఆవిరైపోతోంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆవేదనలో ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా రాబోయే ఆర్థిక ముప్పులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. దేశం తప్పుడు మార్గంలో వెళ్తున్నప్పుడు, బడ్జెట్ ద్వారా దాన్ని సరిదిద్దాలి. కానీ ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. వాస్తవాలను చూడటానికి ఇష్టపడటం లేదు. సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు ఇందులో శూన్యం" అని రాహుల్ విమర్శించారు.

## మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనర చేస్తుందని, ఇది చరిత్రాత్మక బ్జడెట్ అని కొనియాడారు. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది' అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ ఆ ఎక్స్‌ప్రెస్‌కు బ్జడెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

రాష్ట్రాలను విస్మరించిన కేంద్ర బడ్జెట్: ఎంపి శశిథరూర్

గత కొన్నేళ్లుగా చేస్తున్న బడ్జెట్ ప్రసంగాలలో ఇది చాలా చిన్నదిగా అనిపిస్తోంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారి కోసం ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహక చర్యలు తీసుకోలేదు. రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదు. అసలు భవిష్యత్తులో కేంద్రం ఏమి చేయబోతోంది అనే విషయాలపై ఎటువంటి వివరాలు లేవు. కేరళలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కోసం 15 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. దానిపై ఎటువంటి ప్రకటన రాలేదు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద స్థాపించనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టతనివ్వలేదు. ఈ బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని -కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. ఎంపీ శశిథరూర్ పెదవి విరిచారు. ఒక మలయాళీగా తనకు బడ్జెట్ సంతృప్తి కలిగించలేదని అన్నారు. బడ్జెట్‌లో కేరళ ప్రస్తావనే లేకపోవడం తనను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పారు. ఆయుర్వేదం, మత్స్యకారులు, కొబ్బరితోటలు, షిప్ మరమ్మతులకు సంబంధించి బ్జడెట్‌లో ఎలాంటి ప్రస్తావనలు లేవన్నారు. కేరళకు సుదీర్ఘమైన ఆయుర్వేద చరిత్ర ఉందని, ఆయుర్వేద ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ కోసం తామంతా ఎదురుచూస్తున్నామని, కానీ ఆ ప్రస్తావనే బ్జడెట్‌లో లేకుండా పోయిందని శశిథరూర్ విమర్శించారు. కనీసం మత్స్యకారులు, కొబ్బరితోటల సంబంధించి ఏదైనా ప్రకటన ఉండొచ్చని ఆశించామని, అది కూడా లేదని అన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యమట!

ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
బడ్జెట్‌లో 7 హైస్పీడ్ రైల్ కారిడార్లు.. జాబితాలో హైదరాబాద్
బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు
కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు
200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూత
మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు
2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా
మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు
రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా
దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి సృజనాత్మకత జోడింపు
కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటు
విదేశీ విద్యకు వెళ్లే వారికి ఊరట
టాక్స్ కలెక్టెడ ఎట్ సోర్స్‌ను 2శాతానికి తగ్గింపు

కేంద్రబడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు అంచనా వేశారు. 2027లో రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియ జేశారు. ఈ బ్జడెట్ ను యువశక్తి బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్ ఇదంటూ పేర్కొన్నారు.నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కార్యవ్యాలను సాధిస్తామని, ఇది యూనిక్ బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ ఉంటుందని అన్నారు. కర్తవ్యం1: సమ్మిళిత ఆర్థిక వృద్ధి. కర్తవ్యం 2: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం 3: సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని తెలిపారు. బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు, ఎపి, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల కారిడార్, మూడు డెడికేటెడ్ కెమికల్ పార్కుల నిర్మాణం చేపడుతామని, ప్రస్తుతమున్న ఎన్ఐపిఇఆర్ఎస్ ఆధునీకరించడంతో పాటు దేశంలో రెండు హైటెక్ టెక్నాలజీ రూమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు, దేశంలో కొత్తగా మూడు కెమికల్ రీసెర్చ్ పార్కులు, సెమీకండక్టర్ మిషన్ కోసం రూ.40 వేల కోట్లు, జౌళి రంగానికి కేంద్ర బ్జడెట్‌లో చేయూతనివ్వడంతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం చేపడుతామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సెమి కండక్టర్ మిషన్ 2.క్ష ప్రారంభిస్తామని, త్వరలో నేషనల్ ÷బైర్ స్కీమ్ ప్రారంభం, టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కొత్త పథకం, దేశంలో కొత్త మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహానికి పథకం ఏర్పాటు చేస్తామని, అత్యంత నాణ్యత కలిగిన క్రీడా వస్తువుల తయారీకి పథకం ఉంటుందని, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూతనిస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఎస్ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లు ఇస్తామని, మైక్రో సెక్టార్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని, ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. నగరాలే దేశ గ్రోత్ ఇంజిన్లు అని, రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాట్నా, వారణాసిల్లో షిప్ రిపేర్ ఎకోసిస్టమ్, ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో పాటు ముంబై-పుణెలి, పుణెలి-హైదరాబాద్, హైదరాబాద్- చెన్నై రూట్లలో హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించడంతో పాటు ఢిల్లీ- వారణాసి, వారణాసి- సిలిగురి మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిరత ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతక ను వేగవంతం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం వంటివి ప్రధానంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్ థీమ్‌గా బడ్జెట్ ఉందన్నారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మాదిరిగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎంతో చేసిందని నిర్మలా సీతారామన్ అన్నారు. 2025లో 350కి పైగా సంస్కరణలు ప్రారంభించినట్లు చెప్పారు.కొన్ని వస్తువులకు పన్నుల మినహాయింపులు, తగ్గింపును ప్రకటించారు. దీంతో పలు వస్తువుల ధరలు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువుల ధరలు మాత్రం మరింత పెరగనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం. దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం వంటివి ప్రతిపాదించారు. టెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం. టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేల కోట్లు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల స్థాపన. రెడో కర్తవ్యం.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు. ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు. ఆయుష్ కేంద్రాల అప్‌గ్రేడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు. ప్రైవేటు రంగంలో పశువైద్య, దయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత. నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు. ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం.

దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన. మానసిక వ్యాధుల చికిత్సకు రాంచీ, తేజ్‌పూర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ అప్‌గ్రేడేషన్. భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం

తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్‌ల అందించటం. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి.మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్‌గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

బడ్జెట్‌లో 7 హైస్పీడ్ రైల్ కారిడార్లు.. జాబితాలో హైదరాబాద్ రైల్వేకు సంబంధించి వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి కీలక ప్రకటన చేశారు. దేశంలో ఏడు నగరాలకు హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించారు. ఇందులో హైదరాబాద్‌ను కలుపుతూ హైదరాబాద్- బెంగళూరు, పుణె-హైదరాబాద్, **హైదరాబాద్-చెన్నై కారిడార్లు ఉన్నాయి. ఏడు కారిడార్లు ఇవీ..** మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతేడాది రూ.11.2 లక్షల కోట్లు కేటాయించగా.. ఈసారి స్వల్పంగా పెంచారు. దేశ మౌలికసదుపాయాల కల్పన గురించి మాట్లాడుతూ.. ఈ కారిడార్ల గురించి సీతారామన్ వెల్లడించారు. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని చెప్పారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇవి ప్రయాణ సమాయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయని పేర్కొన్నారు.

అరుదైన ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు బడ్జెట్ ప్రసంగంలో ఆమె పేర్కొన్నారు. ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచస్థాయి కంటెయినర్ ఉత్పత్తి కార్పొరేషన్ నెలకొల్పుతామని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి సృజనాత్మకత జోడింపు ఆరెంజ్ ఎకానమీ' లక్ష్యంగా ఆయా రంగాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి, భవిష్యత్తులో సృష్టించే ఉపాధి అవకాశాలకు సరిపడే నైపుణ్యాలతో సిద్ధంగా ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా, వినోదం, మేధోసంపత్తి వంటి క్రియేటివ్ రంగాలను సూచించే పదమే ఆరెంజ్ ఎకానమీ. భౌతిక ఉత్పత్తుల కన్నా ప్రధానంగా సృజనాత్మకత, ఆలోచనలు, సాంస్కృతిక సంపద నుంచి వచ్చే విలువను ఇలా పేర్కొంటారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, కామిక్స్, డిజైన్, టూరిజం, వినోదం వంటి రంగాలు ఇందులోకి వస్తాయి.యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2030 నాటికి 20లక్షల మంది నిపుణులు అవసరమని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేర డిమాండ్‌ను అందుకునేందుకు వీలుగా.. ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా 15వేల పాఠశాలలు, 500 కాలేజీల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలని తాజా బ్జడెట్‌లో ప్రతిపాదించింది.

## తప్పు చేస్తే విచారించొద్దా?

ముందుంచాలని ఆయన సూచించారు.రాష్ట్ర ప్రజలు సత్యాన్ని తెలుసుకోవాలనుకుంటున్నారని, అందుకు ఈ విచారణ కీలకమని టీపీసీసీ అధ్యక్షులు అన్నారు.

## కేసీఆర్ బిడ్డే చెప్పింది కదా.. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని..

కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ది పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ది కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బ్జడెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బ్జడెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టిందని కిషన్ రెడ్డి వెల్లడించారు.

### ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం

హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మృతిచెందారు.

## మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకం

**బెంగాల్‌కు కేటాయింపులను పట్టించుకోని కేంద్రం బడ్జెట్‌పై మండిపడ్డ మమతా బెనర్జీ**

**కోల్‌కతా(జనంసాక్షి):** మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ తో సామాన్యులకు ప్రయోజనమేమీ లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. కేంద్ర బ్జడెట్-2026పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తప్పుదారి పట్టించిందని, బెంగాల్‌కు రావాల్సిన నిధుల వాటాను నిలిపివేసిందని అన్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనాలు చేకూర్చడానికి బదులుగా కొత్త ఆర్థిక కారిడార్ల పేరుతో పచ్చి అబద్ధాలు చెబుతోందని, మాటల గారడీకి పాల్పడిందని తప్పుపట్టారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రస్తావించిన ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టామని, మూడు కారిడార్లంటూ కేంద్రం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని అన్నారు.

# మీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందా?

నివాసానికి చేరుకున్నారు. కేసీఆర్ ఎర్రవల్లి నుంచి బయలుదేరే ముందు ఫామ్‌హౌస్ వద్దకు భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు తమ అధినేతకు అడుగడుగున నీరాజనాలు పలికారు. కేసీఆర్ కాన్వాయ్‌పై గులాబీ పూల వర్షం కురిపించారు. దారి పొడువునా జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ హైదరాబాద్ నందినగర్ నివాసానికి చేరుకునే సమయానికి అక్కడకు వచ్చిన పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. అంతకు ముందే కేసీఆర్ నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు ఆయనను విచారించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. కేసీఆర్ వాంగ్మూలాలు నమోదు చేసుకునేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఆడియో, వీడియో పరికరాలను అమర్చుకున్నారు. కేసీఆర్?ను ప్రశ్నిస్తున్న సమయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర కుటుంబ సభ్యులు నందినగర్ నివాసంలోనే ఉన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఆధారాల ధ్వంసంపై తొలుత ప్రారంభమైన దర్యాప్తు అక్రమ ఫోన్ ట్యాపింగ్‌వైపు మళ్లింది. ఈ వ్యవహారంలో అంతిమ లబ్ధిదారులెవరో తేల్చే ప్రయత్నాల్లో ఉన్న సిట్ అధికారులు నిందితుల నుంచి ఇప్పటికే సేకరించిన వాంగ్మూలాలను కేసీఆర్ ముందుంచి వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

ఇది కక్షసాధింపుకే పరాకాష్ట

కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ పేరుతో సిట్ విచారణ చేయడం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పరాకాష్ట అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆక్షేపించారు. సిట్ పేరిట ప్రతిపక్ష నేతపై ప్రతీకార దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ విచారణలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలనూ ఉల్లంఘించారన్న ఆయన నోటీసులు ఇవ్వడంలో చట్టపర విధానాలు పాటించలేదన్నారు. ఎర్రవెల్లిలో ఇవ్వకుండా నందినగర్ ఇంటి గోడలకు అంటించారని ఇలా చేయడం చౌకబారు రాజకీయం అని అన్నారు. కేసీఆర్ ఎక్కడ ఉంటున్నారో ఈ రాష్ట్రానికి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ సిట్ 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్'గా పనిచేస్తోందని ఆరోపించారు. విచారణకు సహకరిస్తున్నప్పటికీ పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ భద్రత కోసం, ఉగ్రవాద నిర్మూలన కోసం ఫోన్ ట్యాపింగ్ ఉంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం దానిని దుర్వినియోగం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. వ్యక్తిగత పనుల కోసం, రాజకీయ కక్షలకు ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకున్నారని ఆక్షేపించారు.

సీఎం నివాసం వద్ద భద్రత పెంపు

జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని బీఆర్ఎస్ నేతలు ముట్టడిస్తారనే సమాచారంతో అక్కడ భద్రత పెంచి పోలీసులను మోహరించారు. సీఎం, మంత్రుల నివాసాలను బీఆర్ఎస్ నేతలు ముట్టడిస్తారనే అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల హల్‌చల్

**హైదరాబాద్(జనంసాక్షి):**భారత బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థి తులు నెలకొన్నాయి. తెలంగాణ భవన్ నుంచి ముఖ్య మంత్రి నివాసానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంబీ పూర్ రాజుతోపాటు ఇతర నేతలు ప్రయత్నించారు. ఆ నేతలంతా బయటకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకు న్నారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ నేతలు శాంతి యుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు అప్రజా స్వామికంగా వ్యవహరిస్తున్నారని శంబీపూర్ రాజు మండిపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు ఇలాగే వ్యవహ రిస్తే తాము మరింత దూకుడుగా వెళ్లాల్సి ఉంటుం దన్నారు. విచారణ అనంతరం నందినగర్ నివాసం వద్ద పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. ఈ సందర్భంగా నందినగర్‌లోని కేసీఆర్ ఇంటివద్దకు బీఆర్ఎస్ నేతలు భారీగా చేరుకున్నారు.

## ఎస్ఎల్‌బీసీ జాప్యం వద్దు

చేశారు.భౌగోళికంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టడానికి ఈ సర్వే ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు.సొరంగమార్గం పూర్తి చేయడానికి గాను ఆధునిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు శాస్త్రీయ పద్దతిలో నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టు నిర్వహణకై ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్ ను నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు.నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు భద్రతా,నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడడంతో పాటు అధికారులు రూపొందించిన డిజైన్ ప్రకారం నిర్మాణం కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన చీఫ్ ఇంజనీర్ కు సహకరించేలా ఉండేందుకు స్వతంత్ర పర్యవేక్షణ కన్సల్టెంట్ ను నియమించాలని ఆయన సూచించారు.నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు గాను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారని ఆయన చెప్పారు.అదే సమయంలో సొరంగ మార్గంలో ఏర్పడుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు గాను ప్రత్యేక జియో టెక్నీకల్,జియాలజికల్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.దీనితో పాటు కాళేశ్వరం బ్యారేజ్ ల పనుల పునరుద్దరణ పనులు వేగవంతంచేయడానికి అవసరమైన సాంకేతిక సంస్థలను,డిజైన్ కన్సల్టెంట్స్ సమన్వయం ఆవశ్యకత గురుంచి ఆయన వివరించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్ ,ప్రాజెక్ట డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.పరస్పరం సమన్వయం చేసుకుంటూ పోతే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభతరమౌతుందని ఆయన చెప్పారు .ఈ మేరకు ఫిబ్రవరి 16 తరువాత ఎన్.డి.ఎస్.ఏ నిపుణుల కమిటీ తో సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు.పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి అరుదైన గౌరవం

**సీఎంను కలిసిన విద్యార్థులు..**

అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో తన చివరి రోజున సీఎం రేవంత్‌రెడ్డి వివిధ సంస్థల ప్రతినిధులు, వర్సిటీలోని వివిధ పాఠశాలలతోపాటు ఎంఐటీ, కొలంబియా తదితర క్యాంపస్‌లోని విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో ముచ్చటించారు. నాయకత్వం, విజయాలు, ఆర్థికాభివృద్ధి, అభివృద్ధి నమూనాలు, స్థిరత్వం, పర్యావరణ సమస్యలు, రైతు సంక్షేమం, మహిళలు, యువత సాధికారత అంశాలపై చర్చించారు. తెలంగాణ రైజింగ్ 2047 గురించి వివరించారు. ఈ విజన్‌తో అందరికీ సమాన అవకాశాలు, ఫలాలు అందడంతోపాటు సాధికారత సాధ్యమవుతుందన్నారు. హార్వర్డ్‌లోని భారతీయ విద్యార్థులు దేశానికి తిరిగొచ్చి పనిచేయాలని, తెలంగాణ రైజింగ్ రాయబారులుగా మారాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆయనతో తెలిపారు.

## అమెరికాతో యుద్ధం కోరుకోవడం లేదు: ఇరాన్

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు. స్థానిక మీడియాలో ప్రసారమైన వీడియోలో పెజెష్కియాన్ మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, యూరప్ నేతలు మా సమస్యలను లక్ష్యంగా చేసుకున్నారు. మా ప్రజలను రెచ్చగొట్టి.. దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నించారు. ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు కేవలం సామాజిక నిరసనలు కావని అందరికీ తెలుసన్నారు. ఇక, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్‌సిసితో.. పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాతో తాము యుద్ధం కోరుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌కు గానీ, అమెరికాకు గానీ సంఘర్షణలు ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇరాన్ తమతో చర్చలకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "వారు మాతో మాట్లాడుతున్నారు. ఏదైనా ఒప్పందం జరుగుతుందో లేదో చూడాలి. మొత్తంగా ఏం జరుగుతుందో చూద్దాం" అన్నారు. అయితే, అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నాయని పరోక్షంగా హెచ్చరికలు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా దాడి ప్రణాళికల గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మంత్రి శ్రీధర్ బాబు



మంథని, (జనంసాక్షి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. తమ ప్రభుత్వం ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు చేపట్టడం లేదని ఆయన తెలిపారు. అలాంటి ఉద్దేశం ఉంటే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో చాలా మందిపై కక్ష సాధింపులకు దిగేవాళ్ళమని చెప్పుకొచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తున్నామని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## మేడారంలో పారిశుధ్యంలో క్లీన్‌గా ఉండాలి

- జాతర విజయానికి పారిశుధ్య సిబ్బంది సేవలు అనిర్వచనీయం
- మేడారంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు బ్యూరో,ఫిబ్రవరి01(జనం సాక్షి): ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన పారిశుధ్య నిర్వహణపై పంచాయతీరాజ్, శానిటేషన్ శాఖల సిబ్బందితో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి మేడారంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తులు హాజరైన మహా జాతరను పరిశుభ్రంగా,సురక్షితంగా నిర్వహించడంలో పారిశుధ్య సిబ్బంది కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. జాతర కాలమంతా నిరంతరంగా క్షేత్రస్థాయిలో పనిచేసి, మేడారాన్ని పరిశుభ్రంగా ఉంచి నందుకు సిబ్బందికీ ధన్యవాదాలు తెలిపారు. జాతర ముగిసిన తర్వాత కూడా పారిశుధ్య పనులు ఎంతో ముఖ్యమని పేర్కొన్న మంత్రి,మేడారంలో పూర్తిస్థాయిలో పరిశుభ్రత సాధించే వరకు శానిటేషన్ సిబ్బంది విధులు కొనసాగించాలని ఆదేశించారు. మేడారానికి రాకపోకలు సాగించిన రహదారులు, పరిసర ప్రాంతాలు గద్దెల ప్రాంగణాలు, భక్తుల బస ప్రాంతాలు పూర్తిగా శుభ్రపడి,స్వచ్ఛమైన మేడారాన్ని గ్రామస్తులకు అప్పగించే వరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోనే పనిచేయాలని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి, మేడారాన్ని పూర్తిగా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. జాతర అనంతరం కూడా అదే బాధ్యతతో పనిచేసి, గ్రామస్తులకు స్వచ్ఛమైన మేడారాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,డిపిఓ వెంకయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి మొండిచేయి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజినీకాంత్, టి.నాగరాజు

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజినీకాంత్, టి.నాగరాజు అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయని, దేశ భవిష్యత్తును నిర్మించే విద్యారంగాన్ని ప్రాధాన్యంగా చూడాల్సిన సమయంలో, కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా పక్కన పెట్టిందని, ఈ బడ్జెట్‌లో మొత్తం విద్యారంగానికి కేటాయించిన మొత్తం రూ. 1,39,289 కోట్లు మాత్రమేనని, ఇది మొత్తం కేంద్ర బడ్జెట్‌లో సుమారు 2.6 శాతం మాత్రమే. జీడీపీలో విద్యకు 6 శాతం ఖర్చు చేయాలనే లక్ష్యానికి ఇది చాలా దూరంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు కేటాయించిన మొత్తం రూ. 83,562 కోట్లు మాత్రమేనని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కొనసాగుతున్నప్పటికీ, నిధుల పెంపు జరగలేదని, మరోవైపు దేశవ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే విధానం అమలవుతుండటం అత్యంత ఆందోళనకరమని తెలిపారు. ఉన్నత విద్య కోసం కేటాయించిన మొత్తం రూ. 55,727 కోట్లు మాత్రమే. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, పరిశోధనా సంస్థల అభివృద్ధికి ఇది పూర్తిగా సరిపోదని, ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌ల తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్న పరిస్థితి ఏర్పడుతోందని, తద్వారా నూతనంగా ఏర్పాటు చేసస్తామన్న యూనివర్సిటీల ఏర్పాటు ఈ నిధులు సరిపోవని తెలిపారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐలు, ఐఐటీలు, ఎనఐటీలకు సంబంధించిన సాంకేతిక విద్యా రంగానికి కేటాయింపులు సుమారు రూ. 23,000 కోట్లకు పరిమితమయ్యాయని, నిరుద్యోగ సమస్య పెరుగుతున్న సమయంలో యువతకు నైపుణ్యాలు కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని, మహిళా విద్యను పెంచటానికి నూతనంగా జిల్లాకు ఒక బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, కానీ కేటాయింపులు జరగలేదని తెలిపారు. నూతన విద్యా విధానం (ఎన్ఈపి-2020) అమలు చేస్తామని చెప్పే కేంద్ర ప్రభుత్వం, దానికి అవసరమైన ఆర్థిక వనరులు కేటాయించకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని, ఒకవైపు విద్యాభివృద్ధి అంటూనే, మరోవైపు పాఠశాలల మూసివేత, నిధుల కోత ద్వారా ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యారంగానికి కేటాయింపులను పెంచి, ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయడం నిలిపివేసి, విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యా సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

## భావసార్ విజన్ ఇండియా ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) : భావసార్ విజన్ ఇండియా హైదరాబాద్ ఏరియా-104 సాధారణ సభ (ప్రమాణ స్వీకార కార్యక్రమం) కాచిగూడలోని భావసార్ భవన్‌లో నిర్వహించారు. సభలో హింగులాంబికా పూజ, హారతి నిర్వహించబడింది మరియు గాయత్రి మంత్రాన్ని పారాయణం చేశారు. అనంతరం మరణించిన ఆత్మలకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు. గణేశ వందనను తనిష్కా పాటంగే సమర్పించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా మనీష్ సుత్రావే (జాతీయ అధ్యక్షుడు, భావసార్ విజన్ ఇండియా), ఉమేష్ ఎ.జైతానే (అధ్యక్షుడు, తెలంగాణ భావసార్ క్షత్రియ రంగ్రేజ్ సమాజ్), శ్రీ బాబురావు గడాలే (బీవీఎల్ గవర్నర్), శ్రీ ప్రవీణ్ పాటంగే (డిప్యూటీ గవర్నర్), డా. ప్రశాంత్ నిమ్కర్ (చీజుజ సభ్యుడు), షీతల్ నీమ్కర్ (మాజీ అధ్యక్షురాలు), శంకర్ అసుట్కర్ (మాజీ కార్యదర్శి) హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ పదవీధారులు అశ్విని పాటంగే (అధ్యక్షురాలు), ఘనశ్యామ్ పాటంగే (కార్యదర్శి), జవహర్ భార్డే (ఖజాంచి), లలిత సుత్రావే, సప్నా ఘనాటే, హేమారాణి పరంకర్, రూపా వాల్వే, అర్చనా సుత్రావే, తులసి బగాడే, అనితా పారేకర్, జ్యోతి గడాలే, సంగీత ఘనాటే, రాకేష్ ఘనాటే మరియు రాజేశ్వర్ ఘనాటే ప్రమాణ స్వీకారం చేశారు. సంక్రాంతి పండుగను తిల్గుడ్, టిక్లీ ప్యాకెట్లను పరస్పరం మార్చుకోవడం ద్వారా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని అనితా పారేకర్ మరియు హర్షిణి బగాడే ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్ ఇజత్కర్ (సికింద్రాబాద్ బీవీఎల్ అధ్యక్షుడు), సరితా దేవాత్రాజ్ (మల్కాజిగిరి బీవీఎల్ అధ్యక్షురాలు), శశికాంత్ పిస్సాయ్, శ్యామ్ కుమార్ నజారే, చంద్రకాంత్ పాటంగే, బాలకిషన్ సుత్రావే, శ్రీధర్ గడాలే, వందనా అసుట్కర్ తదితరులు హాజరయ్యారు. 2025 సంవత్సరపు పదవీధారులందరికీ షీతల్ నీమ్కర్ స్మారక చిహ్నాలు అందజేశారు.

# కానిస్టేబుల్ సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళి

- సౌమ్య కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ
- సౌమ్య కుటుంబానికి 'కోటి' ఎక్స్‌గ్రేషియా
- సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం.. సౌమ్య సర్వీస్ కాలానికి ప్రభుత్వ వేతనం చెల్లిస్తాం
- దుండగుల వెన్ను వణికేలా కఠిన చర్యలు..
- పరిశీలనలో ఎక్సైజ్ కు ఆయుధాల కేటాయింపు
- సౌమ్య కుటుంబానికి ఒక్క రోజు వేతనాన్ని అందజేస్తామని ప్రకటించిన ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది





హైదరాబాద్, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) : విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బాసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సౌమ్య కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, సౌమ్య సర్వీస్ కాలం అంటే రిటైర్మెంట్ వయసు వరకు వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని సౌమ్య కుంటుంబ సభ్యులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, తమ సహచరిని కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని, భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల జోలికి వచ్చే దుండగుల వెన్ను వణికించేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాలు ఇచ్చే నిర్ణయం తమ ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల ముఠాల పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి రెండు నిముషాల మౌనం పాటించి, ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఖురేషి, ఉప కమిషనర్లు జె.హరికిషన్, అంజన్ రావు, చంద్రయ్య, ప్రదీప్ రావు, కృష్ణ ప్రియ, డి.శ్రీనివాస్, నవీన్ కుమార్, అంజిరెడ్డి, సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, తెలంగాణ ప్రొహిబిషన్ & ఆబ్కారీ గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు టి.లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శి చంద్ర శేఖర్ , విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, భరత్, ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం కృష్ణ, మధుబాబు, కానిస్టేబుల్ సంఘం అధ్యక్షుడు పి.రాజిరెడ్డి, నాగరాజు, అనంత్ రెడ్డి, మల్లేష్ తో పాటు సుమారుగా 500 మంది ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో మరోసారి మొండిచేయి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నర్సంపేట, ఫిబ్రవరి 1 (జనం సాక్షి): తెలంగాణ ప్రజలందరూ ఈ బడ్జెట్ లో అయిన కేంద్రం వివక్షపూరితంగా కాకుండా క్రమశిక్షణ తో న్యాయబద్ధంగా కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసామని కేంద్రం లో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణకు మొండి చేయి చూపిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయుబ్ లు ల అశోక్ గౌడ్, లు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కేంద్రం తెలంగాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవరిచినప్పుడు శాసన సభ వేదికగా కేంద్రం ను నిలదీయడం జరిగిందని మంత్రి అన్నారు. రాష్ట్రానికి కావలసిన అంశాలపై ముఖ్యమంత్రి మంత్రులు ప్రధాన మంత్రి,కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. తమిళనాడు మాదిరి ఇక్కడ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు .తెలంగాణ ప్రోగ్రెసివ్ గ్రోత్ ఉన్న రాష్ట్రం.. దేశం లో 29 రాష్ట్రాల్లో తెలంగాణ లో పార్టీలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి 2047 తో ముందుకు పోతున్నామని తెలిపారు. హైదరాబాద్ అన్ని రకాల వాతావరణలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు భూగర్భ వనరులు , ప్రకృతి అంశాలు.. ఐటీ రంగం దేశంలోనే నెంబర్ వన్ హైదరాబాద్ విస్తరణ పెరుగుతున్నప్పుడు కోర్ అర్బన్ విస్తరిస్తున్నప్పుడు.. రీజనల్ రింగ్ రోడ్డు అడిగాం.. రింగ్ రోడ్డు కి రీజనల్ రింగ్ రోడ్డు కి మధ్య రోడ్ల అభివృద్ధి అడిగాం మొండి చేయి చూపింది..మూసి అభివృద్ధికి నిధులు అడిగాం.. ఆంధ్రప్రదేశ్ కి నిధులు అడగడం పట్ల ఎందుకు ఇచ్చారని మేము అడగడం లేదు.. ఆ ప్రభుత్వం మీదనే మోడీ ప్రభుత్వం ఉంది. తెలంగాణకు వివక్షత చూపడం ఏమిటని ప్రశ్నించారు. మాది చిన్న వయసు గల రాష్ట్రం..గత 10 సంవత్సరాలుగా గత ప్రభుత్వం కేంద్రంతో సయోధ్య లేకుండా మాకు రావాల్సినవి అడగలేక పోయింది..మేము అలా కాదు రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి దృష్టికి తీసుకుపోయినా వివక్ష చూపిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీల విమర్శిస్తున్న ప్రధాన మంత్రి ,కేంద్ర మంత్రులను మా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రయోజనాల కోసం కలుస్తున్న తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్రపంచంలో ప్రతి కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తి కుంభమేళ లాంటి మేడారం జాతర కు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని మమల్ని అవమానించారు..బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదు..కేంద్రం తెలంగాణ కి ఇచ్చిన మొండి చేయి పై గతంలో ఉద్యమంలో మాదిరి సకల జనులు అప్రమత్తంగా ఉండాలి.. గత 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదు..మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం..రేషన్ కార్డులు ,సన్న బియ్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం మని తెలిపారు. నర్సంపేట మున్సిపాలిటీ లో ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చింది..వారికి బిఫార్మ్ అందించి గ్రౌండ్ లో ప్రచారం నిర్వహిస్తున్నారు.అర్బన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నాం.. రోడ్లు ,డ్రైనేజీ ,ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక కార్యాచరణ తీసుకుని పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు ఈ సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లను సిటిజన్లను విస్మరించిన బడ్జెట్

హైదరాబాద్ (జనంసాక్షి) : గత బడ్జెట్ తో పోల్చితే ఈ బడ్జెట్‌లో పెన్షనర్ల సంక్షేమం కోసం పెట్టే ఖర్చు రూ. 2,86,641 నుండి 2,96,214 కు పెంచారంటే పెరుగుదల దాదాపు 3.5శాతం అని కాని బడ్జెట్ పెరుగుదల 7.7శాతంతో పోలిస్తే పెరుగుదలలో పెన్షనర్ల సంక్షేమం పట్టించుకోలేదనీ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. నారాయణ రెడ్డి, పి క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈపిఎస్ 95 పెన్షనర్ల కనీస పెన్షన్ ని రు. 9,000లకు పెంచమని చేస్తున్న డిమాండ్‌ను పట్టించుకున్నట్లు కనబడ లేదన్నారు.

## సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 28వ తేది వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు.

# కేసీఆర్‌పై రాజకీయ వేధింపులు మానాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్
- సిట్ విచారణకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ నల్ల రిబ్బన్ నిరసన ర్యాలీ



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ వేధింపులు, అక్రమ సిట్ విచారణకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసం నుండి అంబేద్కర్ చౌక్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని నిరసనకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. నిరసన అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా మర్చిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కేసీఆర్ ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రమ కేసులు, గాలు విచారణల పేరుతో బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సమస్యలను పక్కన పెట్టి నియంతృత్వ పాలన సాగిస్తోందని విమర్శించారు. తమ నియంకుశ పాలనను ప్రశ్నించిన వారిపై కక్షపూరిత చర్యలకు దిగుతుందని అన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనిస్తున్నారని, దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను మర్చిపోయి అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. ఇకపై ప్రజలను మభ్య పెట్టడం సాధ్యం కాదని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ హెచ్చరించారు.

# పొట్టలోనే అన్ని రోగాలకు మూలం

- రాధాస్ ఆయుర్వే హాస్పిటల్, ఓజస్కా చైర్మన్ డాక్టర్ శరత్ అద్దంకి
- ప్రెస్ క్లబ్ సభ్యులకు ఔషధాల పంపిణీ



హైదరాబాద్ (జనంసాక్షి) : సరైన ఆహారాన్ని సరైన విధంగా తీసుకోకపోవడం.. మన ఆరోగ్యాన్ని దెబ్బతీయడంలో కీలకం. చిన్నచిన్న అనారోగ్యాల నుంచి క్యాన్సర్ దాకా అన్నింటికీ మూలం పొట్టలోనే ఉందని రాధాస్ ఆయుర్వే హాస్పిటల్, ఓజస్కా ఛైర్మన్ డాక్టర్ శరత్ అద్దంకి అన్నారు. వార్తలతో కుస్తీపడుతూ, టైంతో పాటు పరుగులు తీసే జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రాధాస్ ఆయుర్వే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఇంటిగ్రేటెడ్ క్యాన్సర్ చికిత్సల గురించి అవగాహన కలిగించారు. అంతేగాక, చిన్నచిన్న విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటే హాస్పిటల్స్ కోసం లక్షలు ఖర్చుపెట్టే అవసరం ఉండదని, మన ఇల్లే ఓ వైద్య శాల, మన ఇంటి నుంచే ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు మొదలుపెట్టాలని చెప్పారు. ఒకసారి క్యాన్సర్ వచ్చిందంటే కీమోథెరపీ, రేడియోథెరపీల వంటి చికిత్సలు తీసుకోకతప్పదు. కానీ వాటివల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వల్ల చాలామంది భయపడుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారమే ఇంటిగ్రేటెడ్ క్యాన్సర్ చికిత్సలు. ఆయుర్వేదంతో పాటు గైడెడ్ ఇమేజరీ, అరోమా థెరపీ, సౌండ్ థెరపీ, యోగా, డైట్ వంటి వాటివల్ల సైడ్ ఎఫెక్టులు తగ్గించడమే కాకుండా, క్యాన్సర్ మళ్లీ రాకుండా నివారించే అవకాశం కూడా ఉంటుందని డాక్టర్ శరత్ అద్దంకి చెప్పారు. చాలామందికి కడుపుబ్బరానికీ, అసిడిటీకి తేడా తెలియక టాబ్లెట్లు వాడుతుంటారనీ, యాంటాసిడ్ టాబ్లెట్లు వేసుకోవడం వల్ల కడుపుబ్బరం ఎక్కువ అవుతుందన్నారు. అందుకే మన ఇంట్లో ఉండే అల్లం, ఇంగువ వంటి వాటితోనే ఇలాంటి చిన్న సమస్యల నుంచి బయటపడవచ్చని చెప్పారు. రొమ్ము క్యాన్సర్ వల్ల తల్లి మరణించడంతో సైడ్ ఎఫెక్టులను తగ్గించే క్యాన్సర్ చికిత్సలపై రీసెర్చ్ మొదలుపెట్టి, ఆయుర్వేద డాక్టర్ గా మారిన, అమెరికాలో ప్రముఖ ఇంటిగ్రేటెడ్ కాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ శరత్ అద్దంకి. కొవిడ్ టైంలో సింగరేణి వాళ్లకోసం 3 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. ఇమ్యూనిటీ కిట్స్ ని ఉచితంగా అందజేశారు. శ్రీనివాసన్ మునుస్వామి రాధా అద్దంకి ట్రస్ట్ ద్వారా విద్యార్థుల చదువు కోసం, ఆరోగ్యం కోసం సహకారం అందిస్తున్నారు. ఇప్పుడు ప్రెస్ క్లబ్ సభ్యుల కోసం కూడా ఉచిత ఇమ్యూనిటీ కిట్లు, మోకాళ్ల నొప్పులను తగ్గించే ఔషధాలను అందజేశారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి ప్రత్యేకంగా జర్నలిస్టుల కోసం ఇలాంటి మంచి అవగాహనా కార్యక్రమాన్ని అందించిన డాక్టర్ శరత్ అద్దంకిని, ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అభినందించి, సత్కరించారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుల ఆరోగ్యం కోసం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెబుతూ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేశ్ వరికుప్పల డాక్టర్ శరత్ అద్దంకి, రాధాస్ ఆయుర్వే హాస్పిటల్ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## భారత రూపాయి పతనంపై

# మోదీ ఎందుకు చేతులెత్తేశారు?



భారత దేశ ప్రజలు లేవనెత్తిన ప్రశ్నలు కేవలం కరెన్సీ మారక విలువలకే పరిమితం కావు. అవి దేశ ఆర్థిక పాలన, రాజకీయ నైతికత, అధికారంలో ఉన్నవారి బాధ్యత వంటి మౌలిక అంశాలను తాకుతున్నాయి. భారత రూపాయి పతనం అనేది ఒక రోజు, ఒక నెలలో జరిగిపోయిన సంఘటన కాదు. ఇది గత పదేళ్లుగా కొనసాగుతున్న ఆర్థిక ధోరణుల ఫలితం. అయినా కూడా, ఈ పతనంపై కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి స్పష్టమైన, పారదర్శకమైన వివరణ రాకపోవడం ప్రజాస్వామ్యంలో తీవ్రమైన ప్రశ్నలకు, సందేహాలకు దారితీస్తోంది.

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 2014లో సుమారు 58-60 మధ్య ఉండగా, ఇప్పుడు 83-84 స్థాయికి చేరుకుంది. అంటే పదేళ్లలో రూపాయి విలువ సుమారు 40 శాతం వరకు క్షీణించింది. ఇది కేవలం అమెరికా డాలర్ బలపడటం వల్లే జరిగిందని చెప్పడం అర్ధసత్యం మాత్రమే. ఎందుకంటే ఇదే కాలంలో వియత్నాం డాంగ్, ఇండోనేషియా రూపియాహ్, ఫిలిప్పీన్స్ పెసో వంటి ఆసియా కరెన్సీలు భారత రూపాయితో పోలిస్తే తక్కువ పతనాన్ని మాత్రమే చూశాయి. కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం భారత్ కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, వారి కరెన్సీలు అంతగా క్షీణించలేదు. అప్పుడు ప్రశ్న సహజంగా వస్తుంది: భారత రూపాయి ఎందుకు ఆసియా ఖండంలోనే అత్యంత దారుణంగా బలహీనంగా కనిపిస్తోంది?

మోదీ 2014కి ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అప్పటి యూపీఏ ప్రభుత్వంపై రూపాయి పతనాన్ని ఒక ప్రధాన రాజకీయ ఆయుధంగా వాడుకున్నారు. "రూపాయి పడిపోతే దేశ గౌరవం పడిపోతుంది" అని ఆయన చేసిన ప్రసంగాల వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పటికీ మాటిమాటికీ వైరల్ అవుతూ తిరిగి మోదీ నే సమాధానం చెప్పాలని దేశ ప్రజలకు అందరికీ గుర్తుచేస్తున్నాయి. శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ కరెన్సీలతో పోల్చుతూ, భారత్ ఆర్థికంగా క్షీణిస్తోందని ఆరోపించారు. కానీ ఇప్పుడు అదే మోదీ ప్రధానమంత్రిగా ఉండగా, రూపాయి పరిస్థితి మరింత బలహీనంగా మారినప్పుడు, ఆ నైతిక ప్రమాణాలు ఎందుకు మౌనంగా మారాయి అనే ప్రశ్నను ప్రజలు అడగడం సమంజసమే కదా!

కేంద్ర ప్రభుత్వం తరచూ చూపే కారణం ఏమిటంటే ... ప్రపంచవ్యాప్తంగా డాలర్ బలపడటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచడం, కోవిడ్ తరువాతి ఆర్థిక అస్థిరత, ఉక్రెయిన్ యుద్ధం వల్ల చమురు ధరలు పెరగడం. ఇవన్నీ నిజమైన అంశాలే. కానీ ఇవి భారత్‌కే ప్రత్యేకమైన సమస్యలు కావు. ఇదే పరిస్థితుల్లో ఉన్న ఇతర ఆసియా ఆర్థిక వ్యవస్థలు రూపాయితో పోలిస్తే ఎందుకు మెరుగ్గా నిలబడ్డాయో ప్రభుత్వం చెప్పదు. ఈ మౌనం రాజకీయంగా సౌకర్యవంతమైనదైనా, ఆర్థికంగా ప్రమాదకరమైనది.

రూపాయి పతనం వల్ల కలిగే ప్రభావాలు సామాన్య ప్రజల జీవితాలపై నేరుగా పడుతున్నాయి. చమురు దిగుమతులపై భారత్ అధికంగా ఆధారపడుతుంది. రూపాయి బలహీనపడితే దిగుమతి చమురు ఖర్చు పెరుగుతుంది. దాంతో ఇంధన ధరలు, రవాణా వ్యయాలు, ఆహార ధరలు అన్నీ పెరుగుతాయి. ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుంది. ప్రభుత్వం అధికారికంగా ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని చెబుతున్నా, నిత్యావసరాల ధరలు చూస్తే ఆ గణాంకాలపై అనుమానం కలుగుతుంది. ఐఎంఎఫ్ కూడా భారత ఆర్థిక గణాంకాల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తిన సందర్భాలు ఉన్నాయి. ఇది దేశానికి గర్వకారణం కాదు; ఆత్మపరిశీలనకు కారణం కావాలి.

మరొక ముఖ్యమైన అంశం విదేశీ పెట్టుబడులు. ప్రభుత్వం "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" గురించి గొప్పగా చెప్పుకుంటున్నా, వాస్తవంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తరచూ భారత మార్కెట్ల నుంచి నిధులు వెనక్కి తీసుకుంటున్నారు. దీనికి కారణం కేవలం ప్రపంచ పరిస్థితులే కాకుండా, దేశీయ విధానాల్లో ఉన్న అస్థిరత, కార్పొరేట్ పక్షపాతం, నియంత్రణ సంస్థల స్వతంత్రతపై అనుమానాలు కూడా. పెట్టుబడిదారుల నమ్మకం తగ్గితే, కరెన్సీపై ఒత్తిడి పెరగడం సహజం.

ప్రభుత్వం తరచూ చెప్పే మరో వాదన -బలహీన రూపాయి ఎగుమతులకు మంచిదని. ఇది సిద్ధాంతంగా నిజమే. కానీ భారత ఎగుమతుల నిర్మాణాన్ని చూస్తే, అధిక విలువ కలిగిన టెక్నాలజీ ఉత్పత్తులు, పరిశ్రమల వాటా పరిమితంగానే ఉంది. ముడి సరుకులు, తక్కువ విలువ జోడించే ఉత్పత్తులే ఎక్కువ. అలాంటి పరిస్థితిలో రూపాయి పతనం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుంది. దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థకు బలహీన కరెన్సీ దీర్ఘకాలంలో భారమే.

ఇక్కడ అసలు ప్రశ్న రూపాయి ఎందుకు పడిపోతుందనే దానికంటే, ప్రభుత్వం ఎందుకు నిజాయితీగా మాట్లాడటం లేదన్నదే. రాజకీయంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన విమర్శలకు, అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చే సమాధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. మోదీ ప్రభుత్వానికి స్పష్టమైన కమ్యూనికేషన్ వ్యూహం ఉంది – విజయాలను అతిశయోక్తిగా ప్రచారం చేయడం, వైఫల్యాలపై మౌనం పాటించడం లేదా వాటిని బాహ్య శత్రువులపై నెట్టేయడం. రూపాయి విషయంలో కూడా అదే ధోరణి కనిపిస్తోంది.

భారత ఆర్థిక వ్యవస్థకు ఉన్న మౌలిక బలాలను ఎవరూ తిరస్కరించడం లేదు. పెద్ద మార్కెట్, యువ జనాభా, సేవా రంగ బలం వంటి అంశాలు నిజమే. కానీ ఆ బలాలన్నీ సమర్థవంతమైన విధానాలు, పారదర్శక పాలన లేకపోతే కాగితాలపైనే మిగిలిపోతాయి. రూపాయి పతనం అనేది ఒక అద్దంలాంటిది; అది ఆర్థిక వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చూపిస్తోంది. ఆ అద్దాన్ని పగలగొట్టడం కాదు, అందులో కనిపించే నిజాన్ని అంగీకరించడం నాయకత్వ బాధ్యత.

మోదీ భారత ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇది రాజకీయ దూషణ కోసం కాదు; ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం కోసం. రూపాయి పతనం వెనుక ఉన్న దేశీయ కారణాలు ఏమిటి? విధాన పరమైన తప్పిదాలు ఏవి? గణాంకాల విశ్వసనీయతపై వచ్చిన విమర్శలకు సమాధానం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా "అమృత్ కాల్" మాటలు కేవలం నినాదాలుగానే మిగిలిపోతాయి. ప్రజలు మౌనం కాదు, నిజం కోరుకుంటున్నారు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# రేవంత్ రెడ్డి ఆత్మవిశ్వాసం రెట్టింపు




ఈసారి అమెరికా పర్యటనతో మన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. అమెరికా హార్వర్డ్ యూనివర్సిటీలో అభ్యాసం చేసిన కోర్సు తాలూకు ఛాయల ప్రభావం రాష్ట్ర పాలనలో అపుడే ప్రసరిస్తోందనే విశ్లేషణలు వినిపిస్తుండడం విశేషం!

తనకు ఎలా ఐడియా వచ్చిందో లేక ఎంతటి మేధోపరమైన హితులతో సూచన అందిందో కానీ నేర్చుకునే అవకాశాన్ని చక్కగా అందిపుచ్చుకున్నారు. ఒక పాలకుడు ఎన్ని విధాలుగా ఫిట్ గా ఉండాలో అన్ని రకాల సమర్థంగా ఉండేందుకు మొగ్గు చూపారు. తద్వారా సదరు కోర్సు అభ్యసించిన మొట్టమొదటి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మన దేశంలోని తతిమ్మా ముఖ్యమంత్రులకు ప్రేరణ, మార్గదర్శనం చేస్తున్నారు. ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన అమెరికా దేశంలోని హార్వర్డ్ యూనివర్సిటీలో చిన్న కోర్సులో ప్రవేశించి భారత దేశంలోని ముఖ్యమంత్రుల్లో మెరిశారు. తాను పాలన చేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యకు గరిష్ట ప్రాముఖ్యతను ఇవ్వడంతోపాటూ ఆచరణలో తానూ విద్యార్థిగా ముచ్చట గొలిపారు. పాలకులకు ఎంత ఆత్మవిశ్వాసం, విజ్ఞానం ఉంటే ప్రజలకు అంత మేలు ఒనగూరుతుంది. అంటే మన సీఎం రేవంత్ రెడ్డి చేసిన అభ్యాసన తనకే కాదు, మన రాష్ట్రానికీ ప్రయోజనం చేకూరుస్తుంది. ఆంగ్లంలో అంతగా పట్టు లేకున్నా మినీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన రేవంత్ రెడ్డికి ఇంగ్లిష్ పరంగానే కాదు, పాలనాపరమైన అంశాల్లో ప్రపంచ స్థాయి ప్రామాణికతపై అవగాహన, పట్టూ లభించింది. బేసిగ్గానే సంపూర్ణ ఆరోగ్యంతో, ఎంతో చలాకీగా ఉండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోనే హయ్యెస్ట్ హోదాలో, నడి వయసులో సుమారు వారం రోజుల పాటు స్టూడెంట్ పాత్రను అలవోకగా పోషించడం తెలంగాణకూ గర్వకారణం. సంక్షోభాలు, సంక్లిష్టతలు, రకరకాల సవాళ్లలో సమర్థవంతమైన నాయకత్వం అందించేందుకు తాను పఠించిన చిన్న కోర్సు అవసరం మేరకు పెద్దగా దోహదం చేస్తుందని తెలుస్తోంది. అభివృద్ధి నమూనా, ఆర్థిక పరిపుష్టి, సంక్షేమం, పర్యావరణం, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి వంటి వాటిల్లో మరింత విశేష పురోగతికి మనోబలాన్ని చేకూర్చే విద్యనూ ఆలకించారని తెలుస్తుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం బోధనలో ఔపోసన పట్టిన పాఠ్యాంశాలకు స్వీయ ఆలోచనలు, దృక్పథాన్ని జోడించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తి చూపగలరని అంచనా. తరగతి గదిలో పాఠాలకే పరిమితం కాకుండా... ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత స్టూడెంట్స్, అమెరికాలోని మన తెలుగు సంఘాల వారితోనూ ముఖాముఖి చర్చించడం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోతైన దృష్టికి, జిజ్ఞాసకు తార్కాణం.

తెలంగాణ రైజింగ్ -2047 పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో గొప్ప నిబద్ధత ప్రస్ఫుటించిందని బోస్టన్ లో తనతో భేటీ అయిన అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) రీజినల్ కో-ఆర్డినేటర్ కోమటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి సంతోషం, సంతృప్తి, ఆశాభావం వ్యక్తం చేశారు.



ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
హైదరాబాద్, 9440850384



## పూల విశ్వం

పూలతోట
తల్లిలా మాలి
మొక్కమొక్క
రక్షణ లేని
తండ్రి లేని పిల్లలు
అయిన
ముళ్లకంచెలు తండ్రి లా
రక్షణకవచం...
వనమాలి
సుగంధ క్షేత్రాలు
మధు జలాలు
అందే ప్రాంతాల్లో
పూల మొక్కల్ని నాటుతాడు...
మమతల అల్లికలు
మలినం లేని మనసు
మాలి పాదుతీసి నీరు పోసి
పెంచిన తీరు సహృదపాఠం...
పూజకు..ప్రేమకు
అందాలకు..అనుబంధాలకు
మానవ ఐక్య బంధాలకు
ప్రకృతి మాలి
అనుభూతుల పూలతోట
తోట లోనిపూలు
నయన తారలు
పుట్టుక నుండి చావుదాక
వెంటవచ్చె కుల మతాతీత
సుంగధాల తావులు


రేడియమ్
9291527757

# పొత్తి: కథనాన్ని కవిత్వంగా మలిచిన అపూర్వ నవల

తెలుగు ఆధునిక నవలా సాహిత్యంలో కథనం కేవలం సంఘటనల శ్రేణి మాత్రమే కాకుండా, కవిత్వ లక్షణాలతో నిండిన వచనంగా రూపొందిన రచనలు చాలా అరుదు. ఇటీవలి దశాబ్దాల్లో కథన వేగం, సంఘటనల క్రమం ప్రధానంగా మారిన సమయంలో భావానుభూతికి, లోతైన భావోద్వేగానికి ప్రాధాన్యమిచ్చే వచన ప్రయోగాలు దాదాపు అంతరించినట్లయింది. అలాంటి నేపథ్యంలో నర్రా ప్రవీణ్ రెడ్డి రాసిన 'పొత్తి' నవల ఒక విశిష్టమైన, అపూర్వమైన ప్రయోగంగా నిలుస్తుంది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రచించబడిన ఈ నవలలో కవితాత్మక వచనం, ప్రతీకలు, మానవరోపణ, వ్యంజనాత్మక శైలి, రూపకాలు, ఉపమానాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. రవి పాత్ర ఆత్మహత్య సన్నివేశం, ఉస్మానియా క్యాంపస్ దృశ్యాలు, పల్లె జీవన చిత్రణ, రైతు శ్రమ వర్ణనలు, చెరువు-పొలం-మట్టి వాసనలు - ఇవన్నీ కథనాన్ని సాధారణ స్థాయి నుంచి కావ్య స్థాయికి తీసుకెళ్తాయి. రచయిత కథ చెప్పడమే కాకుండా, ఆ కథను ఒక గాఢమైన భావానుభూతిగా, సామూహిక వేదనగా మార్చేందుకు కవితాత్మక వచనాన్ని అత్యంత సమర్థవంతంగా ఆశ్రయించాడు. ఇది తెలుగు నవలా శైలిలో ఒక నూతన అధ్యాయాన్ని ఆరంభించినట్లుంది.

**శీర్షిక నుంచి ముఖచిత్రం వరకు: సంకేతాత్మక ప్రతీకలు**

'పొత్తి' అనే పదం తెలంగాణ మాండలికంలో పంట కోత తర్వాత ధాన్యపు రాశి చుట్టూ గీసే రక్షణ రేఖను సూచిస్తుంది. ఇది పంటను బయటి హానుల నుంచి కాపాడే భద్రతా వలయం మాత్రమే కాదు, రైతు శ్రమకు, ఆశకు, భవిష్యత్తుకు, సంతానానికి ప్రతీకగా నిలుస్తుంది. నర్రా ప్రవీణ్ ఈ సాధారణ, గ్రామీణ మాండలిక పదాన్నే శీర్షికగా ఎంచుకోవడం లోతైన ఉద్దేశ్యాన్ని కలిగి ఉంది. తెలంగాణ భూమి, జీవనం, సంస్కృతి, ఉద్యమాన్ని ఒక సమగ్ర అనుభూతిగా ఆవిష్కరించాలన్న రచయిత ఆలోచన ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. నవల ముఖచిత్రంలో ఎత్తిన పిడికిళ్లు ఉద్యమ ప్రతిఘటనకు, ఆత్మగౌరవానికి, సమూహ సంకల్పానికి సంకేతాలు. ఉస్మానియా విశ్వవిద్యాలయ భవన చిత్రం విద్యార్థి-మేధో పోరాటానికి, ఉద్యమ కేంద్రబిందువుకు ప్రతీక. శీర్షిక, ముఖచిత్రం రెండూ కలిసి పాఠకుడిని ముందే ఉద్యమ వాతావరణంలోకి, తెలంగాణ జనజీవన లోతుల్లోకి లాక్కుపోతాయి. ఇది కథలోకి ప్రవేశించే ముందు నుంచే సంకేతాత్మకంగా పనిచేసే రచయిత నైపుణ్యానికి, సూక్ష్మ దృష్టికి నిదర్శనం.




**పాత్రల చిత్రణ: ఉపమానాలతో నిండిన కవితాత్మక వర్ణనలు**

నవలలో కథానాయకులు గంగాశంకర్లు తెలంగాణ ఉద్యమ తరం మనస్తత్వానికి, ఆకాంక్షలకు ప్రతినిధులు. వీరి జీవితం ద్వారా పల్లె అమాయకత్వం, పట్టణ రాజకీయ చైతన్యం మధ్య సంఘర్షణ, వ్యక్తిగత సుఖదుఃఖాలు ఉద్యమ అవసరాల ముందు చిన్నవిగా మారడం సహజంగా, హృదయస్పర్శిగా చిత్రీకరించబడింది. కథానాయిక గంగ పాత్ర వర్ణన అత్యంత సున్నితంగా, ఉపమానాల శ్రేణితో కవితాత్మకంగా సాగుతుంది:

"అయిదున్నర అడుగుల ఎత్తు
నిండు బతుకమ్మలాంటి మొకం
పూరిక్కల సొంటి పెదాలు
సెలయేటి సప్పుడసొంటి మాటలు
యీసమంత ఇసంలేని తనం
అన్నింటికీ మించి మంచి వ్యక్తిత్వం ఆమె సొంతం..."

బతుకమ్మ ఉపమానం తెలంగాణ సాంస్కృతిక గౌరవాన్ని, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని గుర్తు చేస్తుంది. సెలయేటి శబ్దానుకరణ మాటల మాధుర్యాన్ని సహజ ప్రకృతితో పోలుస్తుంది. ఇది గంగను వ్యక్తిగత పాత్రగా కాకుండా ప్రాంతీయ స్త్రీ ప్రతినిధిగా నిలబెడుతుంది. ఉపపాత్రలైన యాదమ్మ వంటివారిలోనూ కవిత్వం సహజంగా కలిసిపోతుంది. కట్టెల పొయ్యి అలుకుతున్న సన్నివేశం గృహజీవనాన్ని సౌందర్య కళగా మలుస్తుంది:

"బంగారమసొంటి ఎర్రమట్టిని ముద్దుగ కలిపి
పొయ్యిసుట్టూ అలుకు తీసె తీసింది యాదమ్మ.
పువ్వసొంటి ముగ్గేసే సరికి పొయ్యి ముద్దుగ కనిపిస్తుంది..."

ఎర్రమట్టిని బంగారంతో, ముగ్గును పువ్వుతో పోల్చడం గ్రామీణ స్త్రీ శ్రమలోని పవిత్రతను, అందచూపును, కళాత్మకతను హైలైట్ చేస్తుంది. ఈ వర్ణనలు పాత్రలను కేవలం కథా భాగాలుగా కాకుండా, సజీవమైన భావానుభూతులుగా మారుస్తాయి.

ఉద్యమ దృశ్యాలు: ప్రతీకలు, రూపకాలు, ద్వంద్వాల సమ్మేళనం ఉస్మానియా క్యాంపస్ తెలంగాణ ఉద్యమానికి కేంద్రబిందువు. ఇక్కడి దృశ్యాలను రచయిత వాచ్య ప్రకటనలకు పరిమితం చేయకుండా, ప్రతీకాత్మకంగా, కవితాత్మకంగా చిత్రీకరించాడు:

"కోట్ల చేతులకు నిలువునా వందనం చేస్తున్నట్లుగా కనిపించే ఓ స్థూపం...

**నినాదపు పిడికిళ్లు కిరీటంగా అమర్చుకున్నది ఆ స్థూపం**

నీలి మబ్బుల మధ్యన పూసిన సింగిడి స్థూపపు సిగలో నెలవంకలా అతుక్కుపోయింది..."

స్థూపం అమరవీరులకు, పిడికిళ్లు ప్రతిఘటనకు, నెలవంక ఉద్యమ భవిష్యత్తు ఆశకు -- సంపూర్ణతకు చేరని కానీ తప్పక చేరే ఆశకు -- ప్రతీకలు. గబ్బిలాలు అణచివేతకు, చీకటికి, పావురాలు విద్యార్థుల ఆశకు, శాంతికి సంకేతాలు. రవి ఆత్మహత్య సన్నివేశంలో చెట్టు ప్రతీక ద్వారా తెలంగాణ జీవశక్తి క్రమంగా హరించబడిన వేదనను వ్యక్తపరుస్తాడు:

"పచ్చగా వుండాల్సిన చెట్టు విషవలయాన్ని చుట్టుకుని మోడు వారినట్లు అగుపిస్తుంది...
చెట్టును మోస్తున్న మట్టి దుఃఖం దిగమింగుకుంటున్నది..."

ఈ మానవరోపణ తీవ్ర భావోద్వేగాన్ని కలిగిస్తుంది. పట్టణ జీవనాన్ని గడియార ముల్లులతో, మిణుగురు పురుగులతో పోల్చి యాంత్రికత, విరక్తిని, మానవ సంబంధాల లోపాన్ని చూపిస్తాడు. సూరి లేఖలో చీకటి-వెలుతురు ద్వంద్వం వ్యక్తిగత త్యాగం, సామూహిక చలనాన్ని సమన్వయపరుస్తుంది. ఉద్యమ గాయకుడి వర్ణనలో స్వభావోక్తి అలంకారం దృశ్యాత్మకతను పెంచుతుంది: గొంగడి, రుమాలు, దుద్దుకర్రతో నేలపై దున్నుతూ పాట పాడే గాయకుడు గూడ అంజయ్యను గుర్తు చేస్తాడు.

**పల్లె జీవనం నుంచి రాష్ట్ర సాధన వరకు: సౌందర్యాత్మక అనుభూతి**

'పొత్తి'లో కవితాత్మక వచనం ఉద్యమ దృశ్యాలకే పరిమితం కాదు. రైతు శ్రమ, పల్లె సంస్కృతి, చెరువు నిండు గర్భవతిగా వర్ణన, పంటలు పచ్చని చీర కట్టినట్లు చిత్రణ, ఎర్ర రేగడి నేలపై రైతుల కలలు శోభిల్లుతున్నవి, వరికంకులు నేలపై సంతకాలు చేస్తున్నట్లు, తాతల కాలం నాటి చెరువు నీటి చుక్క సంతకానికి తడినిస్తుందన్న వర్ణనలు తరతరాల అనుబంధాన్ని, మట్టి వాసనను సూచిస్తాయి. గ్రామం "పిడికెడంత సంస్కృతి, గుప్పెడంత ఆత్మవిశ్వాసం" ఇచ్చే మూలధనంగా చిత్రీకరించబడింది. జీవిత ప్రయాణాన్ని ఎగుడు-దిగుడు డొంకలతో పోల్చడం, చివరకు "కన్న పేగు కదా మరి!" అన్న భావోద్వేగ ముగింపు పల్లె మూలాలను గుర్తు చేస్తాయి. నవల చివరి భాగంలో రాష్ట్ర సాధనను ప్రకృతితో మేళవించి, భానుడి ఉదయం, త్యాగాలు పువ్వులై వికసించడం, "భారత్ సిగలో తెలంగాణ సింగిడై లేసింది" అనే వాక్యం గర్వభరితంగా ప్రతిబింబిస్తుంది.

రావిశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, బుచ్చిబాబు, చలం, వడ్డెర చండీదాస్ వంటి రచయితల సంప్రదాయాన్ని కొనసాగించిన నర్రా ప్రవీణ్, ఆధునిక కాలంలో అరుదైన కవితాత్మక వచనాన్ని ప్రదర్శించాడు. ఈ ప్రయోగమే 'పొత్తి'ని సాధారణ ఉద్యమ నవల నుంచి కావ్య స్థాయి రచనగా నిలిపింది. తెలంగాణ జనజీవనం, ఉద్యమానుభూతి శాశ్వత సాహిత్య సాక్ష్యంగా మిగిలేలా చేసిన ఈ నవల, నర్రా ప్రవీణ్‌ను బలమైన నవలాకారుడిగా, భవిష్యత్తులో కవిగా కూడా నిరూపించే సామర్థ్యం కలిగి ఉంది.



డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335

# సమన్వయ లోపంతోనే మేడారంలో అవస్థలు

మేడారం శ్రీ సమ్మక్క సారక్క మహా జాతర ముగిసింది. 4 రోజులపాటు కుంభమేళా తరహాలో జరిగిన గిరిజన జాతర ఆసియాలోనే అతి పెద్దది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు విదేశీయులు మేడారం జాతరకు తరలి వచ్చారు. నాలుగు రోజుల్లో దాదాపు రెండు కోట్ల మంది ప్రజలు వన దేవతలు సమ్మక్క సారాలమ్మలను దర్శించుకుని ఉంటారని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. 251 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించామని, పోలీసు, ఆర్టీసీ ఇతర విభాగాల సమన్వయంతో జాతరను ఇబ్బందులు లేకుండా నిర్వహించామని మంత్రి సీతక్క ప్రకటించారు. జాతర నిర్వహణ బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొన్న మంత్రి సీతక్క చాలానే కష్టపడ్డారు. తాను మంత్రిని అనే విషయాన్ని పక్కన పెట్టేసి...జనంలో కలిసిపోయి సౌకర్యాల కల్పనతో పాటు భక్తుల ఇబ్బందులను అధికారుల ద్వారా తీర్పించ గలిగారు.

అంతా బాగానే ఉంది కానీ... చివరి రెండ్రోజులు భక్తుల అవస్థలు వర్ణనాతీతం. మేడారం నుండి పస్రాకు ఆరేడు గంటలు పట్టింది. బస్సయినా.. కారయిన అదే టైమ్. తప్పదు మరి. రోడ్ దిగి వేరే దారిలో వెళ్ళడానికి కూడా లేదు. రోడ్డుకు రెండు వైపుల చెట్లే. శుక్రవారం హన్మకొండలో బయలు దేరిన భక్తులు దాదాపు పది గంటల తరవాత మేడారం చేరుకోగలిగారు. తిరుగు ప్రయాణీకులు పరిస్తితి కూడా సేమ్ టు సేమ్. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎక్కడికి పోయిందో తెలియదు. పోలీసు, ఆర్టీసీ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం భక్తుల ఇక్కట్లకు ప్రధాన కారణం. కొందరు పోలీసులు బైక్ పై తిరుగుతూ ట్రాఫిక్ క్లియర్ చేయించారు. అదీ కాసేపే. 5 నిమిషాల్లో మళ్లీ షరా మామూలే. కోట్లాది మంది భక్తుల వాహనాలను ఎలా నియంతించాలో తెలియక ప్రభుత్వ యంత్రాంగం చేతులెత్తేసింది.

చుట్టూ జంగిల్, మధ్యలో వాహనాలు. అందులో భక్తులు...తాగడానికి నీళ్లు లేక, టాయిలెట్ వెళ్ళడానికి చోటు లేక మహిళలు పడిన అవస్త అంతా ఇంతా కాదు. చెట్లు మొదళ్లను చాటుగా చేసుకుని మహిళలు పురుషులు చూస్తుండగానే మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిందంటే... ఇంతకంటే అవమానకర విషయం మరోటి ఉంటుందా. మంత్రి సీతక్క మహిళా అయి కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. సరికదా కనీసం మాట వరసకు అయినా మహిళలు ఇబ్బంది పడ్డారు అని చెప్పక పోవడం విడ్డూరంగా ఉంది. బస్సుల్లో ప్రయాణించిన భక్తుల పరిస్థితి ఇలా ఉంటే వీవీఐపీలు, విఐపి ల పరిస్థితి కూడా సేమ్ టు సేమ్. మేడారం నుంచి తాడువాయి వరకు అక్కడి నుండి తాడువాయి నుంచి పసరా వరకు రోడ్డు వెంట తాగునీటి సౌకర్యం కల్పించి ఉండాల్సింది. అలాగే టాయిలెట్లను ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యం కిందకే వస్తుంది. తాడ్వాయి దగ్గర ప్రైవేటు వాహనాలను విఐపి ల వాహనాలను నిలిపివేయాలని ఆర్టీసీ అధికారులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందన్న విశ్లేషణ వినిపిస్తోంది. నిజానికి అది మంచి సూచన తాడువాయి చౌరస్తా పక్కనే దారికి రెండు వైపులా 10-10 అంటే మొత్తం 20 ఎకరాల చొప్పున పార్కింగ్ ప్లేస్లు చదును చేయించారు. అన్ని వాహనాలను అక్కడ నిలిపి అక్కడ నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారంకు భక్తులను తరలించి ఉంటే ట్రాఫిక్ నియంత్రణలో ఉండేదని అంటున్నారు. వీఐపీ, ఆర్టీసీ బస్ ల కోసం తాడ్వాయి టు మేడారం డెడికేట్ చేశారు కానీ... విచ్చలవిడిగా జారీ చేసిన వీఐపీ ల పాస్ లతో ట్రాఫిక్ కంట్రోల్ తప్పింది.

ఇక మేడారంలో బస్సులో దిగిన సామాన్య భక్తులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన గద్దెల ప్రాంగణానికి వెళ్లాల్సి వచ్చింది. జంపన్న వాగుకు మరో కిలోమీటరు దూరం. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గద్దెల ప్రాంగణం వరకు నాలుగు కిలోమీటర్లు. భక్తులు అమ్మవారికి సమర్పించే బంగారం నెత్తిన పెట్టుకొని వెంట తెచ్చుకున్న సామాన్లు, వంట పాత్రలు, బట్టలు మూట కట్టుకొని అమ్మవారిని దర్శించుకోవాల్సి వచ్చింది. క్యూలైన్ల లో భక్తులు ఉండ గానే వీఐపీలు వల్ల సామాన్య జనం క్యూ కదలలేదని భక్తులు గగ్గోలు పెట్టారు. అది చాలాదన్నట్టు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, గవర్నర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు వారి చుట్టూ ఉండే అనుచరులు సెక్యూరిటీ సమ్మక్క సారక్కలను గద్దల ప్రాంగణమంతా వారితోనే నిండిపోయింది. అసలు ఎన్ని వీఐపీ పాస్ లు ఇచ్చారో తెలియని పరిస్థితి. జంపన్న వాగులో స్నానాలు చేసి బట్టలు మార్చుకునేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు ఏ మూలకు సరిపోలేదు. అక్కడ అంతా తడి, బురద మయం. పొడి దుస్తులు ధరించి దేవతల దర్శనం కోసం వస్తే కిక్కిరిసిన క్యూ లైన్లు భక్తులను ఉసూరుమనిపించాయి. నెట్టుకుంటూ...తోసుకుంటూ... గంట, గంటన్నర తర్వాత గద్దెల ప్రాంగణంలో అడుగుపెట్టిన భక్తులకు ఎటూ కదలలేని పరిస్థితి. అమ్మవార్లు గద్దెల చుట్టూ ఉన్న వీఐపీలు, గ్రిల్స్ వద్ద వాలంటీర్లు దడి కట్టిన పరిస్థితిలో తోసుకుంటూ ముందుకు వెళ్ళి బంగారం, చీర, సారే లను మూట కట్టి దేవతల గద్దెల పైకి విసిరేయడం తప్ప మరో మార్గం భక్తులకు లేకపోయింది. లోపల ఉన్న వీఐపీ లకు దెబ్బలు తగిలి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అధికారులు చెప్పిన ప్రకారం మేడారంలో ఏర్పాటు చేసిన 30 పడకల ఆసుపత్రిలో ఇలా గాయ పడిన వారి సంఖ్య 2680.



మానవ వ్యర్థాలు విసర్జన, కోళ్లు, గొర్రెలు, మేకల బలి, అపరిశుభ్ర వాతావరణంలో వండిన కలుషిత ఆహారం భుజించడం వల్ల ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వారి సంఖ్య 1 లక్ష 86 వేల మంది అట. అంటే ప్రభుత్వం భక్తులకు ఎంత మెరుగైన సౌకర్యాలు కల్పించింది అనే విషయం నారోగ్యం పాలయిన భక్తుల సంఖ్యను బట్టి అర్థం చేసుకోవచ్చు.

ఇలా ఉంటే తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ క్యూ లైన్లు ఏర్పాటు చేసింది. అర కిలోమీటరు దూరం నడిచి టిక్కెట్లు తీసుకొని బస్సులో కూర్చున్న భక్తులకు 4 గంటలు గడిచినా దాదాపు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడ్వాయికి చేరుకోలేకపోయారు. అక్కడి నుండి పస్రాకు మరో మూడు గంటలు... అంటే..30 కిలోమీటర్ల దూరానికి 7 గంటలకు పైగా సమయం పట్టింది. ఇన్ని గంటలు తిండి తిప్పల సంగతేంటి.. ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుంది. దీనికి బాధ్యులు ఎవరు... ట్రాపిక్ జామ్ కారణాలు చెప్పాలని ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులను వివరణ కోరింది. అంతా బాగానే ఉంది... ఆరు రోజుల పాటు అటు పోలీసులు, ఇటు ఆర్టీసీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, విద్యుత్ సిబ్బంది, దేవాదాయ శాఖల అధికారులు, సిబ్బంది కష్ట పడ్డారు. వారి సేవలను తక్కువ చేయడానికి వీలు లేదు. ఎటొచ్చి సమస్య ఎక్కడ ఉత్పన్నం అయింది అన్నది తేలాలి. సమన్వయ లోపమే కారణం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. భవిష్యత్ లో ఇలాంటి ఇబ్బందులు, నరక యాతన పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

వంగ మహేందర్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

# నేటి నుండి ఆన్‌లైన్‌లోనే యూరియా బుకింగ్ కొనుగోళ్లు

- ఫెర్టిలైజర్ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులోకి వచ్చింది
- బుక్ చేసిన 24 గంటల్లో రైతులకు యూరియా సరఫరా
- ఇక నుండి రైతులు క్యూ లైన్ లో నిలబడాల్సిన అవసరం లేదు
- మండల వ్యవసాయ అధికారిని రేణుకా చక్రవర్తిని



**తలకొండపల్లి ఫిబ్రవరి 01(జనంసాక్షి):** రైతులకు యూరియా సరఫరాను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని పేర్కొన్నారు.తలకొండపల్లి మండలంలో యూరియా 1336 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు నేటి నుండి యూరియా ఫెర్టిలైజర్‌ను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకునే విధానాన్ని రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు తెలిపారు.రైతులు ఇకపై ఎరువుల దుకాణాల వద్ద క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా,తమ ఇంటి వద్ద నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్లో యూరియాను బుక్ చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మండలంలోని అన్ని అధీకృత రిటైలర్లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు,ఆదర్శ రైతు సేవ కేంద్రాలు,ఆకా సర్వీస్ సెంటర్ల వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను రైతులు యాప్ ద్వారా రియల్‌టైమ్‌లో పరిశీలించవచ్చని తెలిపారు.రైతులు ముందుగా గూగుల్ ప్లేస్టోర్ లో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని రైతులు లేదా పౌరులు తమ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి యూరియా బుకింగ్ యాప్‌లో సులభంగా లాగిన్ కావచ్చు.యూరియా బుకింగ్‌కు పట్టా భూ యజమానులు,ఆర్‌ఓఆర్, పట్టాదారులు, నాన్-పట్టా,ఎన్ డిఎస్ రైతులు మరియు కౌలుదారులు మాత్రమే అర్హులు.గుర్తింపు నిర్ధారణ కోసం (పట్టా పాస్‌బుక్)తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ పంపబడుతుంది.రిటైలర్లు నివేదించిన రియల్‌టైమ్ స్టాక్ ఆధారంగా రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకోవచ్చు. బుకింగ్ పూర్తయిన అనంతరం రైతుకు ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడీ జనరేట్ అవుతుంది.సాగు ట్యాబ్‌లో నమోదు చేసిన భూమి విస్తీర్ణం ఆధారంగానే యూరియా బ్యాగుల సంఖ్య స్వయంచాలకంగా నిర్ణయించబడుతుంది.పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు బుకింగ్‌లు నిర్దిష్ట విరామాల్లో బహుళ విడతలుగా (స్పెల్స్) విభజించబడతాయి. మండలంలోని ఏదైనా అధీకృత రిటైలర్ లేదా రైతు సేవా కేంద్రాల నుండి బుక్ చేసుకున్న యూరియాను రైతులు కొనుగోలు చేయవచ్చు. యూరియా బుకింగ్ కేవలం 24 గంటలపాటు మాత్రమే యాక్టివ్‌గా ఉంటుంది.ఆ వ్యవధిలో కొనుగోలు చేయకపోతే,స్టాక్ ఆటోమేటిక్‌గా సిస్టమ్‌లోకి విడుదల అవుతుంది.రైతులకు ఏదైనా సహాయ సూచనల కొరకు గ్రామస్థాయిలో జిపివోలు,పంచాయతీసెక్రటరీలు,వ్యవసాయ విస్తరణ అధికారులను వాలంటీర్లుగా నియమిం చడం జరిగిందని తెలిపారు.రైతులు ఈ ఆన్‌లైన్ విధానాన్ని సద్వినియోగం సమయాన్ని ఆదాచేసుకోవాలని,ప్రభుత్వ సూచనలను పాటించాలని మండల వ్యవసాయ అధికారిని రేణుకా చక్రవర్తిని కోరారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు బిఫారాలు

## డిసిసి అధ్యక్షురాలు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 01(జనంసాక్షి):** సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి బిఫారాలు అందజేశారు. అభ్యర్థులు తమ బిఫారాలు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో రెండు రోజులు ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థులకు బిఫారాలు పంపిణీ చేశారు. టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ , సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జార్జ్, సీనియర్ నాయకులు బొంగుల రవి,సంతోష్, కిరణ్ గౌడ్ సమక్షం లో నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి మున్సిపాలిటీ బిఫారాలు అందజేశారు. సదాశివపేట మున్సిపాలిటీ కి సంబంధించిన బిఫారాలను సిడిసి ప్రెసిడెంట్, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డిలకు అందజేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచన మేరకు జోగిపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థుల బిఫారాలను మంత్రి వ్యక్తిగత సహాయకుడు హన్మండ్లు కు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అందజేశారు.

## బీసీవై పార్టీ తెలంగాణ పీఏసీ సభ్యుడిగా ఓరుగంటి వెంకటేశ్వర్లు

- తెలంగాణలో బీసీవై పార్టీని బలోపేతం చేస్తా
- పీఏసీ సభ్యుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు



**మహేశ్వరం (జనంసాక్షి):** భారత చైతన్య యువ జన పార్టీ (బీసీవై)తెలంగాణ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన ఓరుగంటి వెంకటేశ్వర్లును బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ నియమించారు.ఈ సందర్భంగా ఓరుగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...తనపై నమ్మకంతో పీఏసీ సభ్యుడిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణలో బీసీవై పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.పార్టీ విధానాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేస్తానని పేర్కొన్నారు.

## సేవకు సత్కారం...

# కొండ విజయ్‌కు లయన్స్ క్లభ్ ఆవార్డు



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** గత కొన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంద్వారా ఏంతో మంది కడుపు నింపు తున్న లయన్స్ క్లభ్ ఆఫ్ హైద్రాబాద్ అద్యక్షుడు కొండ విజయ్ కుమార్ సేవకు తగిన సత్కారం లభించినట్టు అయ్యింది. ఈ మేరకు లయన్స్ క్లభ్ 324 డి రీజియన్ చైర్మెన్ రమణ అవార్డు అందజేశారు. హుడాకాలనీ లోని హోప్ ఫౌండేషన్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్ రమణ కొండా విజయ్ కి అవార్డు ప్రధానం చేశారు. పేద ప్రజలకు తనవంతుగా భోజనం అందచే యాలనే ఆలో చనతో గత మూడున్నర సంవత్సరాలు గా ప్రతి శనివారం 2 వేలకు పైగా భోజనాలు అందచేయడం ఏంతో గొప్పదని తెలిపారు. సమాజం తమ వంతుగా ఏంతో కొంత సహాయం చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలిగితే సమాజం కు కొంత మేరకు ఉపయోగం అని రమణ తెలిపారు. లయన్స్ క్లభ్ ఆద్వర్యంలో ఆవార్డు ప్రకటించడం పట్ల కొండ విజయ్ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తమ అన్నదాన కార్యక్రమాలు విస్తృతం చేయనున్మట్లు కొండ విజయ్ పేర్కోన్నారు.

# నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి

- కేంద్ర ప్రభుత్వం కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తుంది
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు



**మహేశ్వరం, ఫిబ్రవరి 1(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు అన్నారు.ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని లక్ష్మిగార్డెన్ లో కార్మిక సంఘాల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ... నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు కార్మిక సంఘాలు పోరాటం చేయాలన్నారు.కార్పొరేట్ శక్తుల ప్రయోజనం కోసమే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను తెచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి కవిత, ఐఎన్టియూసీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు నడికూడ శివ,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పానుగంటి పర్వతాలు,దత్తు నాయక్, సిఐటియూ జిల్లా అధ్యక్షుడు రుద్ర కుమార్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి చందు యాదవ్,వడ్ల సత్యనారాయణ,మల్లేష్ ,రంగారెడ్డి నరసింహారెడ్డి, కిషన్,రామ్మోహన్ పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చర్లపల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యం

**కార్పొరేటర్ శ్రీదేవి**

**కాప్రా, (జనంసాక్షి) :** చర్లపల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌కు చెందిన విద్యా మారుతి కాలనీ,లోకమాత కాలనీ, జ్యోతి నగర్,మధుసూదన్ రెడ్డి కాలనీ,ఐ జి కాలనీ ,శివ సాయి నగర్ కాలనీలకు చెందిన స్థానికులు, సీసీ రోడ్ల నిర్మాణానికిమంజూరు సాధించిన సందర్భంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ని వారి నివాసంలో మర్యాదాపూర్వకంగా కలసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడు తూ, చర్లపల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ



అధ్యక్షులు ,కాంగ్రెస్ నాయకులు అబ్బయ్య, గురు సాయి,మంద అశోక్,పరశ్రరామ్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొడిగె పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు వెంటన చంద్రబాబు నాయుడుకు క్షమాపణలు చెప్పాలి

**కాప్రా, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** ఆంధ్ర ప్రదేశ్‌రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పై అసభ్య పదజాలంతో విమర్శించిన వైసిపి నాయకుడు అంబటి రాంబాబు తక్షణమే క్షమాపణలు చెప్పాల ని తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఏ ఎస్ రావు నగర్ డివిజన్ బృందావన్ కాలనీ చౌరస్తాలో ఆంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విమర్శించే స్థాయి అంబటి రాంబాబుకు లేదని వెంట నే చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని లేనియెడల తెలుగు దేశం పార్టీ కార్యకర్త కోపాగ్నికి గురి కాక తప్పదు అని రాబోవు రోజుల్లో రోడ్డు మీద కూడా తిరుగవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ మాజీ కౌన్సిలర్ గడ్డమిధి రాములు యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు మొవ్వ శ్రీనివాస కుమార్,సీనియర్ నేతలు బింగి బిక్షపతి, గొట్టి పాటి వెంకటేశ్వరావు, , శేషు, గోబేరు రమేష్, రవి, చల్లపల్లి నాగేశ్వరావు, క్రిష్ణ గౌడ్, సత్యం యదవ్, హరి కృష్ణ,



రాంబాబు, వినయ్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

## డిస్టిక్ గవర్నర్ సేల్వ సాయి రామ్ రాజు



**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ 320 బి ఆదర్శ వంతమైన క్లబ్ అని డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వ సాయిరామ్ రాజ్ అభినందించారు. సికిం ద్రాబాద్ నార్త్ చాటర్ నైట్ కార్యక్రమం జీడివెట్లలోని ఓ ప్రైవే టు హోటల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా హాజరైన డిస్టిక్ గవర్నర్ లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. ఐదు సంవత్సరాలుగా ఉదయం అల్పాహారం అందిస్తూ అన్ని లయన్స్ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ప్రపంచంలోనే ఎనిమిదవ అత్యంత పెద్ద క్లబ్ గ గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమ ంలో మల్టీ జోనల్ కౌన్సిల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, మాజీ గవర్నర్లు విద్యాసాగర్, విజయ్ కుమార్ శెట్టి, లయన్స్ క్లబ్ సికింద్రా బాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ దయాకర్, పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసే కుట్ర
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**బోడుప్పల్ (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ యందు ప్రవేశపెట్టిన 2026-2027 వార్షిక బడ్జెట్ లో విద్యా రంగానికి అన్యాయం చేస్తున్నది. 12 ఏళ్ల మోడీపాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగినమొత్తంలో జరగటం లేదు. ఈ సంవత్సరం 53.5 లక్షల కోట్ల మొత్తం బడ్జెట్లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం 1,39,289 కోట్లు. ఇది మొత్తం బడ్జెట్లో 2.6 శాతం మాత్రమే! ఈ నిధులు పెరిగినట్లు కనిపించినప్పటికీ మొత్తం బడ్జెట్ లో శాతంలో పెరుగుదల లేదు. తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుంది. 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్న కూడా తెలంగాణకి రావలసిన నిధులు, హక్కుల గురుంచి నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నది. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని ఉంటూ. . తెలంగాణలో ఉన్న విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారు.గత సంవత్సరం బడ్జెట్ 48,21,000,ల కోట్లు కాగా విద్యకు కేటాయించింది 1,28,628 కోట్లు, మొత్తం బడ్జెట్‌లో 2.6 శాతం మాత్రమే. బడ్జెట్ కేటాయింపులు లేకుండా బడ్జెట్ ప్రసంగాలు ఎన్ని చేసినా క్షేత్రస్థాయిలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుంది.

# నేపాల్‌లో రోలర్ హ్యాండ్ బాల్ స్కేటింగ్ పోటీలు

- గోల్డ్ మెడల్స్ సాదించిన విశ్వక్ తేజ్,ఇషాన్ తేజ్
- అభినందించిన కొత్త కిశోర్ గౌడ్

**బోడుప్పల్ (జనంసాక్షి):** నేపాల్ వేదికగా జనవరి 23,24 తేదిలలో జరిగిన రోలర్ హ్యాండ్ బాల్ స్కేటింగ్ 2025-26 ఛాంపియన్స్ పోటీలలో బోడుప్పల్ ప్రాంతానికి చెందిన విశ్వంక్ తేజ్,ఇషాన్ తేజ్ లు పాల్గొని గోల్డ్ మెడల్స్ సాదించారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రదాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ మెడల్స్ సాదించిన విశ్వంక్ తేజ్,ఇషాన్ తేజ్ లను అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కిశోర్ గౌడ్ మాట్లాడుతూ పిల్లలు విద్య తో పాటు ఆటలలో కూడ రాణించాలని, బోడుప్పల్ ప్రాంతం పిల్లలు గోల్డ్ మెడల్ సాదించడం గర్వించ దగిన విషయమన్నారు. పిల్లలు మెడల్స్ సాదిస్తే తల్లిదండ్రులకు చెప్పలేనంత ఆనందం



ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ అక్బర్ పాల్గొన్నారు.

# దుండిగల్ రెవెన్యూ పరిధిలో విచ్చలవిడిగా కబ్జా

## రెవెన్యూ మండల అధికారుల కనుసన్నల్లోనే కబ్జా

**నిజాంపేట్ (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మండల రెవెన్యూ పరిధిలోనిడి పోచంపల్లి 120 సర్వే నెంబర్‌లోని పలు ప్రాంతాల్లో అలాగే గాగిల్లాపూర్ 214 సర్వే నెంబర్ పలు బస్తీలలో గల ప్రభుత్వ భూములు ఎలాంటి అనుమతులు లేకుండా, అన్యాక్రాశీతంగా పలువురు కబ్జాదారులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపట్టి పేద ప్రజలకు విక్రయాలకు పాల్పడుతున్నారు. అట్టి అక్రమ నిర్మాణాలను నియంత్రించి కాపాడవలసిన అధికారులే కంచే చేనుమేసే చందంగా కబ్జాదారుల కనుసన్నలోనే వారికి సహకరిస్తూ చోద్యం చూస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే గుర్తించి అక్రమ నిర్మాణంలని కూల్చి వేసిన వాటిని ఇటీవల బదిలీ పై వచ్చిన ఆర్ ఐ, రజనీకాంత్, సంబంధిత జిపిఓ సందీప్ లు అక్రమ నిర్మాణాలను, సక్రమం అయ్యే విధంగా చేయడం మాకు సాధ్యమే అంటు వారి కనుసన్నల్లోనే నిర్మాణాలను సక్రమంగాచేసి వారి కబ్జాలకు , వత్తాసు పలుకుతూ స్వామి భక్తిని చాటుకుం టు కుంటున్నారు. కొత్తగా సైతం వారు పలు చోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మిస్తుంటే వాటిని నియంత్రించ లేక పోగా దారా దత్తశీ



చేస్తూ వ్యవహరించడం పట్ల స్థానిక ప్రజలు విస్మయం చెందుచున్నారు. ఇదే కార్యాలయములో గత ఆర్ఐలు విధులు నిర్వహిస్తూ అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టి కూల్చి వేసిన ఆ భూముల్లోనే ప్రస్తుత ఆర్ఐ రజనీకాంత్ నేతృత్వంలో ముఖ్యంగా నాలుగు చోట్ల మరల అవే స్థలాల్లోనే కబ్జాదారుడు మరల అక్రమ నిర్మాణాలు చేపట్టితే . ఇటీవల కొత్తగా వచ్చిన తాసిల్దార్ కు తప్పుడు సమా చారాలు, కబ్జాదారుడి ఇచ్చిన తప్పుడు ధృవీ కరణ పత్రాలు, చూపిస్తూ తన మిస్సరిజంతో దుండిగల్ రెవెన్యూ మండలంలో అక్రమ నిర్మాణాలు సక్రమంగా మెప్పించడశీ, సఫ్లీకృతుడయ్యాడని తెలుపచ్చు, అలాగే ఇటీవల జరిగిన కబ్జాల విషయంలో ఆర్ఐ వ్యవహరిస్తున్న తీరుపై కబ్జా దారులకు వరంగా మారుతుందని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అలాగే ఓ కుంట అక్రమ కబ్జా నిర్మాణం విషయంలో కుంటల్లో నిర్మా ణం అక్రమమేనని ఇరిగేషన్ అధికారులు తమ నివేదిక రెండు సార్లు ఇచ్చినప్పటికీ దాని పై చర్యల విషయంలో తూతూ మంత్రంగా ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అనే చందంగా వ్యవహరించడం పై ఆర్ఐ కబ్జాదారుల విషయంలో ఎంత ఉదాసీ నతతో వ్యవహరిస్తారో ప్రజలే న్నారు. అదేవిధంగా గతంలో సర్వే నెంబర్ 120 డాక్టర్ బస్తిలో రెండు సార్లు గత ఇద్దరూ ఆర్ఐలు కూల్చి వేసిన రెండు అక్రమ నిర్మాణం లకు ప్రస్తుత ఆర్ఐ రజినీ కాంత్ ఆ అక్రమ నిర్మాణాలపై సక్రమమేనని కితాబు ఇవ్వడం పై సర్వత్ర అనేక విమర్శలు ఎదుర్కొం టున్నారు, ఇలా చెప్పుకుంటూ పోతే దుండి గల్ మండల రెవెన్యూలో 214 సర్వే నెంబర్ పలుచోట్ల కొత్తగా అక్రమ నిర్మాణాలు విచ్చల విడిగా కి అడ్డు కట్ట వేయవలసిన అక్కడ నిర్వహించే ఆర్ఐ సైతం చర్యలు తీసుకోవడంలో మాత్రం వెనుకంజ వేయడం కబ్జాదారులకు కాసుల పంటగా మారుతుంది. ఇప్పటికైనా పై అధికారులు ప్రజా ప్రయో జనాల దృష్ట్యా ప్రభుత్వ భూములపై కబ్జాలు నియంత్రించి కబ్జాదా రులపై చర్యలు తీసుకో వాలని, అదేవిధంగా దుండిగల్ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజలు తెలియజేస్తున్నారు.

# మల్కాజిగిరిలో అక్రమ 'కాసుల' వేట

## టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై నిప్పులు చెరుగుతున్న స్థానికులు

**అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు**

**మల్కాజిగిరి ఫిబ్రవరి 1(జనంసాక్షి):** మల్కాజిగిరి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల పర్వం మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా సాగుతోంది. నిబంధనలను పాతరేస్తూ, అనుమతులులేని కట్టడాలతో మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్లు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.సెక్షన్ ఆఫీసర్ల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ వాటాల మత్తులో మునిగి పోవడంతో, సామాన్యుడి గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మౌలాలి డివిజన్‌లోని ఆర్కే హెచ్ కాలనీ, గౌతమ్ నగర్,వసంతపురి,ఆనంద్ బాగ్, ప్రేమ్ విజయ నగర్ కాలనీల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.పాత భవనాలపై అదనపు అంతస్తులు నిర్మిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే,అధికారులు నోటీసులు ఇచ్చి హడావుడి చేస్తారు.కానీ ఆ నోటీసులు అక్రమాలను ఆపడానికి కాదు,తమ జేబులో నింపు కోవడానికేనని బహిరంగంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంత ర్గత ఒప్పందాలు కుదిరితే చాలు,కళ్లు మూసుకుని అక్ర మ నిర్మాణాలకు అండగా నిలిచి బయట రంగులు వేసుకోవాలని సలహాలు ఇస్తున్నారు.నివాస ప్రాంతాల అనుమతులతో భారీ వాణిజ్య భవనాలను నిర్మిస్తూ ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను సృష్టిస్తున్నారు.రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు సాగుతున్నా, అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున



నగదు చేతులు మారిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నా, అధికారుల జేబులు మాత్రం నిండుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి, క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై వేటు వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడమే కాకుండా, వీటికి సహకరించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి




**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** మున్సిపాలిటీ ఎన్నికల్లో విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించు కోవాలి జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లోనిమక్తల్ ,నారాయణపేట, మద్దూరు,కోస్గి మున్సిపాలి టీలో ఓటరుగా నమోదై ఉండి ఎన్నికల విధి కొరకు డ్రాఫ్ట్ చేయబడ్డ ఉద్యోగి ఈ నెల 3వ తేది లోపల పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అందు కోసం ఫారమ్ 12లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారమ్, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ, ఈ పిఐసి కార్డ్ కాపీ ,ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డ్ కాపీ.నిర్దేశించిన పత్రాలను ఆయా మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యా లెట్ కోరకు నియమిం పబడిన అధికారులకు సమర్పించాలనీ సూచించారు.

# కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, "కేసీఆర్ ని టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే" అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే ఈ సిట్ నోటీసులు జారీ చేసిందని తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గారు తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్‌కు గుర్తింపు ఉందని, ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు 60 లక్షల మంది కార్యకర్తల మద్దతుతో పాటు నాలుగు కోట్ల మంది ప్రజల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెడితే పాతాళానికి వెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూర్ఖమైన రాజకీయ తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఇది చట్టపరమైన విచారణ కాదని, పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని అన్నారు. అధికారం శాశ్వతం కాదు... అహంకారం అంతకంటే శాశ్వతం కాదు. మీలాంటి ఎందరో నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు" అంటూ రేవంత్ రెడ్డిపై చింత ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింగరేణి, సోలార్ టెండర్లు, ఇతర అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ సిట్ నోటీసుల డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలు చేతకాక, ప్రజల కడుపు నింపలేక అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టి ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, డా. శ్రీహరి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, షేక్ రషీద్, మల్ల గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమీరాబాద్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** మండలంలోని అమీరాబాద్ గ్రామస్తుల త్రాగునీటి ఎద్దడిని నివారించేందుకు స్థానిక సర్పంచ్, పంచాయతీ అధికారులు దృష్టి సారించారు. మండల నీటిపారుదల శాఖ ఏఈ, ఎంపీఓ ఆదేశాల మేరకు ఆదివారం గ్రామ సర్పంచ్ పీజీ విజయ, కార్యదర్శి రేణుకలు దృష్టి సారించారు. ఓ త్రీ ఫేస్ మోటార్ ద్వారా నేరుగా 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు ఊపరితల ట్యాంకులకు సరఫరా చేసి ప్రధాన పైపుకు మరమ్మతులు చేపట్టారు. గత కొంతకాలంగా ప్రధాన పైపు నుండి లీకేజీ ఇవ్వడంతో గ్రామంలోని పలు కాలనీవాసులు ఎద్దడిని ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు మరమ్మత్తులు చేపట్టి త్రాగునీటిని పునరుద్ధరించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## మెదక్ చేగుంట రహదారిపై బీఆర్ఎస్ పార్టీ రాస్తారోకో



**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** మాజీ సీఎం కేసీఆర్ కు సీట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ చిన్నశంకరంపేటలో బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం కావాలని కక్ష సాధింపులకు పాల్పడుతుందని దేవేందర్ రెడ్డి మండిపడ్డారు. నిరసనకారులు పోలీసుల మధ్య కాసేపు ఉద్రిక్తత నెలకొంది. టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ రెడ్డిమాట్లాడుతూ,తెలంగాణ ప్రధాత కేసిఆర్ పై అక్రమ కేసులు పెట్టడాన్ని యావత్ తెలంగాణ ప్రజలు నిరసిస్తున్నారని, కెసిఆర్ ను ముట్టుకుంటే తెలంగాణ అగ్ని గుండమే అవుతుందని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షులు పట్లోరి రాజుమాట్లాడుతూ కేసీఆర్‌పై సిట్ విచారణ రాజకీయ ప్రతీకారానికి అద్దం పడుతుందన్నారు. నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**టేక్మాల్, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలలో మందులన్నీ అందుబాటులో ఉండాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్య అధికారులకు సూచించారు. మందుల గదిని, రోగుల రుములను, వైద్యుల హాజరు పట్టికలను పరిశీలించారు.ఏ మందులు అందుబాటులో ఉన్నాయో అని అడిగి తెలుసుకున్నారు. డ్యూటీ డాక్టర్ ఎవరు, రాత్రి వేళలో ఎంతమంది వైద్యులు సిబ్బంది ఉంటున్నారని వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వైద్యం అందించాలని, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని వైద్య సిబ్బంది నీ ఆదేశించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తూ నిరసన, ర్యాలీ



**సదాశివపేట, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడానికి బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక కేవలం రాజకీయ కక్షతోనే సిట్ పేరిట బిఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నారన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలన లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చు అని భావిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, మాజీ కార్పొరేటర్ సపాన్ దేవ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న,పట్టణ యువత అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీకాంత్, బిఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు ఖమీల్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం



**పెబ్బేరు, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** పెబ్బేరు పట్టణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను పరిచయం చేశారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డులకు గాను 1, 12వ వార్డులను మినహాయించి మొత్తం 10 మంది అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు 2 వార్డుకు గౌని శైలజ హేమా రెడ్డి 3 లో గోనెల అరవింద్, 4లో దూపం సునిత, 5లో కంచె జ్యోతి, 6లో తిమ్మనగారి కృష్ణవేణి, 7లో గంధం శివ, 8లో రంగస్వామి గౌడ్, 9లో క్రాంతి కుమార్ నాయుడు, 10వ వార్డుకు మానపాడు రాములు, 11వ వార్డుకు జీ. శ్వేతలను ఖరారు చేసినట్లు తెలిపారు. దాదాపు రెండు నెలల ముందు నుంచే బీజేపీ ఆధ్వర్యంలో వార్డుల్లో పర్యటించి దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టి అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. ఇంటింటికీ తిరిగి వార్డుల్లో నెలకొన్న సమస్యలను, ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించామని అన్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్రతి వార్డులో తాగు నీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపిని గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఒక్కసారి తమకు అవకాశం కల్పించాలని, తమ సత్తా ఎంటో చూపించి ప్రజల మన్ననలను గెలుచుకొని తీరతామని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు హేమా రెడ్డి, నాయకులు రాఘవేందర్ గౌడ్, సర్వేశ్వర్ గౌడ్, వెంకట్రామ్ రెడ్డి, కార్తిక్, భరత్, మహేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



**సదాశివపేట, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి అన్నారు. సదాశివపేట మండలం ఇశ్రితాబాద్ గ్రామ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రీమియర్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిసి గడిల రామ్ రెడ్డి , పాల్గొని పోటీలో గెలుపొందిన విజేతలకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని యువత ప్రతిభను ప్రోత్సహించడం కోసమే క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఒగ్గ శ్రీనివాస్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, మాజీ ఉపసర్పంచ్ మోసిన్, మైనార్టీ నాయకులు సయ్యద్ రసూల్, గ్రామ ఉపసర్పంచ్ కట్టె గోశే శ్రీనివాస్,నాయకులు ,యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేదానికి గ్రామస్థుల తీర్మాణం



**అల్లాదుర్గం ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** గ్రామంలో మద్యం అమ్మకూడదంటు అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో సర్పంచ్ పాంపాటి వీరప్ప ఆధ్వర్యంలో పలువురు వార్డు సభ్యులు,గ్రామపెద్దలు ,యువకులు ,మహిళలు గ్రామంలోని చావిడి వద్ద సమావేశం ఏర్పాటు చేసి తమ గ్రామంలో మద్య నిషేధం చేస్తున్నట్లు గ్రామస్థులు తీర్మాణం చేశారు. ఇకపై గ్రామంలో బెల్టు షాప్ ల ద్వార ఎవరైనా మద్యం అమ్మిన వారికి కొన్నవారికి జరిమానా విధిస్తామని తెలిపారు. గ్రామస్థుల ఆరోగ్యమే ముఖ్యమని తెలుపుతూ తీర్మాన పత్రాన్ని అల్లాదుర్గం ఎస్సై శంకర్ కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సాపూర్ అభివృద్ధే లక్ష్యం



**నర్సాపూర్, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణంలోని 08వ, 15వ వార్డులలో మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణ సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. ప్రజల విశ్వాసం, మద్దతుతో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆవుల రాజిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మడివాళ మాచదేవ్‌కు ఘనంగా నివాళి



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** రజకుల కులదైవం శ్రీ మడివాళ మాచదేవ్ జయంతి సందర్భంగా.. మాచదేవ్ భక్తులు జయంతి వేడుకను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం న్యాల్ కల్, రామతీర్థం, గుంజేట్టి, వడ్డీ, రేజింతల్, రాజోళ, హుమ్నాపూర్, తదితర గ్రామాల్లో.. మాచదేవున్ని ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో శోభయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సంగం మండల అధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు అంజన్న, అనిల్, మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం



**మల్దకల్, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారంశ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రమేష్,రవి,ప్రద్యుమ్న వేదమంత్రాలతో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణాన్ని జరిపించిన దాతలు శేషంపల్లి శశిధర్ రెడ్డి దంపతులు,పెద్దపల్లి సర్పంచ్అల్వాల శిరీషరాజశేఖర్ రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించగా వారికి స్వామి వారి శేష వస్త్రంతో ఆలయ చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, బాబురావుతదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక బడ్జెట్‌తో దేశం ఆర్థికంగా మరింత బలోపేతం



**సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ చారిత్రాత్మకమైనదని భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ప్రబారి సంగప్ప జన్వాడే, జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్ అన్నారు. అగ్ర దేశాలతో పోటీపడుతూ భారతదేశాన్ని ఆర్థికంగా ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందని వారు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ బడ్జెట్ రైతులు, మహిళలు, చిరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఎంతో మేలు చేసేలా రూపకల్పన చేయబడిందన్నారు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. తాజా బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్న వారు, రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ట్రంప్ విధిస్తున్న ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టే దిశగా ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొమ్మిది కేంద్రీయ విద్యాలయాలు, పదహారు జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ చర్యలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య మరింత చేరువ అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షులు బాసంగారి వెంకట్, నాయకులు తొడుపు నూరి వెంకటేశం, డాబా నరేష్, గందే సంతోష్, పవన్ తేజ రెడ్డి, ఏర్వ గణేష్, మహేందర్, శ్రీనివాస్, సాయిబాబా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లకుంట చెరువు వద్ద చెత్తాచెదారం తొలగింపు!

- స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి కల్పన, నర్సంపేట డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్
- 'జనం సాక్షి' కథనానికి స్పందన...



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** గొల్ల కుంట చెరువు వద్ద చెత్తాచెదారాన్ని గొల్లభామ తండా గ్రామ సర్పంచ్ గుగులోతు బాలు నాయక్, పంచాయతీ కార్యదర్శి లింగాల సంతోష్ లు తొలగింపజేశారు. ఆదివారం 'జనం సాక్షి' దినపత్రికలో గొల్ల కుంట చెరువులో చెత్తాచెదారం డంపింగ్.. అని వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి కల్పన, నర్సంపేట డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్ కుమార్ లు వెంటనే స్పందించారు. గొల్లభామ తండ గ్రామ శివారులోని గొల్లకుంట చెరువులో, చెరువు కట్టపై ఉన్న చెత్తాచెదారంను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి లింగాల సంతోష్ కుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది గుగులోతు రవి, బట్టు మంగన్ తో చెరువులోని చెత్తాచెదారాన్ని అలాగే కట్టపై పోసిన చెత్తాచెదారం కుప్పను శుభ్రం చేయించారు. తొలగించిన చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్ కు తరలించినట్లు తెలిపారు.

## తెలంగాణ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుర్ల

- ప్రధాన కార్యదర్శి గా రామడుగు మనోహర్, కోశాధికారిగా సిద్ధి నాగరాజు..



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి1 (జనంసాక్షి) :** తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ మరియు డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు నీలగిరి హనుమంతరావు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ మరియు డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామడుగు మనోహర్,రాష్ట్ర కోశాధికారిగా సిద్ధి నాగరాజు లను రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎంపికైనటువంటి నాగుర్ల వెంకటేశ్వర్లుకు, నూతన కార్యవర్గానికి డీలర్స్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల మరియు డీలర్ల సంక్షేమము అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని, రైతులకు సకాలంలో నాణ్యమైనటువంటి విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నటువంటి డీలర్స్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసోసియేషన్ నుండి రవీందర్ రెడ్డి, మల్లేశం, జలంధర్,వరంగల్ నుండి సత్యనారాయణ రెడ్డి,కేదారి,నాగరాజు, రాజేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి,ఖమ్మం నుండి రాంబ్రహ్మం, నాగేశ్వరరావు, నాగేందర్, హైదరాబాద్ నుండి మునాఫ్, వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున డీలర్స్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితుల సంక్షేమం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, ఫిబ్రవరి 1 (జనం సాక్షి):** దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఆర్ ఆర్ గార్డెన్ లో నిర్వహించిన మాదిగ కుల ఆత్మయ సమ్మేళానా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితులు ఎప్పుడూ కాంగ్రెస్ వైపే ఉన్నారని, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గడిచిన శాసనసభ,పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి తల్లి సోనియా గాంధీ చేసిన కృషి మరువలేనిదని,దళితుల అభ్యున్నతి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని,తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సౌకర్యాలు పకడ్బందీగా కల్పిస్తామని తెలిపారు.దళితులను నిలువెత్తున మోసం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని, దళిత ముఖ్యమంత్రి చేస్తానని, తెలంగాణ కాపలా కుక్కగా ఉంటానని చెప్పిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యి దళితులను మోసం చేశాడన్నారు.కాంగ్రెస్ పాలనలోనే నిజమైన న్యాయం జరుగుతుందని అన్నారు.

# కేసీఆర్‌పై సిట్ నోటీసులకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ రాస్తారోకో నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ కేసిఆర్ పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, సిట్ నోటీసులు పూర్తిగా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మానుకోటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

**మహబూబాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని సిట్ విచారణ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో భాగంగా జ్యోతిరావు పూలే విగ్రహం సెంటర్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. ర్యాలీ అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాజీ ఎంపీ టిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మా లోతు కవిత మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ లు మాట్లాడుతూ, ప్రజల మద్దతుతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్ర అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన కేసీఆర్ గారిపై కక్ష సాధింపు ధోరణితో సిట్ విచారణల పేరుతో వేధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ కక్ష సాధింపులకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి జిల్లా నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్ జిల్లా యువజన అధ్యక్షులు యళ్ల మురళీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల శ్రీనివాస్ యాదవ్, అశోక్ నాయక్, పొన్నాల యుగేందర్ అధిల్ పాషా ప్రభాకర్ మాజీ కౌన్సిలర్లు, యువకులు, పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా 2026 కేంద్ర బడ్జెట్

- బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి





**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి1(జనం సాక్షి) :** వికసిత్ భారత్ లక్ష్యంగా 2026 కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని బి జేఎల్పీనేత,నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026 ను ప్రజల వరకు చేరవేసేందుకు కేంద్ర బడ్జెట్ ప్రచార్ అభియాన్ -2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్మల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో"బడ్జెట్ 2026" ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్ర ఇంచార్జి అభయ్ పాటిల్,ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నర్సయ్య గారు,మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పుల్లారావు పాటు జిల్లా,మండల,పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు వీక్షించారు.

### ఈనెల 8న నిర్మల్ కు అమిత్ షా రాక...

**నిర్మల్ రూరల్,ఫిబ్రవరి1(జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోఈ నెల 8వ తేదీన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా నిర్మల్ కు వస్తున్నట్లు బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర ఇంచార్జి అభయ్ పాటిల్ తో కలిసి మహేశ్వర్ రెడ్డి సభ ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ల్యాండింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నర్సయ్య,మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్,సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,బీజేపీ జిల్లా పట్టణ,మండల నాయకులు పాల్గొన్నారు.



### భీమన్న జాతరలో మొక్కులు తీర్చుకున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో భీమన్న జాతర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి హాజరయ్యారు. గ్రామస్తులు, నాయక్ పోడ్ కులస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమన్న దేవుని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 12 మందిపై కేసు

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న 12 మందిపై కేసు నమోదు మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ను ఫోన్ ట్యాపింగ్ విషయంలో మరోసారి సిట్ నోటీసులు ఇచ్చి, విచారణకు పిలువడంతో మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజి చౌరస్తాపై ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల భారాస కార్యర్తలు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా రహదారిని అడ్డగించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దాహనం చేసి నిరసన ఏర్పాటు చేశారని. ఈ విషయం పై స్థానిక పోలీసు స్టేషన్లో 12మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ముందస్తు అనుమతులు లేకుండా సభలు, ర్యాలీల నిషేధం
- ఈనెల 28 తారీఖు వరకు నిబంధనల అమలు
- జిల్లా ఎస్పి అఖిల్ మహజన్



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణ భంగం కాకుండా, అదేవిధంగా త్వరలో జరగనున్న ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడంకోసం ఫిబ్రవరి 1 నుండి 28వ తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ - 1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## మద్ది మేడారం జాతర ఆదాయం రూ.లక్షా 78 వేల 173

**నల్లబెల్లి, ఫిబ్రవరి 01 (జనంసాక్షి):** నల్లబెల్లి మండలంలోని నాగరాజు పల్లి శివారు మద్ది మేడారం జాతర ఆదాయం లెక్కింపును ఆదివారం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 1లక్ష 78 వేల 173 వచ్చినట్లు ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు. హుండీలో విదేశీ కరెన్సీ రావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పూజారులు దురిశెట్టి నాగరాజు, హరికృష్ణ, ట్రస్ట్ చైర్మన్ పబ్బు రాజేష్ గౌడ్, సర్పంచ్ ఎరుకల లలిత రఘునా, పంచాయతీ కార్యదర్శి విష్ణు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు..

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**

**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 1(జనం సాక్షి):** వరంగల్ కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు.

# కేసీఆర్‌ను సిట్ విచారణ పేరుతో వేధిస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** కేసీఆర్‌ను సిట్ విచారణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని గ్రీన్ రీచార్జ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా కెసిఆర్ ను ప్రభుత్వం వేధిస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేసిన చేస్తున్నామని తెలిపారు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధకుడు తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటీసు పంపించి విచారణ పేరుమీద అవమానాలకు గురి చేసింది అన్నారు. కుంభకోణాల్లో మునిగిపోయిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వాటి నుంచి తప్పించుకునేందుకు రోజురోజుకు కొత్త కొత్త నాటకాలకు తెరలేపుతోంది. కాంగ్రెస్ పార్టీ కుట్రపూర్వతంగా నోటీసు పంపించి తెలంగాణ ప్రజలకు రోజుకో సినిమా చూపిస్తున్నారు మండిపడ్డారు. ఒక్క హామీ నెరవేర్చలేని వాళ్ళు మున్సిపల్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తాం పేర్కొన్నారు. ఆదివారం నల్ల బ్యాడ్జి లతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాలను కోర్టు స్వయంగా విచారణకు ఆదేశించినప్పటికీ, ఆ విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ పార్టీ నాయకులు వెనక్కి తగ్గడం ప్రజలకు అన్నీ అర్థమవుతున్న విషయమే. నిజాలు బయటకు వస్తాయన్న భయంతోనే విచారణకు దూరంగా ఉండే ప్రయత్నం చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ స్పష్టంగా భావిస్తోందని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టే దొంగ నాటకాలకు, అబద్ధపు ప్రచారాలకు ఇక అవకాశం లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరగకుండా చేయడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో స్థానిక నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారని, అర్ధరాత్రి వేళల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, కార్యకర్తలను బెదిరించడం వంటి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ తరహా భయభ్రాంతుల రాజకీయాలకు బిఆర్ఎస్ పార్టీ భయపడేది లేదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేస్తున్నామని, ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమ చర్యలు లేకుండా నిర్మలమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నదే మా లక్ష్యమని, ఏకపక్ష పాలనకు, దోపిడీ రాజకీయాలకు ఇక ముగింపు పలకాలన్నదే నర్సంపేట ప్రజల ఆకాంక్ష. ఆ ఆకాంక్షను నెరవేర్చగల శక్తి బిఆర్ఎస్ పార్టీకే ఉందని మేము నమ్ముతున్నామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే నర్సంపేట ప్రజలకు స్థిరమైన పాలన, అభివృద్ధి, సంక్షేమం తప్పకుండా అందుతుందని మరోసారి స్పష్టంగా చెబుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని జరుగుతున్నటువంటి మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి కేసీఆర్ గౌరవాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్, నియోజకవర్గా కోఆర్డినేటర్,జిల్లా నాయకులు,మాజీ ఎంపీపీ,మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్,ఎన్నికల కన్వీనర్,నియోజకవర్గ యూత్ కన్వీనర్, జిల్లా అధ్యక్షులు,రూరల్ మండల కార్యదర్శి,క్లస్టర్ బాధ్యులు,మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
02 ఫిబ్రవరి 2026

# అంగరంగ వైభవంగా గోదావరి నది హారతి

● జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాచలం, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మాఘ వ్యాస పూర్ణిమ ను పురస్కరించుకొని భక్తుల కోలహాలం జై జై నినాదాలతో భద్రాచలం గోదావరి మాత నదిహారతి అర్చక స్వాముల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో మాఘ వ్యాస పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలంలోని చిన్నారులతో ప్రత్యేక భజన కార్యక్రమం, భక్తి గీతాలతో భక్తుల జైశ్రీరామ్య నమః అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామ వజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదీ హారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారన్నారు. అనంతరం అర్చక స్వాములు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి



పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ 108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన అనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహోత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, పాపకొల్లు వీరయ్య సారపాక దంపతులు అశోక్ కుమార్ శర్మ భద్రాచలం, శ్రీనిధి గోల్డ్ షాప్ పాల్వంచ ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి శ్రీ రాఘవేంద్ర బట్టల షాప్ భద్రాచలం వారు అందించారని ఆయన అన్నారు. గోదావరి నదిహారతి కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులతో పాటు భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సతీమణి మనిషా రాహుల్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ, దేవస్థానం డి ఈ రవీందర్, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పురోహితులు సురేష్ వర్మ, పవన్ కుమార్ వర్మ, అశోక్ కుమార్, కృష్ణమాచార్య, కారంబరీ కృష్ణ శర్మ, రామాచార్యులు, తేజ, సామెతి శేషాచార్యులు, స్వచ్ఛంద సంస్థలు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ నాయకులందరి ఏకాభిప్రాయంతో సూర్యాపేట మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని ఏఐసీసీ ఇన్చార్జ్ సెక్రటరీ విశ్వనాథన్ అన్నారు. పార్టీ నాయకులందరి కలయిక చూస్తుంటే తప్పకుండా సూర్యాపేట మున్సిపాలిటీ గెలుస్తామనే పూర్తి నమ్మకం వచ్చిందని అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, అనుములపురి రవిబాబు, ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ అంజద్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్,నాయకులు పెద్దిరెడ్డి రాజా, ముదిరెడ్డి రమణారెడ్డి, డాక్టర్ రామ్మూర్తి యాదవ్,షఫీ వుల్లా, వెలుగు వెంకన్న, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకే ఈ టాలెంట్ టెస్ట్



**చిలుకూరు, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని కవిత జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్ల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు కస్తూరి సైదులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అంబాల వెంకటి చేతుల మీదుగా ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టాలెంట్ టెస్టులు విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీయటానికి దోహదపడతాయని అన్నారు. టాలెంట్ టెస్ట్ నిర్వాహకులు చేపూరి కొండలు తమ్మనబోయిన నరేష్లు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు అంటే భయాన్ని తొలగించడం కోసం, త్వరలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడం కోసం వారిని ఇప్పటినుండే ఉన్నత చదువులకు మరియు ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు సంసిద్ధం చేయడం కోసం ఇట్టి టాలెంట్ టెస్ట్ ను విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఇట్టి టాలెంట్ టెస్ట్ కు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 887 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. టాలెంట్ టెస్టు విజేతలకు ఈనెల 5వ తేదీన బహుమతులు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు, కవిత జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మాదాల శ్రీధర్, సిపిఐ నాయకులు చిలువేరు ఆంజనేయులు, సిరాపురపు శ్రీనివాస్ రావు, విష్ణు భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కొల్లు శ్రీనివాస్, ఎస్ టి యు నాయకులు కొండ వెంకయ్య, ఏఐవైఎఫ్ చిలుకూరు మండల అధ్యక్ష కార్యదర్శులు అనంతల రాము, కడారు మధు, గోసు వెంకటేష్ ,సాకి నరేష్, దేగ వీరన్న, కొల్లు శ్రీకాంత్, వెంకటలక్ష్మి, సాయివర్షిత, అనుష ,నిక్షిత, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యసాయిబాబా శత జయంతి పుస్తక ఆవిష్కరణ



**మల్దకల్, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ పట్టణంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ భవనంలో తెలంగాణ మహిళా సాహిత్య ,సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100 వ జన్మదిన వేడుకల సందర్భంగా కవిత సంకలనంను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, ఆవిష్కకర్త శ్రీ ఆచార్య మసన చెన్నప్ప ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వఅధ్యక్షుడు గౌరవ అతిథిలుగా ప్రముఖ కవి ఆర్షనిష్టాత బాబుదేవీదాస్, పరమార్థకవి,విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వెల్దండ సత్యనారాయణరావు, ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి,ప్రముఖ కవి, విమర్శకులు,రచయిత గంటమనోహర్ రెడ్డి గ్రంథసమీక్షకులు,అవధాని చుక్కాయిపల్లి శ్రీదేవి, ప్రముఖ గణిత మేథావి విశ్రాంత ఉద్యోగి రావురిసూర్యనారాయణ రావు,పుస్తకంను ఆవిష్కరణ చేసి కవి సమ్మేళనంను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు బాబా గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కవిత సంకలనంలో తమ కవితను రచించినఃదుకు జోగులాంబ గద్వాల్ జిల్లా కవులు విశ్రాంత ఉపాధ్యాయులు కవి రామ్మోహన్ రావు,మల్దకల్ గ్రామ నివాసి,అధ్యాపకులు, కవి సుంకరి బసవరాజప్ప అభినందిస్తూ మెమెంటో సన్మానంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ, ప్రధాన కార్యదర్శి శాంతారెడ్డి, కవులు డాక్టర్ బాలస్వామి పులిజమున,కవులు, రచయితలు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

● మంత్రి కొండా సురేఖ

**మధిర, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** పార్టీ సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరు కట్టుబడి పని చేయాలని మున్సిపల్ ఎన్నికల జిల్లా ఇంచార్జి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మధిర మున్సిపాలిటీ 22 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి కోరారు. ఆదివారం మధిర లోని రెడ్డి గార్డెన్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కష్ట కాలం నుండి కాంగ్రెస్ పార్టీ కోసం అన్ని రకాలుగా కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం జరుగుతుంది తెలిపారు. పై స్థాయి నుండి కింది స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ ఉంటేనే పనులు జరుగుతాయని అన్నారు. ప్రతి వార్డుకి ఐదుగురు చొప్పున కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు వేయడం జరిగిందని, వార్డులో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థి కే కాంగ్రెస్ పార్టీ బీఫామ్



ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలో గెలిచే అభ్యర్థులు మాత్రం అధికారంలో ఐదు సంవత్సరంలో ఉంటారని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలలో రాబొయ్యే అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన వారు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని అన్నారు. అందుకే ప్రతి ఒక్క వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కూడా కలిసిమెలిసి పని చేయాలి సూచించారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు తావు లేకుండా పార్టీ సిద్ధాంతాలు కు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డులో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని, చైర్మన్ పదవి దక్కించుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. 22 వార్డుల్లో గెలిపించి ఇంచార్జి గా వచ్చిన నాకు బహుమతిగా ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. మధిర మున్సిపాలిటీ లో 22 వార్డులు గెలిపించి భట్టి విక్రమార్కకి బహుమానంగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కొండ బాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## భారీ జన సంద్రోహం నడుమ మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశం



**కల్లూరు/సత్తుపల్లి, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** సత్తుపల్లి పట్టణం లోని మాధురి ఫంక్షన్ హాల్ లో సత్తుపల్లి కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్అధ్యక్షతన ఆదివారం జరిగింది. మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశానికి ముఖ్య అతిధిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికలు ఇంచార్జ్, రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ , ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ , టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులు హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి ప్రసంగించారు. మున్సిపల్ కౌన్సిలర్ గా పోటీ చేసే అభ్యర్థుల ఎంపికను సర్వే ల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించటం జరుగుతుంది అని తెలిపారు .కాంగ్రెస్ పార్టీ లో టిక్కెట్లు రాని వారు ఎవరు నిరుత్సాహ పడవద్దని, కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి గుర్తింపు ఉంటుందని, భవిష్యత్తులో వారికి మంచి గుర్తింపు పదవులు లభిస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు, అర్హులు గల లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు మున్సిపాలిటీలో ప్రతి గడపగడపకు తీసుకువెళ్లాలని సూచించారు.సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ గా నిలబడుతున్న 23 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, కల్లూరు మున్సిపాలిటీ నుండి నిలబడుతున్న 20 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ విజయంతో, ప్రజలు ఆశీస్సులతో అందరూ గెలవాలని సత్తుపల్లి కల్లూరు మున్సిపాలిటీలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు పలు సూచనలు,సలహాలు,దిశా నిర్దేశం చేశారు. సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ఎన్నికల తర్వాత మాత్రమే చైర్మన్లను ఎన్నుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనందబాబు, భాగం నీ రజాదేవి ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మున్సిపల్ ఎన్నికల ఆశా వాసులు పాల్గొన్నారు.

## పశువుల సంతలో రైతులకు సరైన సౌకర్యాలు కల్పించాలి



**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి పశువుల సంత నుండి లక్షల్లో ఆదాయం వస్తున్న సరైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతుల నుండి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆదివారం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి పశువుల సంతను సందర్శించి సంతలోన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పశు వుల సంతలో రైతులకు సామాన్య ప్రజలకు అవసరమైన తాగునీరు, నీడ కోసం రేకుల షెడ్లు, జంతువులకు నీటి తొట్టెలు, పశువుల రాంపు, సరైన పారిశుధ్య వసతులను కల్పించాలని సంత కాంట్రాక్టర్ కు సూచించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారికోసం విశ్రాంతి స్థలాలు, పశువుల ఆరోగ్య భద్రత కోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎండ, వానల నుండి పశువులను రక్షించడానికి శాశ్వతమైన రేకుల షెడ్ల నిర్మాణం, రైతులకు విశ్రాంతి తీసుకునే స్థలం పశువులకు, గొర్రెలు, మేకలు తాగేందుకు శుభ్రమైన నీటిని నీటి తొట్టెల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. సంత జరిగిన తర్వాత జంతువుల వ్యర్థాలను తొలగించి సంత ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి సిబ్బందిని కేటాయించాలన్నారు. పశువుల ఆరోగ్య పరీక్షలు, అత్యవసర వైద్య చికిత్స కోసం పశువైద్యాధికారి అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. వాహనాలు రావడానికి సరైన రహదారులు, పార్కింగ్ స్థలం, రాత్రి సమయంలో విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలన్నారు. దళారుల దోపిడీని నిరోధించడానికి మార్కెట్ ఫీజులకు సంబంధించిన బోర్డులను ప్రదర్శించడం పారదర్శకమైన కొనుగోలు విధానం పాటించాలని పశువుల సంత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఇకపై పశువుల సంత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. వారివెంట ఉపసర్పంచ్ కొడిదల పద్మ వెంకటయ్య, సంత కాంట్రాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, రైతులు గ్రామపంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 5న ఢిల్లీలో ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సదానంద గౌడ్



**కోదాడ, ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలు ఏకమై ఉమ్మడి కార్యాచరణతో పోరాడాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సదానంద గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన సూర్యాపేట జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, 398 టీచర్ల అప్రెంటిస్ పీరియడ్ ఇంక్రిమెంట్లను పదవీ విరమణ సమయానికైనా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పీఆర్సీ , హెల్త్ కార్డులు, డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్తో ఫిబ్రవరి 5న దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బంధం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలూరి అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి. సత్యనారాయణ, మాజీ ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు నందిపాటి సైదులు, మరియు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు నరసింహారావు, భిక్షం, పాడె సురేష్, ఖాసిం, శ్రీనివాస్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం

● అభ్యర్థులకు రేపు బీ ఫాంలు అందజేత
● 4న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రచారం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** వేములవాడ పట్టణ ప్రజల ఆకాంక్షే బిజెపి ఎజెండా అని వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి తెలిపారు. వేములవాడలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డివేని గోపి,మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో కలిసి విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ గత మున్సిపల్ పాలకవర్గంతో పాటు రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చార్జిషీటు విడుదల చేయనున్నట్లు చెప్పారు. 28 వార్డులకు సంబంధించి అభ్యర్థులను ఖరారు చేశామని వారికి సోమవారం బి ఫామ్ లు అందజేయనున్నట్లు చెప్పారు. అభ్యర్థులందరూ కుటుంబ సభ్యులతో కలిసి నేడు బీమేశ్వర ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల నాలుగున వేములవాడలో మున్సిపల్ ఎన్నికల మొట్టమొదటి ప్రచారాన్నికి వస్తునరన్నారు. నాంపల్లి నుంచి వేములవాడకు ర్యాలీ ఉంటుందన్నారు. 28 వార్డులను నాలుగు క్లస్టర్గా విభజించి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28 వార్డులో బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ మాట్లాడుతూ వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రాన్ని భక్తులకు దూరం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన విధంగా రాజన్న ఆలయంలోని కోటి లింగాలను దూరం పెట్టారని దర్గా మాత్రం అక్కడే ఉందన్నారు. దర్గాను ముట్టుకోవడానికి ప్రభుత్వం భయపడుతుందన్నారు. ముస్లిం ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయాని పట్టణ ప్రజలు గమనించాలన్నారు. హిందువులు ఒక శక్తిగా ఏర్పడితేనే భారతదేశం మనుగడ కొనసాగుతుందన్నారు. ప్రజలు గతంలో నగర పంచాయతీ, మున్సిపల్ లో బిజెపికి అవకాశమిచ్చారని ప్రస్తుత ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తారని విశ్వాసం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వేములవాడకు వచ్చి రాజన్న ఆలయాన్ని దర్శనం చేసుకున్న అనంతరం ఏ విధంగా ముందుకు వెళ్తుందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ వేములవాడలో మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలతో ఎన్నికల ఇంచార్జి అభ్యర్థుల సమావేశం



నిర్వహించి పలు విషయాలపై చర్చించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భక్తులను వేములవాడ ప్రజలను రాజన్నకు దూరం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం ప్రజలకు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తామన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ప్రజలకు వివరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మున్సిపాలిటీలు నడుస్తున్నాయని, ఓటు అడిగే హక్కు కాంగ్రెస్కు లేదన్నారు. ఈ సమావేశంలో పోటీచేసే అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# బడ్జెట్ వేళ మదుపర్లకు బ్లాక్ సండే

## మరింత దిగువకు బంగారం, వెండి ధరలు

**ముంబయి:** రాకెట్ వేగంతో దూసుకెళ్లిన బంగారం వెండి, ధరలు మళ్లీ దిగి వస్తున్నాయి. దేశీయ కమొడిటీ మార్కెట్‌లో రెండు లోహాల ధరలు ఓ దశలో 9 శాతం మేర క్షీణించాయి. రికార్డు గరిష్ఠాలకు చేరుకున్న వేళ లాభాల స్వీకరణ కొనసాగుతుండడంతో ఆదివారం రెండు లోహాలు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. తర్వాత బంగారం ధర కాస్త కోలుకోగా.. వెండి మాత్రం 9 శాతం నష్టంతో కొనసాగు తోంది.మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఏప్రిల్ కాంట్రాక్ట్ బంగారం ధర ఆదివారం ఉదయం 9 శాతం పతనం అయ్యింది. 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులోనే రూ.13,711 క్షీణించి రూ.1,38,634కు



చేరింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 3.28 శాతం నష్టంతో రూ.1.47 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతకుముందు గురువారం ఒక్కరోజే పసిడి ధర రూ.31,617 (17.2 శాతం) మేర పతనమైంది. దీంతో రూ.1,93,096 నుంచి రూ.1,52,345కు చేరింది.అటు వెండి ధరలోనూ పతనం కొనసాగుతోంది. రికార్డు గరిష్ఠాల వద్ద ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగుతుండడంతో మార్చి కాంట్రాక్ట్ వెండి ధర ఒక్క రోజులోనే రూ.26,273 (9 శాతం) పతనమై రూ.2,65,652కి చేరింది. శుక్రవారం ఒక్కరోజే వెండి కిలో ధర రూ.1,07,968 క్షీణించి రూ.2,91,925కి చేరిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు, బడ్జెట్ వేళ మదుపర్ల అప్రమత్తత వల్ల బంగారం, వెండి ధరలు పతనానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. ఆదివారం కావడంతో ప్రపంచ ఫ్యూచర్ మార్కెట్లు నేడు పనిచేయడం లేదు.

## సెన్సెక్స్ 1,546.. నిఫ్టీ 495 పాయింట్లు డౌన్

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడంతో పాటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌నుపెంచడం మార్కెట్లను కుదిపేసింది. ఒక దశలో సెన్సెక్స్ 2000 పాయింట్లపైగా పతనమైంది చివరకు సెన్సెక్స్ 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 495 పాయింట్లు నష్టపోయి 24,119 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ పనిచేసిన మార్కెట్లు.. మదుపర్లకు నష్టాలను మిగిల్చాయి. బడ్జెట్ ప్రవేశపెట్ట డానికి ముందు ఫ్లాట్‌గా ట్రేడయిన సూచీలు.. ఎస్‌టీటీ ప్రస్తావన తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి ఉండే సెక్యూరిటీలను కొనుగోలు, అమ్మకాలు చేసేటపుడు వర్తించే పన్ను ఎస్‌టీటీ. దీనిని బడ్జెట్‌లో 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచారు. ఇక, ఆప్షన్స్ ప్రీమియంపై ఎస్‌టీటీని 0.15 శాతానికి పెంచారు. ఆ బైబ్యాక్స్‌ను మూలధన లాభాలుగా పరిగణిస్తూ పన్ను విధించారు. అక్రమ వినియోగానికి చెక్ పెట్టే ఉద్దేశంతో బైబ్యాక్ పన్నుల్లో మార్పును నిర్మలమ్మ ప్రతిపాదించారు. కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌లపై 22 శాతం, నాన్ కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌పై 30 శాతం పన్నులు విధించారు. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను భారీగా దెబ్బతీసింది.

బ్రోకరేజీ స్టాక్స్ ధమాల్





సెక్యూరిటీస్ ట్రాన్జాక్షన్ ట్యాక్స్‌ను పెంచుతున్నట్లు ప్రకటించడంతో బ్రోకరేజీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఉన్న ట్యాక్స్‌ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో 18 శాతం వరకు ఆయా కంపెనీల షేర్లు పతనం అయ్యాయి. బీఎస్ఈలో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఓఅచీ) షేర్లు 18.08 శాతం పతనమై రూ.2,068కి చేరింది. గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ షేర్లు 13 శాతం పతనమై రూ.154కి చేరాయి. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం క్షీణించి రూ.296.10కి చేరింది. యాంజెల్ వన్ స్టాక్ కూడా 11.84 శాతం నష్టపోయి 2,237.95, ఆనంద్ రాఠీ అండ్ స్టాక్ బ్రోకర్స్ 8.5 శాతం క్షీణించి రూ.532.15కి చేరింది. ఆఖరికి బీఎస్ఈ లిమిటెడ్ షేరు విలువ కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. ఎన్ఎస్ఈలో దీని విలువ 15 శాతం కోల్పోయి రూ.2,377కు చేరింది.నిఫ్టీ సూచీలో మ్యాక్స్ హెల్త్‌కేర్, విప్రో, టీసీఎస్, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగియగా.. హిందాల్కో, ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి.

## రూ.28.33 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ:**డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంట ర్ఫేస్ (యూపీఐ) చెల్లింపులు సరికొత్త రికార్డులను నెలకొ ల్పింది. ఈ నెలలో కొనుగోళ్ల చెల్లింపుల లావాదేవీలు అధికంగా యూపీఐ పద్ధతిలో జరగడంతో వీటి సంఖ్య, విలువ భారీగా పెరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది.జనవరిలో యూపీఐ ద్వారా 28.33 మిలియన్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి సగటు విలువ 21.7 బిలియన్లుగా ఉందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలిపింది. జనవరిలో సగటు రోజువారీ 700 మిలియన్ల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో రోజూవారీ లావాదేవీల సంఖ్య 698 మిలియన్లుగా నమోదవ్వగా.. వాటి విలువ రూ. 27.97 లక్షల కోట్లుగా ఉందని ఎన్‌పీసీఐ పేర్కొంది. ఈ విధంగా చూస్తే ప్రస్తుతం లావాదేవీల విలువ 21 శాతం వృద్ధి చెందింది. వరల్డ్ లైన్ సీఈఓ రమేశ్ నరసింహన్ మాట్లాడుతూ.. యూపీఐ వృద్ధి వేగం కొనసాగుతోందన్నారు.




## బడ్జెట్‌లో 'కంటైనర్' కథ ఇంతుందా..?




**న్యూఢిల్లీ:**భారత్ కంటైనర్ల తయారీని పెంచడానికి కేంద్రం ఏకంగా రానున్న ఐదేళ్లలో రూ.10,000 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. తొలి సారి ప్రభుత్వం ఈ రంగంపై దృష్టిపెట్టి చర్యలు చేపట్టినట్లైంది. ఓడల మీద ఎక్కించే ఈ డబ్బాల తయారీకి ఎందుకంత సొమ్ము అని సామాన్యుడు ఆలోచిస్తాడు. పైకి చిన్న విషయంలా అనిపించే దీనిలో లోతైన భౌగోళిక రాజకీయవ్యూహాలున్నాయి. కంటైనర్లు అందుబాటులో తేడా వస్తే.. విదేశీ వాణిజ్యమే కుదేలైపోతుంది. పైగా మన పొరుగుదేశమైన చైనాకు వీటి తయారీలో ఏకఛత్రాదిపత్యం ఉంది. అమెరికానే కంటైనర్ల విషయంలో ఇబ్బంది పెట్టిందంటే.. ఇక భారత్‌ను వదులుతుందన్న నమ్మకంలేదు. భారత్ తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో.. కీలకమైన సరకు రవాణాకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిందే. భారత్ విదేశీ వాణిజ్యానికి నౌకాయానం అత్యంత కీలకం. పరిమాణ పరంగా 95శాతం.. విలువ పరంగా 70శాతం వర్తకానికి నౌకాయానమే జీవనాడి. 12కు పైగా మెగా.. 200కుపైగా చిన్న పోర్టుల నుంచి సరకు రవాణా జరుగుతోంది. సరకు కంటైనర్ల కొరత ఏర్పడితే ఇక్కడి రవాణా స్తంభించిపోతుంది. ఇక వీటి తయారీలో 95శాతం వాటా చైనాదే. ఆ దేశానికి సీఐఎంసీ (చైనా ఇంటర్నేషనల్ మెరైన్ కంటైనర్ గ్రూప్ కార్పొరేషన్) తన 11 ఫ్యాక్టరీల్లో ఏటా 20 లక్షల కంటైనర్లను తయారు చేస్తోంది. ఇక సీవోఎస్‌సీవో గ్రూప్ అనుబంధ సంస్థ డాంగ్‌ఫెంగ్ ఇంటర్నేషనల్ కంటైనర్ గ్రూప్ షాంఘై కేంద్రంగా పనిచేస్తోంది. ఇది ఏటా 18 లక్షల కంటైనర్లు తయారు చేస్తోంది. డ్రై, రిఫ్రిజిరేటింగ్ దీని స్పెషలైజేషన్. ఇక మూడో స్థానంలోని సీఎక్స్ఐసీ గ్రూప్ భారీ సంఖ్యలో డ్రై కార్గో కంటైనర్లను ఉత్పత్తి చేస్తోంది. సింగమస్ కంటైనర్ సంస్థ కూడా చైనా కేంద్రంగా పనిచేసేదే. చైనా సామర్థ్యం ఏటా 50 లక్షల యూనిట్లకు పైమాటే అంటే ప్రపంచ మార్కెట్‌ను ఎలా శాసిస్తోందో అర్థం చేసుకోవచ్చు..!

**వాణిజ్యంపై ప్రభావం ఇలా..**

భారత్ ఏటా కేవలం 30,000 యూనిట్లను మాత్రమే తయారు చేయగలదు. ఇవి దేశ అవసరాలకు ఏమాత్రం సరిపోవు. ఇక కొవిడ్ తర్వాత కంటైనర్ ధరల్లో భారీగా పెరుగుదల కనిపించింది. 2022లో కొవిడ్ ప్రభావంతో సగటు ధర 4,942 డాలర్లు కాగా.. 2024లో అది 4,775 డాలర్ల వద్ద స్థిరపడింది. కానీ, కొవిడ్‌కు ముందు 2019లో వీటిధరలు కేవలం 1,420 డాలర్లే అని గతంలో జీటీఆర్ఐ నివేదిక వెల్లడించింది. వీటి ధరల పెరుగుదలతో.. ప్రపంచ మార్కెట్లో భారత వస్తువులు ఖరీదైనవిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఇక చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం గతేడాది తీవ్ర స్థాయిలో ఉన్న వేళ చైనావద్ద పెద్ద సంఖ్యలో కంటైనర్లు పేరుకుపోయాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా వాటి ధరలు 30శాతం పెరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో భారత్ కంటైనర్ల తయారీపై దృష్టిపెట్టాలన్న డిమాండ్లు వ్యక్తమయ్యాయి.

**కీలక సంస్థలు వీటి తయారీపై దృష్టి..**

భారత్‌లోని టాటా స్టీల్, జిందాల్ స్టీల్ వంటి సంస్థలు వీటి తయారీపై ఇప్పటికే దృష్టిపెట్టాయి. తాజాగా వీటి తయారీకి ప్రభుత్వం కూడా కేటాయింపులు చేయడంతో తయారీ పెరగనుంది.గతేడాది షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అండతో ది భారత్ కంటైనర్ లైన్ (బీసీఎస్ఎల్)ను ప్రారంభించారు. అదే సమయంలో బడ్జెట్‌లో కేంద్రం వీటి తయారీకి రూ.10,000 కోట్లు కేటాయించడం విశేషం.

# దేశ ప్రగతికి బాటలు

## నిర్మలమ్మ చెప్పిన మూడు కర్తవ్యాలు..

**న్యూఢిల్లీ:**2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్ ఇదంటూ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థితర ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు.

ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతకను వేగవంతం చేయడం

పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం.

**ప్రత్యేక కార్యాచరణ:**మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతందీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం నగర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి వీటికి అనుబంధంగా బడ్జెట్‌లో మరికొన్ని ప్రతిపాదనలనూ, ఆర్థిక మంత్రి చేశారు. అవి..



హైటెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం

మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో

**ప్రత్యేక కార్యక్రమం:**టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేల కోట్లు

జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల స్థాపన

**రెండో కర్తవ్యం..**

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు.

ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు

**ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు**

ఆయుష్ కేంద్రాల అప్‌గ్రెడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు

ప్రైవేటు రంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం

యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత

నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు

ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి

**మూడో కర్తవ్యం..:**సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

**దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన**

మానసిక వ్యాధుల చికిత్సకు ఔఓఓఉంబొ-2. రాంచీ, తేజ్‌పూర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ అప్‌గ్రెడేషన్

భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం

తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్‌ల అందించటం

అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి

మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్‌గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.



## ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్

### భారీగా పెరిగిన రక్షణ బడ్జెట్

**న్యూఢిల్లీ:**భారత్‌కు ఓ వైపు పాక్.. మరో వైపు చైనా, బంగ్లాదేశ్‌తో తీవ్ర విభేదాలు కొనసాగుతున్న వేళ రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్ పెరిగింది. ఆపరేషన్ సిందూర్‌తో అత్యాధునిక యుద్ధతంత్రం అవసరాలను భారత్ గుర్తించింది. దీనికి తగ్గట్లే కేటాయింపులను చేసింది. గతేడాది అన్నింటికి కలుపుకొని.. రూ.6.81లక్షల కోట్లు కేటాయించగా.. ఈ సారి అది రూ.7.85 కోట్లకు చేరుకొంది. ఈ సారి మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో తమకు 14.68శాతం లభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసి 21.84 శాతం కేటాయింపులను పెంచారు. గతేడాది కేవలం 1.8లక్షల కోట్లనే కేటాయించగా.. ఈ సారి దానిని రూ. 2.19 లక్షల కోట్లకు చేర్చారు. ఈ బడ్జెట్‌లో మన వాయుసేన యుద్ధ విమానాల అవసరాలకు పెద్దమొత్తాన్ని ఇచ్చారు. విమాన ఇంజిన్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం రూ.63,733 కోట్లు కేటాయించడం విశేషం. దళాల రోజువారీ కార్యకలాపాలు, వేతనాలు, ఇంధనం, రేషన్, ఆయుధాల నిర్వహణ, మందుగుండు వంటి వాటి కేటాయింపులను 17.24శాతం పెంచారు. దీంతో దళాల రోజువారీ కార్యకలాపాలు మరింత శక్తిమంతంగా మారనున్నాయి. ఇక పింఛన్ల కోసం కేటాయింపును 6.53శాతం పెంచి రూ.1.71 లక్షల కోట్లకు చేర్చారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై నిత్యం పోరాడే రాష్ట్రీయ రైఫిల్స్‌కు కూడా నిధులను పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే అత్యధికంగా రూ.255 కోట్లు కేటాయించారు. గతేడాది రూ.222 కోట్లు మాత్రమే ఇచ్చారు. రక్షణ రంగంలో రహస్యమైనవిగా భావించే స్పెషల్ ప్రాజెక్టులకు కూడా రూ.1989.12 కోట్లు కేటాయించారు. ఇక ఎయిర్ ఫోర్స్ ప్రాజెక్టులకు కేటాయింపులు స్వల్పంగా తగ్గి రూ.1,618 కోట్లుగా నిలిచింది.

రక్షణ మంత్రి ఏమన్నారంటే..?

తాజాగా బడ్జెట్‌పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. "ఆపరేషన్ సిందూర్‌లో చారిత్రక విజయం తర్వాత భవిష్యత్తులో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం. భద్రత, అభివృద్ధి, ఆత్మనిర్భర్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఈ బడ్జెట్‌ను సిద్ధం చేశారు" అని అన్నారు.

## ఈయూ మిలిటరీపై ఇరాన్ 'ఉగ్ర'ముద్ర!



టెహ్రాన్:ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఐరోపా దేశాలకు చెందిన మిలిటరీని ఉగ్రవాద గ్రూపులుగా పరిగణించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖాలీబాఫ్ తెలిపారు. ఇటీవల ఆ దేశ సైన్యంలో కీలక విభాగమైన 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)'ను ఈయూ ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికాను నమ్మి తమ సొంత ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈయూ నిర్ణయాలు తీసుకుంటోందని ఖాలీబాఫ్ విమర్శించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా చట్టసభ సభ్యులు నినాదాలు చేశారు.

## అందమైన రాతలో అతిపెద్ద ఖురాన్!


ఇస్తాంబుల్: ఇరాకీ నగిషీ రాత నిపుణుడు అలీ జమాన్ (54) ప్రపంచంలో అతి పెద్ద ఖురాన్ ప్రతిని స్వదస్తూరీలో వెలువరించారు. అయితే ఆయన రూపొందించిన ఖురాన్ ప్రపంచంలో అతిపెద్దదని అధికారిక గుర్తింపు ఇంకా అందాల్సి ఉంది. ప్రపంచంలో అతిపెద్ద ముద్రిత ఖురాన్ ప్రతిని నిరుడు మార్చిలో సౌదీ అరేబియాకు చెందిన మక్కాలోని హోలీ ఖురాన్ మ్యూజియం ప్రచురించినట్లు గిన్నిస్ ప్రపంచ రికార్డులలో నమోదైంది. జమాన్ వెలువరించిన ఖురాన్ అందుకు భిన్నంగా చేతి రాతతో సిద్ధమైంది. ఇస్తాంబుల్‌లోని మిహిరిమా సుల్తాన్ మసీదులోని గదిలో జమాన్ ఆరేళ్లపాటు శ్రమించి నగిషీ రాతలో ఖురాన్ ప్రతిని రాశారు. అందులో రెండు వైపులా రాసిన మొత్తం 302 పుటలు ఉన్నాయి. ఒక్కో పుట 13 అడుగుల పొడవు, 4 అడుగుల 11 అంగుళాల వెడల్పు కలిగి ఉంది. ఈ పుటల తయారీకి పటిక, కోడి గుడ్ల సొన, మొక్కజొన్న పిండి మిశ్రమాన్ని వినియోగించారు. నగిషీ రాతతో కూడుకున్న ఖురాన్ ప్రతులకు తుర్కియేలో ఓటోమాన్ పాలనా కాలం నుంచీ ఎంతో ఆదరణ లభిస్తోంది. తన కృతిని నగిషీ రాతకు పట్టంకట్టే దేశంలో కానీ, మ్యూజియంలో కానీ, మరేదైనా గొప్ప స్థలంలో కానీ అందరికోసం అందుబాటులో ఉంచాలని ఆశిస్తున్నట్టు అలీ జమాన్ తెలిపారు. ఈ పని చేయగల దాత కోసం ఎదురుచూస్తున్నారు.



## యే రోటీ.. యేతో ఆలూ గోబీ హై..

### మాట రాని అమ్మానాన్నల క్లౌడ్ కిచన్‌కు బుల్లి ప్రచారకర్త

పంజాబ్‌లోని మొహాలీలో వంశ్‌ప్రీత్‌సింగ్, అన్మోల్‌కౌర్ దంపతులు ప్రారంభించిన క్లౌడ్ కిచన్‌కు నిండా పదేళ్లు లేని వారి కుమారుడు సుఖ్మెహర్ ప్రచారకర్తగా సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకొంటున్నాడు. దంపతులిద్దరూ చెవిటి, మూగవారు. వీడియోల్లో వీరిద్దరి గొంతుకగా మారి "యే రోటీ.. యేతో ఆలూ గోబీ హై" అంటూ ముద్దుముద్దు మాటలతో వంటకాలను పరిచయం చేస్తున్నాడు సుఖ్మెహర్. వీరి ఇన్‌స్టాగ్రాం ఖాతాలో అతి తక్కువ కాలంలోనే 21,600 మంది ఫాలోవర్లుగా చేరారు. వంశ్‌ప్రీత్ తమ క్లౌడ్ కిచన్‌కు ఆలోచనాత్మకంగా పెట్టిన 'క్వైట్లీ డెలిషియస్' అనే పేరుకు, వీరి వంటలకు ఇంటర్నెట్‌లో చక్కటి ఆదరణ లభిస్తోంది.



## వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ ముందుకొచ్చింది



తాత్కాలిక నాయకురాలిగా కొనసాగు తారని తెలిపారు. వెనెజువెలాపై సైనిక దాడి చేసి.. ఆ దేశ నేత నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. భారత ప్రధాని మోదీ - రోడ్రిగ్జ్‌లు ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులతో సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించుకున్నారు.

# రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు

- ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్ తో కలిసి ముఖాముఖి నిర్వహించిన "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి
- వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఆదివారం రోజు ఉదయం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ముఖాముఖి నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి గణనీయంగా జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వారు గుర్తు చేశారు. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, సన్న బియ్యం, రైతులకు రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్ళు, రుణమాఫీ, అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇలాగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పయనింప చేస్తున్నందుకు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని, అన్ని డివిజన్లో ఘన విజయం సాధించడానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తున్నదని వారు తెలిపారు. తెలంగాణలో అనేక పెట్టుబడులు తీసుకురావడం అదేవిధంగా విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు వసతులు కల్పించడం చాలా హర్షించదగ్గ విషయమని ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నది హార్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తూ.. అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు వాకర్స్ ని కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ప్రోత్సాహపరచాలని విన్నవించారు. కరీంనగర్ లో కాంగ్రెస్ విజయం తథ్యమని, తెలంగాణ రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో అఖండ విజయం నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, వీఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్

- రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ సీఎం
- కేసీఆర్‌ను వేధించడం కాంగ్రెస్ కుట్ర
- దండుపాళ్యం బ్యాచ్‌లా మారిన మంత్రివర్గం
- త్వరలో రేవంత్, సృజన్ రెడ్డి కుంభకోణాల చిట్టా విప్పుతాం



**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 1 జనంసాక్షి :** తెలంగాణను సాధించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన జాతిపిత కేసీఆర్‌ను సిట్ విచారణ పేరుతో వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన, బైక్ ర్యాలీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.
రేవంత్ రెడ్డి పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యారని, ఆయన ఒక ఫెయిల్యూర్ సీఎంగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు రూ.2500, రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, విద్యార్థులకు విద్యా భరోసా, స్కూటీలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా భృతి, కల్యాణలక్ష్మి, పెన్షన్ పెంపు -- ఏ హామీనీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకే కాళేశ్వరం, విద్యుత్ కమిషన్లు, ఫార్ములా-ఈ, డ్రగ్స్, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులతో బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ పోలీసు పరిధి అంశమని, దానికి హోం సెక్రటరీ అనుమతులు ఇస్తారని, సీఎం లేదా మంత్రులకు సమాచారం మాత్రమే అందుతుందని స్పష్టం చేశారు. దమ్ముంటే ఆనాటి ఐజీ, డీజీపీ, హోం సెక్రటరీలను విచారించాలని సవాల్ విసిరారు.
రేవంత్ మంత్రివర్గం దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని, సివిల్ సప్లైస్, మద్యం, బొగ్గు, సోలార్ పవర్ దోపిడీలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి గోడలకు నోటీసులు అంటించడం రేవంత్ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. త్వరలో రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది సృజన్‌రెడ్డి కుంభకోణాల చిట్టా సాక్ష్యాలతో బయటపెడతామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకత్వాన్ని దెబ్బతీయడానికి పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. శాంతియుత నిరసనలకు అరెస్టులు సరికాదని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో గులాబీ సైన్యం కదం తొక్కిందని, రేవంత్ పాలనకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన ఉద్యమిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో పోలీసులపై దాడి..!

- బీఆర్ఎస్ ఆందోళనలో ఘటన
- సీఐ ఎడమచేతికి గాయం




**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఆందోళనలో కొందరు రౌడీయిజం ప్రదర్శించారు. ఆ పార్టీ అగ్రనేతల దృష్టిలో పడాలన్న ఉద్దేశమో.. మళ్లీ టికెట్లు పొందాలన్న ఆశనో తెలియదుగానీ ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ శ్రేణులు కేవలం నోటు, ఓటు రాజకీయాలు మాత్రమే చేస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం చేపట్టిన ఆందోళనలో బీఆర్ఎస్ ముసుగులో కొందరు రౌడీమూకలు పోలీసులపై దాడికి దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దనే నిబంధనలు బేఖాతరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో అక్కడ ఉన్న కొందరు పోలీసులపై ఉద్దేశపూర్వకంగా దాడికి దిగారు. బందోబస్తు విధుల్లో ఉన్న ఖమ్మం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ విధులకు ఆటంకం కలిగించి, గాయపరిచారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా.. పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంక పరిచి, వారిని గాయాల పాలుచేసినవారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, గంజాయి బ్యాచ్ నుంచి ఖమ్మం నగరాన్ని కాపాడాలని ప్రజలు ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

## రెసోనెన్స్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్



**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ వృత్తిపరమైన అవకాశాలపై అవగాహన కల్పించేందుకు రెసోనెన్స్ జూనియర్ కళాశాలలు నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో 'కెరీర్ క్లారిటీ కాన్క్లేవ్ ఎక్స్పో – 2026' నిర్వహించాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ఐదు ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేశారు. ప్రముఖ విద్యా సంస్థల నిపుణులు, పరిశ్ర మల ప్రతినిధులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించారు. కెరీర్ మార్గాలు – భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన సరైన వృత్తి మార్గాలు, కోర్సుల ఎంపిక – ఇంజనీరింగ్, మెడిసిన్, సైన్స్, టెక్నాలజీ, ఇతర అనుబంధ రంగాలలో కోర్సుల ప్రాధాన్యత, పోటీ పరీక్షలు – వివిధ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విధానం,అడ్మిషన్ల అవగాహన – ప్రీమియర్ విద్యాసంస్థల్లో ప్రవేశ ప్రక్రియలపై మాట్లాడారు. ప్రతి సెషన్లో ఒక ప్రధాన వక్త, ఇద్దరు ప్యానెల్ సభ్యులు వాస్తవ పరిస్థితిపై స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఐఐటీ డీన్ రమేష్ లోగనాథన్ మాట్లాడుతూ అభిరుచి, ప్రాథమిక అంశాల పట్ల ఉన్న అవగాహన ఆధారంగా కంప్యూటర్ సైన్సు ఎంచుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. గీతం యూనివర్సిటీ కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రామ శాస్త్రి వేదుల మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక సూత్రాలు అభ్యసించాలన్నారు. కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నా రు. నెక్స్ట్వేవ్ కో-ఫౌండర్, సీఈఓ రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ భవిష్యత్తులో కెరీర్ నైపుణ్యాలకే ప్రాధాన్యత ఇస్తాయన్నారు. నిరంతరం అభ్యసన తప్పనిసరి అన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సామర్థ్యాల ను మెరుగుపర్చుకోవాలన్నారు. యశోద హాస్పిటల్స్ డాక్టర్ బీ బాలరాజు మాట్లాడుతూ ఎంబీబీఎస్ దీర్ఘకాలిక నిబద్ధతతో కూడుకున్నదన్నారు. విద్యార్థులు బాధ్యతలు, వైద్య రంగానికి మించి ఉండే విభిన్న అవకాశాలను ముందుగా అర్థం చేసుకోవాలన్నారు. ఐసీఎఫ్ఏఐ డైరెక్టర్ సుధాకర్ రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడిసిన్ కాకుండా ఇతర వృత్తిపరమైన అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. సరైన కెరీర్ను ఎంచుకోవడం, స్పష్టత, కమ్యూనికేషన్ స్కిల్స్పైనే విజయం ఆధారపడి ఉంటుందన్నారు. రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ తెలంగాణ, ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆశయాలకు, వాస్తవ ప్రపంచంలో ఉన్న అవకాశాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకే ఈ 'కెరీర్ క్లారిటీ కాన్క్లేవ్ ఎక్స్ పో- 2026'ను రూపొందించామన్నారు.



# ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి,ఫిబ్రవరి 01(జనంసాక్షి) :** కలెక్టరేట్లో సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు, పురపాలక ఎన్నికల అనంతరం ప్రజావాణి నిర్వహణపై మరోసారి పత్రిక ప్రకటన విడుదల చేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజాభీష్టం మేరకు నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్నా




- పెద్దపల్లి మున్సిపల్ 33 వార్డులకు అభ్యర్థుల ప్రకటన
- రూ.77.50 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు
- అధికార పార్టీ అభ్యర్థులే గెలిస్తే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే విజయ రమణారావు పిలుపు

**పెద్దపల్లి, ఫిబ్రవరి 1(జనంసాక్షి) :** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 33 వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించారు. పూరేళ్ళ శైలజ (1 వార్డు), లక్ష్మి పస్తం (2), మొలగూరి కమల్ (3), కొమ్ము సుధాకర్ (4), గుజ్జుల కుమారస్వామి (5), కట్ట పద్మావతి (6), ఈర్ల స్వరూప (7), ఎరుకల కల్పన (8), అక్కెపల్లి సుజాత (10), అనూష పూదరి (11), దొడ్డుపల్లి జగదీష్ (12), పాగల శ్రీకాంత్ (13), మహమ్మద్ అస్లాశీ పర్వేజ్ (14), నేతెట్ల కొమురయ్య (15), నంసాని శ్రీనివాస్ (16), తోట ఫణీందర్ (17), భూతగడ్డ సంపత్ (18), నల్లాల పద్మ (19), బండి రమ్యకృష్ణ (20), నుగిళ్ళ మల్లయ్య (21), ఉప్పు స్వరూప (22), తాడూరి శ్రీమన్నారాయణ (23), కొట్టే స్వరూప (24), సూది మల్ల అమ్రేష్ (26), ఉనుకొండ సరస్వతి (27), తూముల లత (28), ఇల్లందుల రజని (29), సాజిదాబాను (30), మంథని నర్సింగ్ (31), తిర్రీ శ్రీలత (32), బూతగడ్డ స్వప్న (33), దేవనంది రమాదేవి (35), ముస్కాన్ నాజ్ (36).
క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో రూ.40 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. పట్టణ దాహార్తి తీర్చేందుకు ఆర్డీఓ ఆవరణలో కొత్త వాటర్ ట్యాంక్, చందపల్లి డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో మరో ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.
రూ.62.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మరో రూ.15 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. మొత్తం రూ.77.50 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆధునీకరణకు రూ.7.5 కోట్లు, వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియానికి రూ.2.5 కోట్లు కేటాయించామని తెలిపారు.
రూ.80 కోట్లతో బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తి చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని.. మరో రూ.70 కోట్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు విస్తరించి ఏంఆర్ఐ, సీటీ స్కాన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బస్ డిపోకు 4 ఎకరాల 32 గుంటలు కేటాయించి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని.. రాఘవాపూర్‌కు 10 ఎకరాలు కేటాయించి రూ.80 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.అధికార పార్టీ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని.. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# రహదారిపైనే ఇసుక లారీల పార్కింగ్

- అడ్డుకున్న గ్రామస్థులు
- పట్టించుకోని ఆర్టీఏ అధికారులు

**వీణవంక ఫిబ్రవరి 1(జనం సాక్షి) :** వీణవంక మండలంలోని కొండపాక, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు ఇసుక రీచ్‌ల నుంచి వెళ్లే లారీలు రెడ్డిపల్లి గ్రామం ద్వారా పోవాల్సి ఉంటుంది. ఇటీవల మేడారం జాతర సందర్భంగా సుమారు వంద లారీలు రెడ్డిపల్లి నుంచి హిమ్మత్‌నగర్ క్రాస్‌రోడ్ వరకు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. కరీంనగర్, జమ్మికుంట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగ్రహించిన రెడ్డిపల్లి గ్రామస్థులు రోడ్డుపై ఇసుక లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఇసుక రీచ్ కాంట్రాక్టర్లు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకుండా రోడ్డుపై లారీలు నిలిపిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ రీచ్ యజమానులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా శాఖ, సంబంధిత అధికారులు మామూళ్ల కోసం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రీచ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



## గోదావరిఖని మినీ మేడారం జాతర

# హుండీ ఆదాయం రూ.57.74 లక్షలు

**హుండీల్లో రూ.31.26 లక్షలు.. వేలం, టికెట్ల ద్వారా రూ.26.48 లక్షలు**

**80 మంది మహిళలతో ప్రశాంతంగా లెక్కింపు**

**గోదావరిఖని, ఫిబ్రవరి 1(జనంసాక్షి) :** గోదావరిఖని మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఆదాయం రూ.57,74,884కు చేరింది. గత జాతర కంటే ఈసారి రూ.8,86,195 ఎక్కువగా వచ్చింది. హుండీల ద్వారా రూ.31,26,324, వేలం ద్వారా రూ.19,89,000, టికెట్ల ద్వారా రూ.6,59,560 వచ్చాయి. బంగారం 2 గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 798 గ్రాములు లభించాయి.
శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ మమతారెడ్డి ఆధ్వర్యంలో 80 మంది సేవాసమితి మహిళలు, గోదావరిఖని నుంచి వచ్చిన మహిళా సేవకురాలు లెక్కింపులో పాల్గొన్నారు. జాతర పూజా కమిటీ సీనియర్ సభ్యులు గుండబోయిన వెంకన్న కొబ్బరికాయ కొట్టి లెక్కింపు ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీ నాయిని సుప్రియ, రామగుండం డిప్యూటీ తహసీల్దార్ బి. లక్ష్మి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణ, జాతర కమిటీ చైర్మన్ పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, కే. మోహన్ రెడ్డి, బంగారు రాజయ్య, జగన్, పైన కనకయ్య, పూజా కమిటీ రాజయ్య, గుండబోయిన వెంకన్న, ఏ. మల్లేష్, ముదారి నగేష్, మురారి రామచందర్, సంతోష్, రామ్మూర్తి, భూమయ్య, నర్సింగరావు, వీఆర్వో పెల్లి రాయలింగం, వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై మనోహర్, హెడ్ కానిస్టేబుల్ సగయ్య, వెంకటలక్ష్మి, జయ, మహేష్‌లతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా లెక్కింపు కార్యక్రమం ముగిసింది.

# కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

## వైశాలి రాజుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి



- ఆర్‌బీఎల్‌ఓ సీఈఓ బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి పిలుపు
- 26వ వార్డులో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు పట్టణంలోని 26వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి ఎన్. వైశాలి రాజుగౌడ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆర్‌బీఎల్‌ఓ సీఈఓ బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వార్డులోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వార్డు అభివృద్ధి చెందాలంటే, ప్రజా సమస్యలు పరిష్కారమవాలంటే సేవా దృక్పథం కలిగిన వైశాలి రాజుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి కోరారు. వార్డు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు పెద్దలు,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.



- బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి జోరుగా ప్రచారం
- 23, 36 వార్డుల్లో ఇంటింటా పర్యటన
- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**తాండూరు, ఫిబ్రవరి 1(జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు పట్టణంలోని 23, 36 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జోరుగా ప్రచారం నిర్వహించింది. ఆర్‌బీఎల్‌ఓ సీఈఓ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆయా వార్డుల్లో పర్యటించి అభ్యర్థుల తరపున ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. 23వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి దొరశెట్టి సత్యమూర్తి, 36వ వార్డు అభ్యర్థి కల్వ సిరి చందనకు మద్దతుగా శ్రీనివాస్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వార్డుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, కౌన్సిలర్ అభ్యర్థులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. హస్తం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎం నిర్ణయంతో "హరి"నారాయణ

# ఆశలపై నీళ్లేనా?

**నారాయణపేట జిల్లా బ్యూరో ఫిబ్రవరి 1(జనం సాక్షి):**
మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల తరువాతే చైర్మన్లను ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులను ఆదేశించడంతో నారాయణపేట మున్సిపల్ చైర్మన్ గా ప్రకటించబడిన సరిత బట్టాడ్ డైలమాలో పడ్డారని తెలుస్తోంది. అంతకు మించి నామినేషన్లకు ముందే మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టడ్ సతీమణి సరిత బట్టాడ్ ను పార్టీ ఇంఛార్జి మాజీ డిసిసి అధ్యక్షుడు కే.శివకుమార్ రెడ్డి చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు. 16 వవార్డు నుంచి నామినేషన్ దాఖలు చేశారు.అయితే సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయంతో అయోమయానికి గురవుతున్నారు. ప్రకటించిన శివకుమార్ రెడ్డి, ఇటు హరి నారాయణ బట్టడ్ ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి అయిందని పార్టీ వర్గాలు గుసగుసలాడు కొంటున్నారు. సీఎం నిర్ణయానికి ముందే చైర్మెన్ అభ్యర్థిని ప్రకటించడంతో ప్రకటించిన శివకుమార్ రెడ్డి సంజాయిషీ చెప్పుకునే పరిస్థితి నెలకొందని పార్టీ వర్గాలు అంటున్నాయి.కాగా హరి నారాయణ బట్టడ్ తన సతీమణి సరిత బట్టాడ్ ను చైర్మన్ గా ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ధారాళంగా డబ్బులు కురిపించినట్లు చెబుతున్నారు. ఇంత ఖర్చు చేసినా.. సిఎం ప్రకటనతో తన సతీమణి సరిత బట్టాడ్ కు చైర్మన్ పదవి దక్కుతుందా అన్న అనుమానాలు హరి నారాయణ బట్టడ్ చుట్టూ అలుముకున్నాయని అంటున్నారు. ఇదిలా ఉంటే చైర్మన్ పదవిని ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఈ కాంగ్రెస్ పరిస్థితి చివరకు ఇక్కడి వరకు పోతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ముత్తారంలో కేసీఆర్ అక్రమ అరెస్టుకు నిరసన



**ముత్తారం ఫిబ్రవరి 01(జనంసాక్షి) :** ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమ అరెస్టుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం ముత్తారం మండల కేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ పై సిట్ విచారణ జరపడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.సిట్ విచారణ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని ఆరోపించారు.రైతు రుణమాఫీ రైతు భరోసా పథకాలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు అంతేకాకుండా దళితులకు దళిత బంధు ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు వితంతువులకు దివ్యాంగులకు ఫించన్ డబ్బులు పెంచకుండా కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇవ్వకుండా అనేక రకాల తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా సిట్ విచారణ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీస్ శాఖ అధికారులు అడ్డుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి,మాజీ వైస్ ఎంపీపీ ముత్తారం సర్పంచ్ సుధాటి రవీందర్ రావు, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్,సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ పోతిపెద్ధి రమణారెడ్డి,నాయకులు తిత్తుల శ్రీనివాస్, తాత బాలు, చెల్కల కిషన్, పుల్లూరి బాపు, భూపెల్లి మొగిలి, పప్పు చంద్రమౌళి, దుబాసి శ్రీను, ఊట్ల శ్రీనివాస్, నారెడ్ల రమేష్, కూరాకుల ఓదెలు, సల్ల సమ్మయ్య,తోపాటు తదితరులు పాల్గొన్నారు

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

- ఆపరేషన్ స్మైల్ 12లో 50 మంది బాల కార్మికుల విముక్తి
- జిల్లావ్యాప్తంగా 21 కేసుల నమోదు
- 46 బాలురు, 4 బాలికలను రక్షించిన యంత్రాంగం
- వీరిలో 14 మంది బయటి రాష్ట్రాల బాలబాలికలను రక్షించిన ఆపరేషన్ స్మైల్ బృందం
- విజయవంతం జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర వెల్లడి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 1 (జనం సాక్షి) :**
బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా 2026 జనవరి 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం 'ఆపరేషన్ స్మైల్ 12' అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన, వదిలివేయబడిన లేదా కార్మికులుగా పనిచేస్తున్న బాలబాలికల ను గుర్తించి వారికి రక్షణ కల్పించడం, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, తల్లిదండ్రులు ఉన్న పిల్లలను కౌన్సెలింగ్ అనంతరం కుటుంబాలకు అప్పగించడం లేదా తల్లిదండ్రులు లేని పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సంరక్షణకు అప్పగించడమేనని ఎస్పీ వివరించారు.
సరైన విద్య, పోషకాహారం, క్రీడలు, సామాజిక అభివృద్ధి లేకుండా పిల్లలు సమగ్రంగా ఎదగలేరని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థకు పేదరికం, నిరక్షరాస్యత, తక్కువ ఆదాయం ప్రధాన కారణాలని, అయితే చిన్నారులను పనుల్లోకి నెట్టడం వారి జీవితాలను ప్రమాదంలోకి నెట్టడమేనని స్పష్టం చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులే దేశ భవిష్యత్తుకు పునాదులని గుర్తు చేశారు. ఈ ఏడాది ఆపరేషన్ స్మైల్ 12లో భాగంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 21 కేసులు నమోదు చేసి, 46 మంది బాలురు, 4 మంది బాలికలు కలిపి మొత్తం 50 మంది బాల కార్మికులను విముక్తి చేసి రక్షించామని ఎస్పీ తెలిపారు. వీరిలో 14 మంది బయటి రాష్ట్రాలకు చెందినవారని పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను వెట్టిచాకిరి, బలవంతపు బిక్షాటన, హోటళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, కిరాణా దుకాణాలు తదితర ప్రదేశాల్లో పని చేయించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా పిల్లలు పనిచేస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా అత్యవసర నెంబర్ 112, డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర హృదయపూర్వకంగా అభినందించారు.

# కేసీఆర్‌పై చేయి పడితే రాష్ట్రం అగ్నిగుండం

- కాంగ్రెస్ ఒక్కో నేరానికి మూల్యం చెల్లించాలి
- కేసీఆర్‌ను కించపరచేందుకే సిట్ నోటీసులు
- ధర్నాలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, టౌన్ అధ్యక్షుడు అరెస్ట్
- పోలీసు వాహనం అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



**బోధన్, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ను అవమానకరమైన విధంగా సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్, బీఆర్ఎస్ బోధన్ టౌన్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్‌తో పాటు పార్టీ కార్యకర్తలతో కలిసి రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు వారించారు. అయితే ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే పోలీసులు ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకుని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్, బోధన్ పట్టణ అధ్యక్షులు గాండ్ల రవీందర్ యాదవ్ లను పోలీసులు అరెస్టు చేయడంతో వాతావరణ ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. మాజీ ఎమ్మెల్యే, బోధన్ పట్టణ అధ్యక్షుడు ఉన్న పోలీసు వాహనాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో పాటు వాహనాన్ని అక్కడ నుండి కదలనివ్వకుండా నానా హంగామా సృష్టించారు. ఈ సందర్భంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేయి పడితే రాష్ట్ర మొత్తం అగ్నిగుండముగా మారుస్తామ ని హెచ్చరించారు. తెలంగాణ తెచ్చిన రథ సారథిని సిట్ పేరుతో వేధింపులకు గురి చేయడం కాంగ్రెస్ సర్కారు కుటిల రాజకీయానికి అద్దం పడుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రస్తుతం చేస్తున్న ఒక్కో నేరానికి భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర పాలకులకు అమ్ముడు పోయి తెలంగాణ ద్రోహిగా చరిత్రలో నిలిచి పోతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసి బంగారు తెలంగాణ సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీట్ నోటీసులు అందించి బాధ పెట్టడంతో తెలంగాణ ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా బాధపడుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను విచారణకు పిలవడం కక్ష్యపూరిత వ్యవహారమేనని అయితే భవిష్యత్తులో ఇందుకు తగిన మూల్యం చెల్లిస్తామని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు గాండ్ల రవీందర్ యాదవ్, నాయకులు బీర్కూర్ శంకర్, మధు, రవిశంకర్ గౌడ్, దేవా, పవన్, వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమ ద్రోహి చేత ఉద్యమకారున్ని విచారణ సిగ్గుచేటు

- ఎన్నికలు వస్తేనే రేవంత్ కొత్త డ్రామా
- సిట్ విచారణకు చట్టపరమైన ప్రాతిపదిక లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయం : మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి
- జిల్లా కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయండి



**వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 1 జనంసాక్షి:**
ఉద్యమ ద్రోహి చేత ఉద్యమకారుల్ని విచారణ చేయడం సిగ్గుచేటని ఉద్యమ ద్రోహి చేత ఉద్యమకారుల్ని విచారణ చేయడం సిగ్గుచేటని, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు.తెలంగాణ జాతిపిత కె.సి.ఆర్ ని విచారణ పేరుతో వేధించడాన్ని ,నిరసిస్తూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యములో అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వస్తే, అప్పుడు రేవంత్ కొత్త డ్రామాకు తెరలేపుతాడని,ఓటు ద్వారా కె.సి.ఆర్ మీద అభిమానం చాటుకోవాలని ప్రజలను కోరారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పరిపాలన చేతకాక ప్రజల దృష్టి మరల్చడానికి రెండేళ్లుగా కె.సి.ఆర్ పై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఘాటుగా విమర్శించారు. ఎంత వ్యక్తిగతంగా కె.సి.ఆర్ ని,వేధిస్తే ప్రజల మద్దతుతో కె.సి.ఆర్ ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ తన వెకిలి చేష్టలు మానుకోకపోతే ఇంతకు, పదింతల మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.జిల్లాను ముట్టుకుంటే అగ్గిరాజేస్తామన్నారు.10ఏండ్ల క్రింద పరిపాలన సౌలభ్యం కోసం కె.సి.ఆర్ వనపర్తి జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడుపడితే ,ఈ తీస్మార్ ఖాన్ వచ్చి, మన జిల్లాను రద్దు చేస్తాం అని అంటున్నారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి జిల్లా ఇచ్చిన బి.ఆర్.ఎస్ పార్టీకి ఓటువేస్తారో ,జిల్లా రద్దుచేస్తాం అన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారో ,ఆలోచించుకోవాలని అన్నారు.వేగుల వ్యవస్థ రాజరికం నుండి ఉంది.రాజ్యాంగం ద్వారా సంక్రమించిన సి.ఎం కి రాష్టములో శాంతిభద్రతలు,సాంఘిక కార్యకలాపాలు,తీవ్రవాద సమస్య వంటి సమాచారం ఇంటలిజెన్సీ అందజేస్తుందని, ఈ మాత్రం అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిలిపి,వెకిలి చేష్టలు చేస్తుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ విధ్వంస పాలనకు స్వస్థిపలికి, కె.సి.ఆర్ సంక్షేమం పాలనకు అండగా నిలవాలని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు.
సంక్షేమ చేతకాక సంక్షోభంలో ఉన్న కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుంది మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ అక్రమ కేసులు పెట్టడం మాని, మహిళకు 2500,తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు ధాన్యానికి బోనస్ గ్యాస్ సబ్సిడీ రైతులకు రైతు భరోసా రైతు రుణ మాఫీ రైతు బీమా పథకాలు అమలు చేయాలని స్వామి గౌడ్ డిమాండ్ చేశారు.రాస్తారోకో కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్,బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.






# బొగ్గుకుంభకోణం, జలదోపిడీపై బీఆర్ఎస్ పోరాటాన్ని తట్టుకోలేకే కుట్ర

- రాష్ట్ర సాధకుడు కేసీఆర్ పై రేవంత్ సర్కార్ తీరు దుర్మార్గం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈశ్వర్



**గోదావరిఖని, జనంసాక్షి :**
బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్ట డంతో పాటు జలదోపిడీ పై బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ పై రాష్ట్ర సర్కార్ కక్షసాధింపు చర్యలకు దిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర తొలి సిఎం కేసీఆర్ సీట్ నోటీసులు నేపథ్యంలో లో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు నల్లబడ్జీలు ధరించి నిరసన చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రాన్నిపదేండ్ల పాటు అద్భుతంగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్కు సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. యావత్ తెలంగాణ సమాజానికి మార్గదర్శకుడిగా కేసీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెసు ఓటమి భయం పట్టుకున్నదని, ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మ స్థైర్యం దెబ్బతీసేం దుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సీట్లో ఉన్నది పోలీసులా? లేక, సీఎం రేవంత్ రెడ్డి ప్రైవేట్ సైన్యమా? అన్న అనుమా నాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. రేవంత్రెడ్డి చేసిన చిల్లరమల్లర ప్రయత్నమే ఈ సిట్ నోటీసులు అని దుయ్య బట్టారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలి కానీ, ఈ విధంగావిధ్వంసం చేయడ మేంటని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లిలోని నివాసంలో ఉంటే, నందినగర్లో నోటీసులు ఇవ్వడం ఏంటని నిలదీశారు. కేసీఆర్ కు సిట్ నోటీసు లపై మేధావులు, కళాకారులు తీవ్రంగా పరిగ ణించాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై అక్రమ ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సాకుగా చేసుకుని కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయాలనే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి స్టంట్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రతిపక్షంపై దాడులు చేస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ కక్షపూరిత పాలన సాగుతో ందని మండిపడ్డారు.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకున్న ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్పార్టీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, గోపు అయిలయ్య యాదవ్, పర్లపల్లి రవి, మురళీధర్ రావు, గుంపుల లక్ష్మి,జక్కుల తిరుపతి, జడ్సన్, సట్టు శ్రీనివాస్, బుర్రి వెంకటేష్, కోడి రామకృష్ణ గుర్రం పద్మ రమ్య యాదవ్ పాల్గొన్నారు.

### అంబటి రాంబాబు మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలకు

# నిరసన వ్యక్తం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు

- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 01 (జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు పైన జనవరి 31న మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు మాట్లాడిన అనుచి త వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం తరపున అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... అసభ్యకర, సభ్య సమాజం తల దించుకునేలా, దినపత్రికలలో రాయలేనటువంటి భాషతో, మధుమెక్కిన బూతు పురాణంతో ఆంబోతు అంబటి రాంబాబు దూషించడం వలన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలమైన మా మనోభావాలు దెబ్బతినడం వలన కరీంనగర్ లో నిరసన తెలియజేస్తూ.. అంబటి రాంబాబు తిట్ల పురాణం క్షమించరానిదని, ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలి పెట్టని, రాంబాబు లాంటి ఆంబోతులు భవిష్యత్తులో ఎవరిని దుర్భాషలాడ కుండా, జన్మలో గుర్తుండేలా తగిన ట్రీట్మెంట్ ఇవ్వాలని, ఇలాంటి దుర్మార్గులు ఏ ఎన్నికలలో పోటీ చేయకుండా రాష్ట్ర బహిష్కరణ చేయాలని వంచ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగుల బాలగౌడ్, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ అవునూరి దయాకర్ రావు, రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రవెల్లి రవీందర్, రాష్ట్ర మాజీ యువత కార్యదర్శి ఎర్రవెల్లి వినిత్, కొత్తపల్లి టౌన్ మాజీ అధ్యక్షులు ఆకుల కాంతయ్య, బీసీ సెల్ మాజీ కార్యదర్శి సాయిల్లా రాజమల్లయ్య, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బోలుమాల సదానందం, మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు భాషాలత్ ఖాన్, మహబూబ్ ఖాన్, సందబోయిన రాజేశం, ఎర్రోజు హయాగ్రీవ చారి, వెళముల లక్ష్మణ్ రావు, కళ్యాడపు నరేష్, నందాల శివ ప్రసాద్, మంగళరావు శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

*కొండాపూర్ : 'క్యాన్సర్ భయం వద్దు అవగాహన ఉంటే విజయం మనదే' అంటూ హైటెక్ సిటీ మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఆదివారం బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో 100 మంది మహిళా రైడర్లు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.*

# ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం ప్రారంభం

- రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత ప్రో.డాక్టర్ బంగారి స్వామి.
- రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్ పర్సన్, సీనియర్ ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా.బంగారి రజని ప్రియదర్శిని



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 01 (జనంసాక్షి) :**
ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రమైన రజిని ఫెర్టిలిటీ సెంటర్లో శ్రీ లక్ష్మీ మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా నిర్వహించే ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించడం జరిగింది. దానిలో భాగంగా ఆదివారం రోజు రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత ప్రో.డాక్టర్ బంగారి స్వామి, వారి సతీమణి రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్ పర్సన్, సీనియర్ ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా.బంగారి రజిని ప్రియదర్శిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా డా.రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ... గత 5 సంవత్సరాలుగా ఈ ఉచిత ఇన్ఫర్టిలైటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, క్యాంప్ కి వచ్చే వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ పోతుందని తద్వారా మనలో ఇన్ఫెర్టిలైటీ సమస్య ఏవిధంగా పెరుగుతుందో గమనించాలని, దీనికి మనందరం ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా అధిగమించాలని, సరైన ఆరోగ్యకరమైన ఆహారం, రోజూ వ్యాయామం చేయడం, చెడు అలవాట్లైన మద్యం, పొగాకులకు దూరంగా ఉండడం చేయాలని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం 2026 ఫిబ్రవరి 01వ తేది నుండి ఫిబ్రవరి 28వ తేది వరకు నిర్వహిస్తున్నామని, దీనిలో నమోదు చేసుకున్న వారి నుండి లక్కీ డ్రా ద్వారా పది మంది దంపతులను ఎంపిక చేసి వారికి ఉచితంగా ఐవిఎఫ్ చికిత్సను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ విధంగా గత 5 సంవత్సరాలుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని భవిష్యత్తులో కూడా ప్రతి ఏడు నిర్వహిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రో.డా.బంగారి స్వామి మాట్లాడుతూ... తన తల్లి గారైన కీ.శే.బంగారి లక్ష్మి స్మారకార్థం ప్రతి సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని దాంట్లో భాగంగా ఉచిత కీలు మార్పిడి వైద్య శిబిరం కూడా వచ్చే ఏప్రిల్ నెలలో ఏర్పాటు చేస్తామని అన్నారు. చిన్నతనంలోనే మేము తండ్రిని కోల్పోయినా, మా అందరినీ ఉన్నత విద్య వంతుల్ని చేయడంలో మా తల్లి పాత్ర మరువలేనిదని, మాకు మంచి విలువలతో కూడిన విద్యా బుద్ధులను మాకు నేర్పించడం ఆమె చలవే అన్నారు. మా జీవితం పూర్తిగా వైద్య సేవకే అంకితం అన్నారు. వైద్య రంగంలో వచ్చే ప్రతి ఆధునిక మార్పులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూ.. పేషెంట్లకు ఎప్పటికప్పుడు తగిన మార్పుల ద్వారా ఆధునిక వైద్య విధానాలు అమలు చేయడంలో ఉత్తర తెలంగాణలోనే రెనే హాస్పిటల్స్ ముందుంటాయని అన్నారు. రాబోయే నెలలో ఉచిత రోబోటిక్ కీలు మార్పిడి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని అందులో నుండి సుమారు 15 మంది అర్హులైన నిరుపేద పేషెంట్లను గుర్తించి డ్రా ద్వారా వారికి పూర్తి ఉచితంగా కీలు మార్పిడి వైద్య చికిత్సను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గుండె వైద్య నిపుణులు డా. సురేష్ కుమార్, ఎంబ్రియలాజిస్ట్ డా.రాజేందర్, స్త్రీల వైద్య నిపుణులు డా. ఫర్హానాజ్, డా.మౌనిక, డా.సాయిశ్రీ, డా.సౌఖ్య, హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయో మెడికల్ ఇంజనీర్ రతన్ లతో పాటు హాస్పిటల్ సిబ్బంది, మొదటి రోజు శిబిరానికి వచ్చిన సుమారు 120 మంది పేషెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికే నోటీసులా..?

### కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి : మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 1 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేయడంపై బిఆరెఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని నంది కమాన్ వద్ద ఆదివారం మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి ఆధ్వర్యంలో బిఆరెఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా మ్యాకల రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావుల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు.బొగ్గు స్కామ్ వంటి అంశాలను తెరపైకి తీసుకురావడంతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ వ్యాప్తంగా మళ్లీ బిఆరెఎస్ జెండా ఎగురుతుంద న్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ కక్ష్య సాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. వేములవాడలో మున్సిపల్ పీఠంపై బీఆర్ఎస్ జెండా ఎగురుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అర్బన్ సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు,మాజీ వైస్ ఎంపీపీ ఆర్‌సి. రావు,బండారి శ్రీనివాస్,బూర బాబు, మాజీ సర్పంచ్లు రంగు రాములు గౌడ్,కొండపల్లి వెంకట రమణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
02 ఫిబ్రవరి 2026

## ఖమ్మం వైద్యరంగంలో కూరపాటి ఒక బ్రాండ్


- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- కూరపాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి తుమ్మల



ఖమ్మం, (జనంసాక్షి) : ఖమ్మం వైద్య రంగంలో కూరపాటి అనేది ఒక పేరు కాదని, ఆ పేరుకు ఒక బ్రాండ్ సృష్టించిన ఘనత డాక్టర్ ప్రదీప్ కుమార్ కు దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరపాటి మల్టీ స్పెషాలిటీ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ ను ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరపాటి ప్రదీప్ కుమార్ వైద్య రంగంలో అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటు ధరలో అందిస్తున్న ఘనత కూరపాటికే దక్కుతుందన్నారు. కూరపాటి చిల్డ్రన్ హాస్పిటల్ పేరుతో జిల్లా ప్రజలందరికీ సుపరిచితమైన ప్రదీప్, వైద్యరంగమే కాకుండా, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. తలసీమియా పిల్లలకు ఉచిత వైద్యంతోపాటు, రక్తం అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ప్రదీప్ కుమార్ తండ్రి కూరపాటి వెంకటేశ్వర్లు తనకు ఎంతో కాలం నుండి సుపరిచితులని, రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ రాణిస్తూ తనదైన ముద్ర వేశారని అన్నారు. అలాంటి కుటుంబం నుండి వచ్చిన డాక్టర్ ప్రదీప్ కుమార్ ఖమ్మం జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ హాస్పిటల్ ద్వారా జిల్లా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలి నేని నరేందర్, కాంగ్రెస్ నాయకులు ముక్తార్, ఖమ్మం కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, ప్రముఖ వైద్యులు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లండి

- ఐక్యతతోనే విజయం సాధ్యం
- మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలి
- ఏదులాపురం సన్నాహక సభలో పిలుపు
- మంత్రి కొండా సురేఖ పిలుపు



ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 01 (జనం సాక్షి) : మున్సిపల్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలాలని, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకుని ప్రతి ఇంటి గడపను తట్టాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల క్షేత్రంలో పార్టీ జెండా రెపరెపలాడడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం పోటీ ఉండటం సహజమని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు గాను కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంపై ఆమె స్పందిస్తూ, మనలో మనమే కొట్లాడుకుంటే మూడో వ్యక్తి గెలిచే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నేతలు చొరవ తీసుకుని అభ్యర్థులందరినీ ఏకతాటిపైకి తేవడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, వార్డుకు ఒక్కరే అభ్యర్థి ఉండేలా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రతి కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చాయని ఆమె గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సారథ్యంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఇదే ఊపుతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని ఆయనకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బి-ఫామ్‌లు అందజేస్తామని, అప్పటి నుంచే ముమ్మర ప్రచారం మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. వార్డుల్లో ఘన విజయం సాధిస్తేనే మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కుతుందని, ఐక్యతతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, తుంబూరు దయాకర్ రెడ్డి,తోట చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని విస్మరించిన కేంద్రబడ్జెట్



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి అన్నారు. కేంద్ర ప్రభుత్వం 14 లక్షల కోట్లు అప్పులు, వడ్డీలు కట్టాల్సి వస్తున్నది. పని దినాలు పెంచామని చెప్పినప్పటికీ విబి జిరాంజి పథకానికి కేవలం 93 వేల కోట్లు కేటాయించి గతంతో పోలిస్తే కోత పెట్టారని, వ్యవసాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నిధులు తగ్గించారని, ఈ రంగాలకు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయలేదని తెలిపారు. దేశ కార్పొరేట్ సంస్థలైన ఆదానీ, అంబానీ తదితరులకు డేటా సెంటర్ల పేరుతో రాయితీలు ప్రకటించారని, సంక్షేమ పథకాలు, ఎరువుల రాయితీలు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదని, ఉద్యోగులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకుండా నిరాశపర్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి వాటాగా రావలసిన నిధులు తగ్గించారని, పన్నుల వాటాలో 2.11 శాతం ప్రకారం 63 వేల కోట్లు రావాల్సిందని, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని, ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి కొనసాగేట్లు కనిపిస్తున్నదని, జిఎస్టీ పన్నుల వల్ల ఇప్పటికే రాష్ట్రాలు ఆర్థికంగా సతమతమవుతుంటే పన్నుల వాటాను తగ్గించిందని తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా యివ్వాలని కోరుతున్నా వాటి ఊసే లేదన్నారు. హైదరాబాదు మెట్రో రైల్‌ను విస్తరణకు నిధులు ఇవ్వలేదన్నారు. ఫార్మా రంగానికి అవసరమైన నిధులు కేటాయించలేదని, విద్యా, వైద్య రంగాలు పూర్తిగా కార్పొరేట్‌మయమవుతున్న పరిస్థితుల్లో పేదలకు ఆ రంగాలు అందుబాటులోకి తేవడానికి తగినన్ని నిధులు కేటాయించాలని, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. రాష్ట్రంలో 8మంది బిజెపి ఎంపీలు, మంత్రులు వున్నప్పకీ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో విఫలం చెందారని, కాబట్టి పూర్తిగా సామాజిక తరగతులను, శ్రామిక వర్గాల ప్రయోజనాలకు కేటాయింపులు చేయకుండా కార్పొరేట్ ప్రయోజనాలకే ఉపయోగపడే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తెచ్చి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని, ఇప్పటికైనా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి, రాష్ట్ర ప్రయోజనాలకు, సామాజిక తరగతుల ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

- కేంద్ర మొండివైఖరిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సామాజిక న్యాయ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీసినట్టేనని రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. బడ్జెట్ మొత్తాన్ని పరిశీలిస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై కేంద్ర ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి కూడా లేదన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి, విద్య, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వర్గాల భవిష్యత్తును పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు వివిధ కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ అభివృద్ధి, సామాజిక సంక్షేమ అంశాలపై విన్నవించినా, కేంద్రం మాత్రం మొండివైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి కనీస స్పందన కూడా ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, హాస్టళు,, గురుకులాలు, ఉపాధి పథకాలు, ఆర్థిక సహాయ కార్యక్రమాలకు కేంద్రం నుంచి గట్టి మద్దతు లభిస్తుందని ఆశించామని, కానీ తాజా బడ్జెట్‌లో ఆ వర్గాల ఆశలన్నింటినీ నిరాశగా మార్చారని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని దళితులు, ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని హెచ్చరించారు. ఇది పేదల జీవన భద్రతను బలహీనపరిచే ప్రమాదకర విధానమని మంత్రి అడ్లూరి వ్యాఖ్యానించారు.

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారని మంత్రి తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని అర్బన్ కోర్ – పెరి అర్బన్ – గ్రామీణ తెలంగాణగా మూడు జోన్లుగా విభజించి సమాన, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ హబ్‌గా, పెరి అర్బన్ ప్రాంతాలను మీవీజులు, లాజిస్టిక్ హబ్స్‌గా, గ్రామీణ తెలంగాణను సాంకేతిక వ్యవసాయం, హస్తకళ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యాలకు కేంద్ర సహకారం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. సెమీకండక్టర్ సిటీలు, ఎనర్జీ పార్కులు, ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌లు, డ్రైపోర్టులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇందిరా మహిళా శక్తి మిషన్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వ్యవసాయం, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్యం, విద్య, డిజిటల్ పాలన, హరిత విద్యుత్తు వంటి రంగాల్లో రాష్ట్రం ముందడుగు వేస్తుంటే, ఆ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన బాధ్యతను విస్మరిస్తోందని అన్నారు. ఎస్సీ-ఎస్టీల హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల ముందు ఉంచి ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ప్రశ్నిస్తామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. తెలంగాణకు జరుగుతున్న ఈ అన్యాయంపై మౌనం వహించబోమని, దళితులు–ఆదివాసీల భవిష్యత్తు కోసం అవసరమైతే మరింత తీవ్రమైన ఉద్యమాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఆదివాసీ బిడ్డను.. పారిపోయే రకాన్ని కాదు

- ప్రజల కోసం భక్తుల కోసం పంతం నెగ్గించుకునే రకాన్ని
- మేడారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తప్పుడు ప్రచారంపై నిప్పులు చేరిగిన మంత్రి సీతక్క



ములుగు (జనంసాక్షి) : ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా తనపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మనసా వాచా కర్మణా చిత్తశుద్ధితో ఆదివాసీల అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పరితపించే ఆదివాసి బిడ్డను తాను అని పేర్కొన్నారు. తాను పారిపోయే రకం కాదని, భక్తులు, ప్రజల కోసం పంతం నెగ్గించుకునే రకమని స్పష్టం చేశారు. ఆదివాసి అస్తిత్వం, తల్లుల పట్ల అచంచల భక్తి తన జీవన విధానమని, మేడారం జాతర దిగ్విజయాన్ని జీర్ణించుకోలేక కొందరు చేసే కుట్రలకు భయపడబోనని మంత్రి తెలిపారు. జాతరను విజయవంతంగా నిర్వహించినట్లే, జాతర అనంతరం చేపట్టాల్సిన పనులన్నీ సమర్థంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఐదువేలకు పైగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి మేడారం పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేస్తున్నామని, రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. వీఐపీల అధిక రాకపోకల కారణంగా కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడిన మాట వాస్తవమేనని, ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు కూడా చిక్కుకుపోయాయని మంత్రి వివరించారు. అయితే ఘట్టమ్మ దేవాలయం వద్ద ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఘట్టమ్మ దర్శనం అనంతరం సమ్మక్కకు వచ్చే సంప్రదాయం దృష్టిలో ఉంచుకుని అక్కడ సజావుగా రాకపోకలు కొనసాగించగలిగామని చెప్పారు. ఈసారి రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించగలిగామని తెలిపారు. భక్తితో పాటు బాధ్యత, సంయమనం పాటిస్తూ దర్శనాలకు రావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి ఫలించిందని, అందుకే జాతర బ్రహ్మాండంగా సాగిందని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మలతో తమకు భావోద్వేగ బంధం ఉందని, అందుకే ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించామని చెప్పారు. గుడి నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకుందని, జాతరకు ముందే శాశ్వత నిర్మాణ పనులు పూర్తి కావడం వల్లే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగిందని తెలిపారు. గతంలో జాతరకు ముందు రోజుకు ఒకటి-రెండు లక్షల మంది మాత్రమే వచ్చేవారని, కొత్త గుడి నిర్మాణం అనంతరం ఒక్క రోజులోనే ఎనిమిది లక్షల మంది వరకు భక్తులు తరలివచ్చారని చెప్పారు. తాత్కాలిక ఏర్పాట్లకు బదులు శాశ్వత ఏర్పాట్లు చేయడం వల్లే ఈ రద్దీ సాధ్యమైందని వివరించారు. త్రాగునీరు, టాయిలెట్లు ముందస్తుగానే సిద్ధం చేశామని తెలిపారు. సమ్మక్కను సకాలంలో గద్దెలపైకి తీసుకురావడంలో పూజారులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది కొత్త పోలీస్ సిబ్బంది పూజారులను గుర్తించలేక పొరపాటు జరిగిందని, అది ఉద్దేశపూర్వకమైంది కాదని స్పష్టం చేశారు. క్యాబినెట్ ఒకరోజు మేడారంలోనే ఉండి నిర్ణయాలు తీసుకోవడం చరిత్రాత్మకమని మంత్రి పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శుక్రవారం వీఐపీ తాకిడి ఎక్కువగా ఉండటంతో కొందరు వీఐపీలు 30 నుంచి 40 వాహనాలతో రావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని, ఆ సమయంలో కూడా రాజకీయాలు చేయడానికి కొందరు ప్రయత్నించారని విమర్శించారు. అయినా సాధారణ భక్తులు పూర్తి స్థాయిలో సహకరించడంతో పసర దారిలో ట్రాఫిక్ జామ్ లేకుండా నిర్వహించగలిగామని చెప్పారు. భక్తులు సజావుగా దర్శనాలు చేసుకుని ఆనందంతో తిరిగివెళ్లారని, కొంతమంది భక్తులకు కలిగిన అసౌకర్యానికి ప్రభుత్వం చింతిస్తున్నదని తెలిపారు. ఈ జాతర అనుభవాల ఆధారంగా వచ్చే జాతరలో ట్రాఫిక్ జామ్ పూర్తిగా లేకుండా మరింత పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తల్లుల జనప్రవేశం నుంచి వనప్రవేశం వరకు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించామని, ఆ అప్రమత్తత వల్లే కోట్లాది మంది భక్తులు వచ్చినా సజావుగా దర్శనాలు సాధ్యమయ్యాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మేడారం జాతరలో ప్రమాదాలు జరుగుతాయని కొందరు స్వామీజీలు తప్పుడు ప్రచారాలు చేశారని, సమ్మక్క-సారలమ్మలపై ప్రజల్లో పెరుగుతున్న భక్తిని కొందరు తట్టుకోలేకపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు.



## 4.5 కిలోల గంజాయి స్వాధీనం

- అరెస్ట్, జైలుకు తరలింపు

తొర్రూరు, ఫిబ్రవరి 1 (జనంసాక్షి) : తొర్రూరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ లో తొర్రూరు ఎస్సై టు ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేయుచుండగా హైదరాబాద్ బస్సు ప్లాట్ ఫారం నెంబర్-02 వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు విశాఖపట్నం నుండి హైద్రాబాద్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు అని తెలిసినది. ఇట్టి విచారణలో మొదటి నిందితుడు అయిన గంధం యాకయ్య, తండ్రి: రాములు, 26 సంవత్సరములు, కులం: మాదిగ, వనపర్తి గ్రామానికి చెందిన మరొక వ్యక్తి (జువైనల్) ఇద్దరు హైద్రాబాబుద్ లో ఉండే క్రమం లో గంజాయి తాగుటకు బానిసై, విశాఖపట్నంలో గంజాయి ఎక్కువగా దొరుకుతుందని హైదరాబాద్లో కొందరు ద్వారా తెలుసుకొని, ఇప్పటికీ మూడుసార్లు అక్కడికి వెళ్లి గంజాయి గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయిని కొనుక్కొని హైదరాబాద్కు వచ్చి వారు కొంచెం తాగుటకు ఉంచుకొని, మిగతాది అక్కడ గంజాయి తాగే వారికి అమ్ముకునేవారు. ఈ క్రమంలోనే వీరు గత రెండు రోజులు క్రితం విశాఖపట్నం కు వెళ్లి అక్కడ గంజాయి కొనుక్కొని తిరిగి రైల్లో వెళితే తనిఖీలు ఎక్కువ ఉన్నాయని, బస్సు మార్గం ఉత్తమమని విశాఖపట్నం నుండి బయలుదేరి విజయవాడ ఖమ్మం మీదుగా తొర్రూర్ కి వచ్చి తొర్రూర్ నుండి హైదరాబాద్ పోదాం అనుకున్నారు. అదే మాదిరిగా తొర్రూర్ కి ఈ రోజు తేదీ. 01.2.2026 ఉదయశీ 07.30 గంటలకు ఇక్కడికి రాగా, తొర్రూర్ పోలీసుల కు ఇక్కడ పట్టుబడినారు. వీరిని టి. గణేష్, తొర్రూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## 12వ బడ్జెట్‌లోనూ తెలంగాణకు గుండు సున్నానే

- 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు తీరని అన్యాయం
- 12 ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ సర్కార్
- విభజన హామీలు సహా తెలంగాణకు రావాల్సిన నిధులపై కిక్కురుమనని ఆర్థిక మంత్రి
- కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ (జనంసాక్షి) : వరుసగా 12వ ఏడాది కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ పై ఎక్స్ వేదిక స్పందించారు. పన్నెండేళ్లుగా తెలంగాణను మోసం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఆమె ట్వీట్ చేశారు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారు కానీ ఆచరణలో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్ట్ లకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్ లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

### 8 మంది ఎంపీలను ఇస్తే తిరిగి ఇచ్చింది గుండుసున్నా.

తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి మాత్రం గుండుసున్నా ఇచ్చారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు రావాల్సిన దానికి బదులు పెండింగ్ ఫైల్స్ వస్తున్నాయన్నారు. 34 వేల 367 కోట్ల తో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్ కు క్లియరెన్స్ లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వటం లేదన్నారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సహాకాలు ఏమీ ఇవ్వలేదన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాల జాబితా చాంతాడంతా ఉందన్నారు. ప్రధాని మోడీ చెప్పే కో ఆపరేటివ్ ఫెడరలిజం అంటే తెలంగాణ ప్రయోజనాలను కాలరాయమటేనా అని ప్రశ్నించారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి01 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్ -2026 ను ప్రజల వరకు చేరవేసేందుకు 'కేంద్ర బడ్జెట్ ప్రచార్ అభియాన్ -2026' కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, 'బడ్జెట్ -2026' ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్ర ఇంచార్జి అభయ్ పాటిల్, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ గారు, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పుల్లారావుతో పాటు జిల్లా, మండల, పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు వీక్షించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370